
నా కవితా ఖండికలు



కం. అద్దము ముందర, బుడుగా!

నిద్దుర నటియించ నేల నీవనఁ, జెప్పెస్

నిద్దురలో నేనెంతో

ముద్దుగ నుందు నని నాకు ముందే తెలియస్.

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

నా కవితా ఖండికలు

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాధం

నా కవితా ఖండికలు

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

Naa Kavitaa KhanDikalu (Free E-Book)

Author: M. V. S. Ranganadham

ISBN 978-93-344-0753-2

ప్రచురణ (Publishing): 12 – 09 – 2025

Contact details of author:

M. V. S. Ranganadham
H. No. 5-12-78/46,
Laxmipuri Colony Phase – 2,
Sainikpuri, Hyderabad – 500 094.
Telangana State.
Mob: +91 9818878155
E-Mail: mvsranganadham@hotmail.com

అంకితం

1984లో మా వివాహమైనది మొదలుగా కష్టసుఖాలలో నాకు తోడు నీడగా నిలచిన నా భార్యామణి కామేశ్వరికి



మద్దాలి కామేశ్వరి

ముందుమాట

ఈ పుస్తకంలో నేను వేరు వేరు సందర్భాలలో వ్రాసిన పద్యాలు పొందుపరచాను. వాటిల్లో కొన్ని, ఒక అంశం తీసుకుని వ్రాసినవి ఉన్నాయి. ఉదాహరణకి, ఆవకాయ ప్రాశస్త్యము, నోట్ల రద్దు, కరోనా పద్యాలు / గేయం, ఆపరేషను సిందూరు, వివాహము, రామరాజ్యం అన్న కవితా ఖండికలు ఆ యా అంశాల మీద వ్రాసినవి. కొన్ని కవితా ఖండికలు వివిధ అంశాల మీద వ్యక్తుల మీద నా భావోద్వేగాన్ని వ్యక్తపరిచే ఉద్దేశ్యంతో వ్రాసినవి. ఉదాహరణకి, అమ్మ, అహంకారం, ఆవిష్కరణలు, భావావేశం, గురువులు, స్వగతము, కృష్ణాష్టమి లాంటివి ఈ కోవలోకి వస్తాయి. కొన్ని హాస్యము పుట్టించేవి ఒక శీర్షికలో వ్రాశాను. రకరకాల విషయాల మీద వ్రాసినవి సార్థకంగా కలగూరగంప అన్న శీర్షిక క్రింద ఇచ్చాను. చదవబోతూ రుచి ఎందుకు? ఏ శీర్షికలో ఏముందో చదువుతుంటే మీకే తెలుస్తుంది. ఒక్కమాటుగా ఆ శీర్షికల పేర్లు తెలియాలంటే విషయసూచిక చూడగలరు.

ఈ పుస్తకం లోని 27 శీర్షికలు నిఘంటువు క్రమంలో (dictionary order) ఇవ్వబడ్డాయి. ఒక శీర్షిక "కరోనాపై కదనం" అన్న గేయం 9 పేరాలలో (వాటిని ఇంకేమనాలో తెలియదు) వ్రాసినది. ఇంకో శీర్షిక "రామరాజ్యం" అన్న పేరుతో వ్రాసిన 34 ద్విపదలు. మిగిలిన 25 శీర్షికలలో 186 పద్యాలు ఉన్నాయి.

ఈ పుస్తకంలోని కవితా ఖండికలు అది వరకే నా బ్లాగు "https://mvsranganadham.in/" లో పెట్టడం వలన, కొంత మందికి తెలిసినవే. కొన్ని కవితా ఖండికలు "సంచిక మాస పత్రిక" అనబడే తెలుగు తొలి డైనమిక్ వెబ్

పత్రికలో ప్రచురించబడ్డాయి. ఆ వివరాలు ఆ యా శీర్షికల క్రిందే చెప్పబడ్డాయి. చదవడానికి ఎక్కువ సౌలభ్యమని ఎక్కువ మందికి అందించడానికి వీలవుతుందనీ ఈ ఫ్రీ ఈ-బుక్ (free E-Book) విడుదల చేస్తున్నాను. ఇది నా నాల్గవ ఈ-బుక్. ఇందులో దోషాలు గానీ నచ్చని విషయాలు గానీ ఉంటే పాఠకులు నాకు తప్పక తెలియఁజెయ్యాలని మనవి.

నా రచనలకి మొదటి శ్రోతగా / చదువరిగా ఉండి సద్విమర్శలతో వాటిని సంస్కరించడానికి నాకు పలు విధాల సూచనలు ఇచ్చిన నా భార్య కామేశ్వరికి ఈ పుస్తకం అంకితం ఇస్తున్నాను.

సైనిక్ పురి, హైదరాబాదు, భవదీయుడు,

ది: 12 - 09 - 2025. మద్దాలి వేంకట సత్య రంగనాథం

నా కవితా ఖండికలు

విషయ సూచిక

***

1. అమ్మ

కం. అమ్మ యనగ ప్రకృతేఁ గద,
అమ్మేఁ గద కారణంబు యాశకు రుజకున్,
అమ్మను పుట్టుట సమయుట,
అమ్మకు యనుబంధ మొప్ప యమరుట, మనుటే.

(ప్రకృతి = మూలకారణము; రుజ = రోగము, చెఱుపు; సమయు = నశించు; అనుబంధము = స్నేహపూర్వమైన బంధము, దగ్గఱితనము; ఒప్ప = సమ్మతిగా; అమరుట = కుదురుట; మనుట = జీవించుట)

అమ్మ అంటే మన పుట్టుకకి మూలకారణమైన ప్రకృతే (Nature) కదా. ఆశలకి, చెఱుపుకి కూడా అమ్మే కదా కారణము. అంటే, పిల్లలు బాగుపడటాని కైనా, చెడిపోవడానికైనా అమ్మే కారణము. అమ్మలాంటి ప్రకృతిలో పుట్టడం, నశించడం, అమ్మతో అనుబంధంతో ఉండేటట్లుగా కుదురుకోవడమేగా జీవితం.

2. అహంకారం

1. సీ. జాత్యహంకారంబు జన్మతో సిద్ధింప
యితరుల యాచార మీసడించి,
విధులలో తరతమ భేదమ్ములను యెంచి
కూలివారినిఁ గన్న కొంచపఱచి,
తమవారుఁ జేసిన తప్పు కాదను పను
లితరులుఁ జేసిన యిష్ట పడక,
తంతులు పూజ లుత్తమ ధర్మము లటంచు
భావి తరము లందు భయముఁ బెంచి,

తే.గీ. కాపి రైటు (copyright) మాది పురాణ కథల పైన
యనుచు వక్ర భాష్యంబుల నల్లి మూఢ
భక్తులను ప్రోత్సహించుచు భ్రమల ముంచి
హద్దు మీరెదరు పిదప బుద్ధు లిలను.

(సిద్ధింప = లభింప, ఆచారము = నడవడి, ఈసడించి = నిరసించి, నిందించి; విధులు = పౌరుడు రాజ్యము పట్ల తానున్న సమాజము పట్ల నెరవేర్చ వలసిన బాధ్యతలు, తరతమ = తక్కువ, ఎక్కువ అనెడివి; ఎంచి = గణించి, కొంచపఱచు = అవమానించు, తంతులు = తంత్రములు, వక్ర భాష్యంబులను = తప్పుడు వ్యాఖ్యానాలను, అల్లు = కూర్చు, రచించు; భ్రమ = భ్రాంతి, సందేహము; పిదపబుద్ధులు = నీచబుద్ధులు)

జన్మతో లభించిన జాతిని అడ్డం పెట్టుకుని ఆ అహంకారంతో ఇతరుల ఆచారాలని నిందించి, పనులలో బాధ్యతలలో చిన్నవనీ పెద్దవనీ అంతరాలు సృష్టించి కూలి పనులు చేసుకునే వారిని అవమానించి, తమ వారు చేస్తే తప్పుగా కనిపించని పనులు ఇతరులు చేస్తే ఇష్టపడక, తంత్రాలూ పూజలే ధర్మాలంటూ ముందు తరాల వారిలో భయాన్ని పెంచి, పురాణ కథల మీద మాకు కాపీరైట్ (copyright) ఉందంటూ వాటికి తప్పుడు వ్యాఖ్యానాలు రచించి మూఢ

భక్తులకు ప్రోత్సాహ మిచ్చి భ్రాంతులు, సందేహాలలో ముంచి, నీచ బుద్ధులున్న వారు ఈ లోకంలో హద్దు మీరతారు.

2. కం. తేరగ నన్నియు వచ్చిన
తీరుగ నుండదు నడవడి, ద్వేషము దురహం
కారము కలసి మదిని ధి
క్కారము పెరుగఁ జను యంధకారపు బాటన్.

(తేరగ = ఊరికినే, ఉచితంగా; తీరుగ = పద్ధతిగా: నడవడి = ప్రవర్తన, నడత; ద్వేషము = పగ, ఓర్వలేమి, కోపము; దురహంకారము = చెడ్డ అహంకారము, మది = మనస్సు, ధిక్కారము = తిరస్కారము, అలక్ష్యము; చను = వెళ్ళు)

అన్ని ఉచితంగా, అంటే కష్టపడకుండా, వస్తే ప్రవర్తన తీరుగా ఉండకుండా మనస్సు ద్వేష దురహంకారాలతో అలక్ష్యము పెంచుకుని అంధకారపు త్రోవ తొక్కుతుంది.

3. కం. యోగ్యత లేకయె కలిగెడి
భాగ్యము స్థానము పదవియు భాసిల్లును దౌ
ర్భాగ్యుల వత్తాసున, వై
రాగ్యము మృగ్యము గరువమె రాణించు సుమీ.

(యోగ్యత = అర్హత, భాగ్యము = సంపద, స్థానము = ఉనికి, పదవి = ఉన్నతస్థితి, భాసిల్లును = ప్రకాశించును, వికసించును; దౌర్భాగ్యులు = పనికిరానివారు, నీచులు, అధములు; వత్తాసు = ఇతరుల మాటలకు, ప్రవర్తనకు ఇచ్చే మద్దతు; వైరాగ్యము = లౌకిక సుఖములం దిచ్ఛలేమి, మృగ్యము = వెదుకదగినది, గరువము = గర్వము, అహంకారము; రాణించు = శోభించు)

అర్హత లేకుండా లభించే సంపద, ఉనికి, పదవి, నీచుల మద్దతు ఉంటే వికసిస్తాయి. లౌకిక సుఖాలంటే మోజు లేకపోవడం అన్న మాటే ఉండదు. అహంకారం రాణిస్తుంది సుమా.

3. ఆపరేషను సిందూరు (Operation Sindoor)

[ఈ కవితా ఖండిక "సంచిక మాస పత్రిక" అనబడే తెలుగు తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (మే 25, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/operation-sindoor-mvs-r/]

1. తే.గీ. క్రౌంచ మిథునమ్ము నందు మగ విహగమును
క్రూరుఁడగు బోయ యొక్కడుఁ గూల్చఁ గాంచి,
శోక తప్తుడై వాల్మీకి శ్లోక మందు
నాడు బోయ కిచ్చిన సాపెనయె పునాది
నవ్య సంస్కృతి రామాయణంబు పేర
పరమ యాదర్శమై మన ప్రజల కంద.

(క్రౌంచ = ఒకానొక పక్షి, మిథునము = ఆలుమగల జత, విహగము = పక్షి, క్రూరుఁడు = దయలేనివాడు, బోయ = కిరాతుడు, కూల్చు = చంపు, కాంచు = చూచు, శోకము = దుఃఖము, తప్తుడు = తాపము పొందిన వాడు, నాడు = ఆ కాలములో, సాపెన = శాపము, పునాది = ఆధారము, నవ్య = క్రొత్తది, సంస్కృతి = నాగరికత, పరమ = శ్రేష్ఠమైన, ఆదర్శము = అనుకరింపదగినది, అందు = గ్రహించు)

వాల్మీకి రామాయణం లోని బాల కాండములో 2వ సర్గములో చెప్పబడిన సంఘటన ఇది. తమసా నదీ తీరంలో స్వేచ్ఛగా విహరిస్తున్న క్రౌంచ పక్షుల్లో మగ పక్షిని ఒక బోయవాడు వాల్మీకి మహర్షి చూస్తుండగానే చంపాడు. మగ పక్షి వియోగానికి విలపిస్తున్న ఆడు పక్షిని చూచిన వాల్మీకి హృదయం ద్రవించి ఆయన నోటి నుండి వచ్చిన మాటలివే:

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః, యత్ క్రౌఞ్చ మిథునాదేకమవధీః కామ మోహితం" (నిర్భాగ్యుడవైన ఓ కిరాతుడా! నీవు క్రౌంచ పక్షుల జంట నుండి మన్మథ పరవశమైన ఒక పక్షిని చంపావు. అందుచేత నీవు చాలా కాలం జీవించ కుందువు గాక.)

"ఈ మాటలు నేను శోకార్తుడనై ఉండగా నా నోటి నుండి వచ్చాయి. ఇవి నాల్గు పాదాలలో ఒక్కొక్క పాదానికి సమానమైన అక్షరాలతో ఉన్నాయి. పాడడానికి బాగుంది. అందుకని దీన్ని శ్లోకమనే అనాలి." అని మనస్సులో ఆ మాటలే (శ్లోకమే) మననం చేసుకున్నాడు వాల్మీకి. ఈ మాటలు (శ్లోకము) రామాయణ కథ నంతా సంక్షేపంగా సూచించాయి అని పండిత విమర్శకులు అన్నారు. ఇలాంటి శ్లోకాలే (పాదానికి 8 అక్షరాలు చొప్పున నాల్గు పాదాలకి 32 అక్షరాలతో - అంటే అనుష్టుప్పు ఛందస్సులో) 24,000 వ్రాసి రామాయణాన్ని అందించాడు వాల్మీకి మహాముని. ఇక ప్రస్తుత పద్యం యొక్క అర్థాన్ని పరిశీలిద్దాం.

క్రౌంచ పక్షుల జంటలో మగపక్షిని క్రూరుడైన బోయ ఒకడు చంపడం చూచి, దుఃఖముతో పీడింపబడిన వాడై వాల్మీకి శ్లోక రూపంలో ఆ కాలంలో బోయ కిచ్చిన శాపమే రామాయణం పేరిట క్రొత్త నాగరికతను శ్రేష్ఠమైన ఆదర్శంగా ప్రజలు గ్రహించడానికి ఆధార మయ్యింది.

2. తే.గీ. ఒక్క మిథునమ్మె బోయకు చిక్కె నాడు
యిర్వదైదుగు రాల్మగల్ యిట్లె నేడు
తీవ్రవాదుల హింస కధీన మైరి
యనెడి ఘటన పహల్గాము నందు జరుగ
శక్తి యుక్తుల దోషుల శాస్తిఁ జేసి
జమ్ము కాశ్మీరు కలఁకుల శాంతి నిలిపి
నవ్య నాగరికతకు పునాది వేయు
వాడు యభినవ వాల్మీకి మోడిఁ గాదె?

(ఇర్వదైదుగురు = ఇరవై ఐదు మంది, ఆల్మగలు = దంపతులు, అధీనము = వశము, ఘటన = సన్నివేశము, శక్తి = సామర్థ్యము, యుక్తి = ఉపాయము, దోషి = అపరాధి, శాస్తి = దండన, కలఁకు = ప్రదేశము, పునాది = మూలబంధము, అభినవ = నవీనము)

ఆ కాలంలో ఒక్క జంటే బోయకు చిక్కింది. ఇరవై ఐదుగురు దంపతులు ఈ కాలంలో ఇదే విధంగా తీవ్రవాదుల హింసకు వశమయ్యారు అన్న ఘటన పహల్గాములో (Pahalgam) జరుగగా (అంటే, భర్తలు చంపబడి భార్యలు ఒంటరిగా మిగిలిపోవడం), సామర్థ్యము

ఉపాయములతో అపరాధులకు దండన విధించి జమ్ము కాశ్మీరు ప్రదేశాలలో శాంతిని నెలకొల్పి క్రొత్త నాగరికతకు పునాది వేసినవాడు నవీన వాల్మీకి మన ప్రధాని నరేంద్ర మోడీ కాదా?

3. తే.గీ. భరత మాత సిందూరము వంటి ప్రాంత
మందు తీవ్రవాదులు స్త్రీల సిందురమును
తుడువ యా దుండగులను సింధురము వోలె
"ఆపరేషను సిందూరు" యణచి వేసె.

(సిందూరము, సిందురము = కుంకుమ, దుండగుడు = దుర్మార్గుఁడు, సింధురము = ఏనుఁగు, అణచివేయు = బలప్రయోగం ద్వారా తొక్కివేయు)

భారత మాత నుదుటి కుంకుమ వంటి ప్రాంతమైన కాశ్మీరులో తీవ్రవాదులు స్త్రీల నుదుటి కుంకుమ తుడిచి వేయగా, అనగా వారి భర్తలను చంపి వేయగా, ఆ దుర్మార్గులను ఏనుగు లాగా "ఆపరేషను సిందూరు" అణచి వేసింది.

4. ఆవకాయ ప్రాశస్త్యము

[ఈ కవితా ఖండిక "సంచిక మాస పత్రిక" అనబడే తెలుగు తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (మే 11, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/aavakaaya-praashashtyamu-mvs-r/]

1. కం. ఆంధ్రప్రదేశ మందు పు
రంధ్రులు పెట్టున దనేక రకములను, ప్రవా
సాంధ్రులు సైతము మెచ్చెడి
యాంధ్రత్వమె యావకాయ యవసధ నిధిగన్.

(పురంధ్రి = కుటుంబమును పోషించు స్త్రీ, ప్రవాసాంధ్రుడు = ఇతర దేశాలలో ఇతర రాష్ట్రాలలో నివాస ముంటున్న తెలుగువాడు, సైతము = కూడా, మెచ్చు = శ్లాఘించు, ఆంధ్రత్వము = తెలుగు జాతి వైశిష్ట్యము, అవసధము = గృహము, నిధి = నిక్షేపము)

ఆంధ్రప్రదేశంలో కుటుంబ స్త్రీలు అనేక రకాలుగా (పాతికకు పైగా) పెట్టేది, ఇతర దేశాలలో ఇతర రాష్ట్రాలలో ఉంటున్న తెలుగువాళ్ళు కూడా గృహములో నిధిగా మెచ్చుకునే తెలుగు జాతి వైశిష్ట్యమే ఆవకాయ. అంటే, భోగ భాగ్యాలు కలిగించి సంపన్నులను చేసే నవనిధులతో పాటు, ఆవకాయ పదియవ నిధి అన్న మాట.

2. కం. మావిడి ముక్కల పులుపును,
యావల పొడి, యుప్పు, కార మాచ్ఛాదింపన్,
నూవుల నూనెను యూరగ
యావఁ గొలిపె నావకాయయై యాణెమునన్.

(మావిడి = మామిడి, ఆవలు = ఆవాలు, ఆచ్ఛాదించు = కప్పు, నూవులు = నువ్వులు, ఊరు = నాను, యావ = మిక్కుటమైన ఆసక్తి, కొలుపు = పుట్టించు, ఆణెము = దేశము)

మామిడికాయ ముక్కలలో ఉన్న పుల్లని రుచిని ఆవాల పొడి, ఉప్పు, కారము కప్పివేయగా నువ్వులనూనెలో ఊరి ఆవకాయగా దేశంలో మిక్కుటమైన ఆసక్తి పుట్టించింది.

3. కం. తృష్ణను దాచగ వశమా?
ఉష్ణము తగ్గించు మందు యుష్ణంబె యనస్,
యుష్ణకమె యూరుఁగాయను
కృష్ణిక మధుదూతల రుచికి యదనుఁ గాదా?

(తృష్ణ = ఇచ్ఛ, దాచు = మాటుచేయు, వశము = స్వాధీనము, ఉష్ణము = వేడియైనది, ఉష్ణకము = గ్రీష్మఋతువు, కృష్ణిక = ఆవాలు, మధుదూత = మామిడి, అదను = తగిన సమయము)

కోరికను దాచిపెట్టడం కుదురుతుందా? ఉష్ణం తగ్గించడానికి ఉష్ణమే మందు అన్నట్లుగా గ్రీష్మఋతువే ఊరుఁగాయలో ఆవాల, మామిడి కాయల రుచికి తగిన సమయము కాదా?

4. కం. అన్నమున యావకాయను
విన్నాణముగాఁ గలుపుచు వేసవి యందుస్
వెన్నను నంచుకొనగ రుచి
తిన్నగ స్వర్గంబుఁ జూపి తీర్చును కాకస్.

(విన్నాణము = తగినరీతి, నంచుకొను = కొద్దిగాతిను, తిన్నగ = సరాసరి, కాక = తాపము)

వేసం కాలంలో అన్నంలో ఆవకాయను నేర్పుగా కలుపుతూ వెన్న నంచుకు తింటే వచ్చే రుచి సరాసరి స్వర్గం చూపించి తాపము తీరుస్తుంది.

5. తే.గీ. ఆవకాయను కనుగొన్న యాంధ్ర వనిత
యెవ్వరో, యామె ఘనతను యెన్న తరమె,
నోబెలు బహుమానముఁ గూడ న్యూన మగును,

జగతి మరువదు యట్టి కౌశలము నెపుడు.

(ఘనత = గొప్పదనము, ఎన్ను = తెలిసికొను, తరము = శక్యము, న్యూనము = తక్కువైన, జగతి = లోకము, కౌశలము = నేర్పరితనము)

ఆవకాయను కనుక్కున్న ఆంధ్ర వనిత ఎవరో, ఆమె గొప్పదనము తెలుసుకోవడం కుదురుతుందా? నోబెలు బహుమతి కూడా ఆమెకు తక్కువే అవుతుంది. అలాంటి నేర్పరితనాన్ని లోకం ఎప్పుడూ మర్చిపోదు.

6. కం. శీతల గిడ్డంగుల నా
బూతిని జాగ్రత్తచేయు భోగము లేలా?
మూతికి గుడ్డనుఁ గట్టెడి
చాతురి మన యావకాయ జాడీఁ జూపస్.

(శీతల = చల్లదనము ఉన్న, గిడ్డంగి = గోదాము, ఆబూతి = ఎక్కువ ఆహారము, జాగ్రత్తచేయు = భద్రపరచు, భోగము = సుఖము, చాతురి = నేర్పు)

మూతికి గుడ్డ కట్టే నేర్పు మన ఆవకాయ జాడీ చూపగా, శీతల గిడ్డంగులలో (cold storage) భారీగా ఆహారము భద్రపరిచే భోగాలు ఎందుకు?

7. తే.గీ. ఆవకాయ వెన్న తినిన యువయని యది,
అందుచేతనే వెన్నుడు యాల మందు
గీత బోధించె చెవియొగ్గ క్రీడిఁ, గాని,
యూరుఁగాయల నావకాయై రుచింతు,
పాలలోన నవని నేనె, పార్థ! యనక
యుండుటే వెలితి విభూతి యోగ మందు.

(అవయని = శరీరము, వెన్నుడు = శ్రీకృష్ణుడు, ఆలము = యుద్ధము, గీత = భగవద్గీత, చెవియొగ్గు = శ్రద్ధతో విను, క్రీడి = అర్జునుడు, రుచించు = ఇష్టమగు, నవని = వెన్న, పార్థుడు = అర్జునుడు, వెలితి = లోపము)

ఆవకాయ, వెన్న తిన్న శరీరం అది. అందుకే, శ్రీకృష్ణుడు యుద్ధంలో అర్జునుడు శ్రద్ధతో వినగా భగవద్గీత బోధించాడు. కానీ, ఊరఃగాయల్లో ఆవకాయగా రుచిస్తాను, పాలల్లో వెన్నను నేనే అర్జునా! అని అనకుండా ఉండడమే విభూతి యోగంలో లోపము.

భగవద్గీత 10వ అధ్యాయంలో (విభూతి యోగం) కృష్ణుడు అర్జునునికి తన దివ్య విభూతులలో ముఖ్యమైన వాటిని చెప్పాడు. ఆదిత్యులలో విష్ణువుని, వెలిగించే వాళ్ళలో సూర్యుడిని, మరుత్తులలో మరీచినీ, నక్షత్రాలలో చంద్రుడిని, వేదాలలో సామవేదాన్ని, దేవతలలో ఇంద్రుడిని, ఇంద్రియాలలో మనస్సుని, ప్రాణులలో చేతనత్వాన్ని, రుద్రులలో శంకరుణ్ణి, యక్ష రాక్షసులలో కుబేరుడిని, వసువులలో పావకుడిని, పర్వతాలలో మేరువుని, పురోహితులలో బృహస్పతిని, సేనానాయకులలో కుమారస్వామిని, సరసులలో సాగరాన్ని, మహర్షులలో భృగువుని, శబ్దాలలో ఓంకారాన్ని, యజ్ఞాలలో జపయజ్ఞాన్ని, స్థావరాలలో హిమాలయాన్ని, వృక్షాలలో రావి చెట్టుని, దేవర్షులలో నారదుణ్ణి, గంధర్వులలో చిత్రరధుణ్ణి, సిద్ధులలో కపిల మునిని, గుర్రాలలో ఉచ్చైశ్రవాన్ని, ఏనుగులలో ఇరావతాన్ని, మనుష్యులలో రాజుని, ఆయుధాలలో వజ్రాన్ని, గోవులలో కామధేనువుని, దైత్యులలో ప్రహ్లాదుడిని, మృగాలలో సింహాన్ని, పక్షులలో గరుత్మంతుడిని, పావనం చేసేవాళ్ళల్లో వాయువుని, శస్త్రధారులలో రాముడిని, జలచరాలలో మొసలిని, నదులలో గంగని, విద్యలలో ఆధ్యాత్మ విద్యని, వాదించే వాళ్ళల్లో వాదాన్ని, అక్షరాలలో అకారాన్ని, సమాసాలలో ద్వంద్వ సమాసాన్ని, నాశనంలేని కాలాన్ని, సర్వతోముఖంగా ఉండే ఈశ్వరుడిని, సర్వాన్ని హరించే మృత్యువుని, ఛందస్సులలో గాయత్రిని, మాసాలలో మార్గశీర్షాన్ని, ఋతువులలో వసంత ఋతువుని, వృష్టి వంశస్థులలో వాసుదేవుడిని, పాండవులలో అర్జునుడిని, మునులలో వ్యాసుడిని, కవులలో శుక్రాచార్యుడిని, నేనే అంటూ ఇలాంటివి ఇంకా చేర్చి పెద్ద పట్టిక చెప్పాడు. కాని, ఆవకాయ, వెన్న గురించి మరిచిపోవడం పెద్ద లోపమే. అందునా, అవి తినడం వల్ల వచ్చిన జ్ఞానంతోనే కదా భగవద్గీత చెప్పగలిగాడు.

5. ఆవిష్కరణలు

సీ. సున్నాను కనిపెట్టి శూన్యతఁ బోఁగొట్టి,
గణిత శాస్త్రం బందు గణుతి కెక్కి,
చక్రంబు కనిపెట్టి, చలన యంత్రము లెన్నొ
విద్యుత్తుతోఁ గూర్చి విధుల నేర్చి,
కాగితము కెమెరా కంప్యూటరుయు బల్బు
ముద్రణా యంత్రంబు ముంగి టుంచి,
పెట్రోలు సెల్ఫోను పెన్సిలి సెబెకసు
మహిని యంతర్జాల మహిమ నింపి,

తే. గీ. యిట్టి యావిష్కరణ లెన్నొ యిలకు నిచ్చి,
తిరుగులేనట్టి సంస్కృతిఁ దీర్చి కూర్చి,
జాగృతి ప్రగతి సంపద జగతి కిడిన,
శాస్త్రవేత్తల కీరితి శాశ్వతంబు.

సున్నా (zero) లేకపోతే అంతా శూన్యమే. సున్నాని కనుక్కోవడం గణిత శాస్త్రంలో ఒక విప్లవం. అందుచేత, సున్నాని కనిపెట్టడం శూన్యతని పోగొట్టడమే. సుమారు క్రీ.శ. 628లో ఆ పని జేసి భారత గణిత శాస్త్రవేత్త బ్రహ్మగుప్తుడు గణితశాస్త్రంలో ప్రసిద్ధికెక్కాడు. అలాగే, చక్రం కనిపెట్టడం (invention of wheel). ఎవరు కనిపెట్టారో, ఎప్పుడు కనిపెట్టారో ఇదమిత్థంగా తెలియదు. కానీ, ఈ ఆవిష్కరణ చరిత్ర గమనాన్నే మార్చేసింది. ఇక, మిషనులు (చలన యంత్రాలు - machines), వాటిని విద్యుత్తుతో (electricity) అనుసంధానించి రకరకాల పనులు చేయించడం ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాం. కాగితము కనిపెట్టడం (invention of paper) కూడా చరిత్ర గమనాన్ని మార్చింది. కెమెరా (camera), కంప్యూటరు (computer), బల్బు (bulb), ముద్రణా యంత్రము (printing machine) మన ముంగిట్లోకి వచ్చి మనకి చాలా విధాలుగా ఉపయోగపడుతున్నాయి. Petrol, cell phone, penicillin, abacus, internet మన జీవితాల్లో చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. ఇలాంటి ఆవిష్కరణలు మనకి ఇచ్చి, తిరుగులేనట్టి (irreversible) సంస్కృతిని (culture) తీర్చిదిద్ది జాగరూకత, అభివృద్ధి, కలిమి ప్రపంచానికి ఇచ్చినట్టి శాస్త్రవేత్తలు శాశ్వత కీర్తిమంతులయ్యారు.

6. కంద పద్యాల అందము

1. కం. లతిక వలె నాల్గు మాత్రల,
యతి ప్రాస నియమ లయలను యానముఁ గలదై,
జతియుత గతులస్ జటిలము,
చతురత జిగిబిగి కొక కవచము కందమెగా.

(లతిక = తీగ, నాల్గు మాత్రలు = నాలుగు లఘువులు లేక రెండు గురువులు లేక ఒక గురువుతో రెండు లఘువులు, యతి = పద్యమందు విశ్రామస్థానము, ప్రాస = పద్యపాదమున రెండవ యక్షరము, లయ = సంగీత పరంగా హెచ్చుతగ్గులు లేకుండా గానం సాగడానికి తోడ్పడే ఒక క్రమం, యానము = ప్రయాణము, జతి = గాననాట్యయోగ్య శబ్దసంతతి, యుత = కూడుకొన్నది, గతి = గమనము, జటిలము = చిక్కైనది, చతురత = నేర్పు, జిగి = తళుకు, బిగి = బిగువు, జిగిబిగి = మృదుమధురమైన పదప్రయోగం, కవచము = తనుత్రాణము)

చతుర్మాత్రా ఛందస్సుతో లత లాగా యతిప్రాస నియమాలతో లయబద్ధంగా సాగునదై, జతియుత గమనంతో గాఢముగా ఉన్నదీ, నేర్పుకీ మృదుమధురమైన పదప్రయోగానికీ, కవచం కంద పద్యమేగా.

2. కం. కందము సృజనకు పందెము,
విందగు వీనుల, మరంద వీచికి నాట్యం
దిందిరమై, కవితా సుధ
లందించును, సుందరమగు హల్లీసకమై.

(సృజన = కల్పన; పందెము = స్పర్థ, పోటి; వీనుల = చెవులకు; మరంద = పూఁదేనె, మధువు; వీచి = అల, ఇందిందిరము = తుమ్మెద; సుధ = అమృతము; సుందరము = అందము, హల్లీసకము = స్త్రీలు పెక్కండ్రు చేరి మండలాకారముగ తిరుగుచు చేయు నృత్యము)

కంద పద్యము వ్రాయడం అంటే కల్పన చెయ్యడంలో పోటీ అన్నట్లు. అది చెవులకు విందు. పూదేనె అలలకి నృత్యం చేసే తుమ్మెదలా అందమైన హాల్లీసకమై కవితామృతాన్ని అందిస్తుంది.

3. కం. తక్కువ మాటల మాటున
యెక్కువ యర్థంబుఁ జెప్ప నిమ్ము లభించన్
వాక్కుల నల్లుచు కందము
నక్కజముగ వ్రాయఁ గలుగు హర్షియె కవియౌ.

(ఇమ్ము = ఆనుకూల్యము, వాక్కు = మాట, అల్లు = రచించు, అక్కజము = ఆశ్చర్యము, హర్షి = సంతోషముగలవాఁడు)

తక్కువ మాటలలో చాల ఎక్కువ అర్థము చెప్పడానికి ఆనుకూల్యము లభించగా మాటలని కంద పద్యంలో అల్లుతూ వింతగా వ్రాయగలిగే హర్షియే కవి ఔతాడు.

4. కం. కందముఁ జెప్పుట కష్టమె
యెందును లేనన్ని మితులు యిందుల నుంటన్
కందము వ్రాసిన కవి యన
యందము రూపించు పలుకు లందల మిదియే.

(మితులు = హద్దులు, నియమములు; రూపించు = నిరూపించు, రూఢిచేయు; అందలము = పల్లకి)

కంద పద్యంలో నియమాలు ఎక్కువ ఉండటం వల్ల అది చెప్పడం కష్టం అంటారు. కందము వ్రాసిన వాడే కవి యనగా అందాన్ని రూఢి చేసే పలుకుల పల్లకీ ఇదే.

5. కం. ఎందును కానని యందము
కందములోఁ గాన వచ్చు కఠినం బైనన్

యిందున భావము దండను
పొందికగా పూస లట్లుఁ బొసగుట వల్లన్.

(పొందిక = ఇమిడిక, పొసగు = ఇముడ్చు)

కఠినమైనా కూడా, కంద పద్యంలో ఎక్కడలేని అందం కనిపిస్తుంది. ఎందుచేత అంటే, ఇందులో, హారంలో పొందికగా పూసలు ఇమిడ్చినట్లుగా భావము ఉండటం వల్ల.

6. కం. కందము నా కల మందున
సుందరముగ కందళించు సూనృత వాక్కుల్,
బొందును శిష్టామోద, మ
మందానందమును పెంచి మహిలోఁ బంచున్.

(సుందరము = అందము, కందళించు = అంకురించు, సూనృతము = ప్రియమును సత్యమునైనది, వాక్కు = మాట, శిష్టుడు = సదాచార సంపన్నుడు, ఆమోదము = సమ్మతము, అమంద = చురుకైన, మహి = భూమి)

నా కలంలో కంద పద్యము అందంగా నిజాల్ని మొలకెత్తిస్తుంది. శిష్టుల ఆమోదాన్ని పొందుతుంది. లోకంలో ఎక్కువ ఆనందాన్ని పెంచి పంచుతుంది.

7. కరోనాపై కదనం

కరోనా వైరసు (Corona virus) ప్రపంచం అంతా వ్యాపించిన రోజుల్లో వ్రాసిన కవిత ఇది.

విశ్వవిజేత కావాలనుకున్న అలెగ్జాండరు కేగతి పట్టింది?
అందరినీ ఇబ్బంది పెట్టిన ఆర్థిక మాద్యం ఎన్నాళ్ళుంది?
రెండేసి ప్రపంచ యుద్ధాలు చూసిన తర్వాత కూడా తెలియ లేదా,
మానవ సంఘటిత శక్తి ముందు ఏదైనా తలవంచాలని

ఆయుధ శక్తి అంతగా లేని రోజుల్లో
ఏ ఆయుధం అవసరం లేకుండా పోరాడాం
సహాయ నిరాకరణం, సత్యాగ్రహం, అహింస అన్న ఆయుధాలే
మనల్ని గట్టెక్కించాయి, మనకి స్వతంత్రాన్నిచ్చాయి
అప్పుడే మరచారా ఆ అహింసా యుద్ధం

ఎదుర్కొందాం ఇప్పుడున్న స్థితి
విశ్వాన్ని కబళిద్దా మనుకున్న కరోనా వైరసు (Corona virus) ఉద్ధతి

అది మనకి కనపడకుండా మన చుట్టూ ఉండి
మన సాయంతో ఒకర్నించి ఒకరికి పాకి
మనల్ని మనమే నాశనం చేసుకునేట్టు చేసే సమ్మోహనాస్త్రం

కరోనా కదనంలో ఏకాంతమే మనకున్న ఆయుధం
వైద్యులు, శాస్త్రవేత్తలు, పోలీసులు, స్వచ్ఛతా సిబ్బంది,
సామాజిక కార్యకర్తలు, మీడియా మిత్రులు మన సేనానులు
సమస్త మానవ సంకల్పశక్తి మనం వాళ్ళ కిచ్చే ప్రోత్సాహం

మన జీవన సరళికి ఆటంకం అయినా
మన స్వేచ్ఛని హరిస్తున్నా
మన ఆరాటం దిగమింగుకుని
మన చుట్టూ అల్లుకున్న ప్రపంచంలో
సాలీళ్ళలా ఉంటూనే
నిశ్శబ్ద యుద్ధం (silent war) ప్రకటిద్దాం
నిష్క్రియాత్మక ప్రతిఘటన (passive resistance) సాగిద్దాం

భిన్నత్వంలో ఏకత్వం (unity in diversity) అంటే
మనుషులు దూరంగా ఉన్నా
మనసులు ఒకే లక్ష్యానికి దగ్గరవ్వడం
అనే కొత్తర్థం చెప్పుదాం

మనం ఇప్పటి వరకు చేసిన యుద్ధాల కన్నా
ఇది విభిన్నమైన యుద్ధం
యుద్ధాల్లో బహిరంగంగా పోరాడి గెలుస్తారు
జననష్టం, ఆస్తి నష్టం కలిగిస్తారు
కరోనా యుద్ధంలో ఏ నష్టం రాదనిపిస్తారు
అంతఃపుర అనాయాస క్లేశం ఒక్కటే ఉంటుందనిపిస్తారు

కరోనా వైరసుని నిర్వీర్యం చేద్దాం
మానవ జాతిని మళ్ళీ గెలిపిద్దాం.

8. కరోనాపై పద్యాలు

కరోనా వైరసు (Corona virus) ప్రపంచం అంతా వ్యాపించిన రోజుల్లో వ్రాసిన పద్యాలు ఇవి.

1\. కం. మడి బతుకు మరల వచ్చెను,
వడిగా మన దేశమందు, వైరసు (virus) కృపచే,
తడబడె జనజీవనములు,
మెడ వంచితి మమ్మ నీకు మేము, కరోనా (corona)!

ఓ కరోనా! వైరసు పుణ్యమా అని మడి బతుకు చాలా వేగంగా మళ్ళీ మనదేశంలో వచ్చింది. జనజీవితాలు తడబడ్డాయి. నీకు మెడలు వంచామమ్మా, కరోనా.

2\. కం. మంచైనా తలకెక్కదు,
దంచైనా చెప్పవలయు తగు జాగ్రత్తల్,
యెంచైనా పరిమితులను
మించైనా వంచ వలయు మిడుకు కరోనా.

(ఎంచు = గణించు. లెక్కించు, మిడుకు = సంచరించు)

మంచి చెప్పినా తలకెక్కదు. నాలుగు తన్నైనా తగిన జాగ్రత్తలు చెప్పాలి. సరిగా గణించి, అవసరమయితే హద్దులు మీరి అయినా, వ్యాపించే కరోనాని అదుపు చేయాలి.

3\. కం. చైనా దిగుమతి చేసె క
రోనా, చిత్రముగ దాని రూపు పొడగనన్,
చైనా కిట్లనె (kits) వాడుచు
చైనా మాస్కులె (masks) ధరింత్రు శౌచము కొరకై.

(పొడగను = చూచు, శౌచము = పారిశుద్ధ్యము)

కరోనా చైనా దేశం నుండి మనకి దిగుమతి అయ్యింది. విచిత్రము ఏమిటంటే, దాని ఉనికి కనుక్కోవడానికి చైనా నుండి వచ్చిన కిట్లనే వాడుతూ, శుభ్రం కోసం చైనా మాస్కులే ధరిస్తారు.

4. కం. చైనా దోశలు, గారెలు
చైనా, బొబ్బట్ల రిసెలు చైనా, యంచుస్
గానము యింటను విని విని,
'చైనా' యన యొక్కపాటి జంకు జనించెస్.

దోశలు చైనా (చేసి పెట్టనా), గారెలు చైనా, బొబ్బట్లు, అరిసెలు చైనా అంటూ 'చైనా' గానము ఇంట్లో విని వినీ, 'చైనా' అంటే ఒక విధమైన భయము మొదలైంది.

5. కం. చైనా దోశని సతి యన,
ఆనాటివి పిండి వంట లట్లె కరోనా (cheyyavaa),
పోనాడితి నన్ని రుచులు,
యానాడే పట్నె మొచ్చి, యనె పతి దుగ్ధస్.

(పోనాడు = పోగొట్టుకొను, దుగ్ధ = మిక్కిలి బాధ)

దోశ చైనా (చేసి పెట్టనా) అని భార్య అనగా, పిండివంటలు అది వరకు చేసినంత బాగా కరోనా (హిందీలో) అంటే చెయ్యవా, ఆనాడే పట్నం వచ్చి అన్ని రుచులు పోగొట్టుకున్నాను అని భర్త బాధగా అన్నాడు.

6. కం. ఎందో కలదని, యది మా
సందున మా చుట్టుపట్ల ఛాయగ నైనస్
యెందు కరోనా లేదం
చందురు, తెలియక వయిరసు (virus) వ్యాప్తియు పొడయుస్.

వైరసు స్వరూపము, దాని వ్యాప్తి గురించి తెలియని వాళ్ళు, ఎక్కడో ఉంది గానీ, మా సందులో గానీ, మా చుట్టుపక్కల గానీ, నీడగానైనా కరోనా లేదని అంటారు.

7. కం. మందులు లేవు కరోనా
కెందును, యాపై యిదేమి యేకాంత మనస్
యిందున జనతా కర్ఫ్యూ(curfew),
సందులలోఁ గూడ పానశాలలు మూసెస్.

కరోనాకి ఎక్కడా మందులు లేవనుకుంటుంటే, ఆపైన ఇదేమి ఏకాంతమండీ. ఇక్కడ ప్రజలు పెట్టిన కర్ఫ్యూ వల్ల సందుల్లో కూడా మందుషాపులు మూశారు.

8. కం. సోషల్ డిస్టన్సిం (social distancing) గన
కాషాయాంబర ధరులకె కాదు, కరోనా
నాశము నాపగ జనులకు
యాశాజనకముగ నుండి యడచును వ్యాప్తిస్.

(అడచు = అణచు)

సన్యసించిన వాళ్ళు సాధారణంగా అందరికీ దూరంగా ఉంటారు. అంటే సోషల్ డిస్టన్సింగ్ చేస్తారన్నమాట. ఈ పద్యంలో చెప్పినదేమంటే, సోషల్ డిస్టన్సింగ్ వాళ్ళకే కాదు, ప్రజలకు కూడా కరోనా వ్యాప్తిని అణచి దానివల్ల జరిగే నాశనాన్ని ఆపడంలో ఆశాజనకంగా ఉంటుంది.

9. కం. చెప్పులు స్టాండు (stand) నఁ బెట్టగ
తెప్పున మాయమగు చుండ తెలిసెస్ గాంచస్,
తిప్పలు తప్పక చెప్పులు
చప్పున పెట్టితిరి మందు షాపుల (shops) క్యూ (queue) లో.

(తెప్పున = శీఘ్రముగా, తిప్పలు = కష్టములు, చప్పున = వెంటనే)

సోషల్ డిస్టన్సింగ్ వచ్చిన తర్వాత మందు షాపుల క్యూలలో మనుషులు నిలబడడం కష్టమైంది. ఒక వేళ నుంచున్నా, చాలా ఎడం ఎడంగా నుంచోవాల్సి వస్తోంది. అందునా, బయట ఎండగా ఉంటే ఇంకా కష్టం. దానికి మార్గము ఏమిటయ్యా అంటే మందు షాపుల క్యూలో చెప్పులు పెట్టడం. స్టాండులో పెట్టిన చెప్పులు గభాల్న మాయమవుతూ ఉంటే, చూడగా తెలిసింది. తిప్పలు తప్పక వాటిని వెంటనే తీసుకెళ్ళి మందు షాపుల క్యూలో పెట్టారని.

10. కం. ఒకరి నొకరు కలిసికొనుట
కిక పొసగదుఁ గద కరోన యిక్కట్ల వలన్,
యిక మనమున భావింపుడు
సకల జనుల సుఖము, మంచి జరుగును మీకున్.

(పొసగదు = అనుకూలించదు)

కరోనా తెచ్చిన కష్టాల వల్ల ఇక ఒకరినొకరు కలుసుకోవడానికి వీలు పడదు. అందుచేత, మనసులో అందరికి శుభం జరగాలని కోరుకోండి. మీకు కూడా మంచి జరుగుతుంది.

11. కం. ఊరక బజారు కెళ్ళిన
పోరాయని పోలిసోళ్ళు పొమ్మని తరిమే
తీరరయఁ దెలియు, పతుల బ
జారు కెదో వంక పంపు జాణల తీరే.

(అరయ = విచారించ, పరిశీలించ; జాణ = తెలివైన స్త్రీ)

ఊరికే బజారులో తిరిగితే తరిమికొట్టే పోలీసు వాళ్ళ తీరును పరిశీలిస్తే, భర్తలని ఏదో ఒక వంకతో బజారుకు పంపే జాణల తీరే తెలుస్తుంది.

12. మ. కరొనాపై కదనంబునన్ గలసి సంకల్పంబులన్ జేయగా

పరివారంబులు దేశ మంతటను దీపంబుల్ బ్రకాశింపఁ జే
యరె చప్పట్లను పారిశుద్ధ్యమునకై హాహా ధ్వనుల్ జేయరే,
తరుణోపాయము వేరె యుండ కరొనా ధ్వంసంబుఁ జేయంగ, యం
దరు మాగాయకు హింగుతో తిరుగమూతన్ బెట్టగన్ ఘాటుచే
మరణించున్ మరి దేశ మందు కరొనా మాటైన విన్పింపకన్.

(హింగు = ఇంగువ)

కరోనా ధ్వంసం చేయడానికి తరుణోపాయము వేరే ఉండగా, కరోనాపై యుద్ధంలో కలసి సంకల్పం చేయడానికి కుటుంబాలు దేశమంతా దీపాలు వెలిగించారే. పారిశుద్ధ్యం కోసం చప్పట్లతో హాహాకారాలు చేశారే. అందరూ ఒకేసారి మాగాయలో ఇంగువ తిరగమూత పెటితే, ఆ ఘాటుకి దేశంలో కరోనా మాటే వినపడకుండా పోతుంది.

13. కం. మన వంటలలో వాడెడి
దినుసులు, పచ్చళ్ళలోన దిమ్మ తిరుగగన్
ఘన హింగు తిరగమూతయు,
దునుము కరోనా (corona) వయిరసు (virus) దుర్భర వ్యాప్తిన్.

మన వంటలలో వాడే దినుసులు, పచ్చళ్ళలో దిమ్మ తిరిగేటట్లుగా వేసే ఇంగువ తిరగమూత, భరింపలేని కరోనా వైరసు వ్యాప్తిని నాశనం చేస్తాయి.

14. కం. మన శుభ్రతె మన స్వర్గము,
మన శానిటయిజరె దిక్కు, మన చిక్కంబున్
మన కేకాంతమె రక్షర,
మనకున్ దిరుగుడె నరకము, మానుము మనిషీ!

మన శుభ్రతే మనకు స్వర్గము. మన శానిటైజరే (sanitizer) శరణము. మన చిక్కము (mask), మన ఏకాంతమే మనకి రక్ష. మనకి తిరుగుడే నరకము. అందుచేత, ఓ మనిషీ! అది మానివేయుము.

9. కలగూరగంప

వేరు వేరు సందర్భాలలో వ్రాసిన పద్యాలు ఈ శీర్షికలో ఇవ్వబడ్డాయి.

1. శా. తల్లీ! ప్రేరణ వీవె నాకు పలు కైతల్ వ్రాయగన్, నీవు నా
యుల్లం బందు యమోఘ భావములు యత్యుత్సాహమున్ నింపి, నా
కుల్లేఖింపగఁ జాలు వస్తుతతులన్ యుద్దీపితం బొంద నా
కుల్లాసంబగు మానసంబు సతమున్ యోజించిఁ బ్రోవం గదే.

(ప్రేరణ = ఉత్తేజ పరచుట, పలు = అనేక, కైత = కవిత, ఉల్లము = మనస్సు, అమోఘ = వ్యర్థము కాని, అతి = ఎక్కువ, ఉత్సాహము = గొప్పపనికై చేయునట్టి యుద్యోగము, ఉల్లేఖించు = విస్తరించి వ్రాయు, వస్తు = ఇతివృత్తము, తతి = సమూహము, ఉద్దీపితము = ఉద్రేకింప జేయ బడినది, ఉల్లాసము = ఆనందము, మానసము = మనస్సు, సతము = ఎల్లప్పుడు, ఓజించు = సమకూర్చు, ప్రోచు = కాపాడు)

"తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్" అన్న పోతన గారి ప్రసిద్ధమైన పద్యం ఉంది. ఆ పద్యం నాకు చాలా ఇష్టం. అలాంటి పద్యం వ్రాయలని చిన్న ప్రయత్నం చేసి ఈ పద్యం వ్రాశాను. ఓ మాతా! పెక్కు కవితలు వ్రాయడానికి నీవే నాకు ప్రేరణ. నీవు నా మనస్సులో సార్థక భావాలను, అత్యుత్సాహాన్ని నింపి, నాకు విస్తరించి వ్రాయడానికి వీలయ్యే విషయాలన్నీ ఉద్రేకింపబడేటట్లుగా, నాకు ఆనందంతో నిండిన మనసును నిత్యము సమకూర్చి నన్ను కాపాడుము.

2. ఉ. ఏ గిరిపై యుమా సతికి యీశ్వరుపై యనురాగ మబ్బెనో,
యే గిరి భారతావనికి యెన్నగలేని సుసంస్కృతిన్ యిడెన్,
యే గిరి జీవధారలుగ యెప్పుడు పారు నదుల్ యొసంగెనో,
యే గిరి పెద్దనాది సుకవీశ్వరు లందరి ప్రేరణం బయెన్,
యే గిరి సర్వ ప్రాణులకు నింపుగ సంగతిఁ గూర్చి పెంచునో,
యే గిరి యోగి పుంగవుల కీగిని నేర్పుచు నీసుఁ ద్రుంచునో,

యే గిరి యుత్తరాన యొక యెత్తగు కోటగ రక్షణస్ యిడుస్,
యే గిరి చంద్రవంక వలె హేరముగా వెలుగొందు చుండునో,
యా గిరియే హిమన్నగము యక్షయమై కనువిందుఁ గొల్పెడిస్.

(గిరి = పర్వతము, ఉమ = పార్వతి, సతి = స్త్రీ, ఈశ్వరుడు = శివుడు, అనురాగము = ప్రేమ, అబ్బు = ప్రాప్తించు, అవని = భూమి, ఎన్ను = ఆక్షేపించు, సుసంస్కృతి = మంచి నాగరికత, ఇడు = ఇచ్చు, ఎప్పుడు = నిత్యము, పారు = ప్రవహించు, ఒసంగు = ఇచ్చు, ప్రేరణ = పురికొలుపడము, సర్వ = అన్ని, ఇంపు = ఇష్టము, సంగతి = సాహచర్యము, కూర్చు = కూడబెట్టు, పెంచు = పెరిగేటట్లు చేయు, యోగి = ముని, పుంగవులు = శ్రేష్ఠులు, ఈగి = త్యాగము, ఈసు = ఈర్ష్య, త్రుంచు = ముక్కలు చేయు, హేరము = కిరీటము, వెలుగొందు = ప్రకాశించు, హిమన్నగము = హిమవత్పర్వతము, అక్షయము = శాశ్వతము, కనువిందు = కన్నులపండువు, కొల్పు = కలిగించు)

ఏ గిరి మీద పార్వతీదేవికి ఈశ్వరునిపై ప్రేమ లభించిందో, ఏ గిరి భారత భూమికి ఆక్షేపించలేని గొప్ప నాగరికత ఇచ్చిందో, ఏ గిరి జీవధారలుగా నిత్యము ప్రవహించే నదులను ఇచ్చిందో, ఏ గిరి పెద్దనాది కవీశ్వరులకు ప్రేరణ అయ్యిందో, ఏ గిరి అన్ని జీవరాసులకు చక్కటి సాహచర్యము కూర్చి పెంచుతుందో, ఏ గిరి మహాయోగులకు త్యాగము నేర్పుతూ ఈర్ష్యను తొలగిస్తుందో, ఏ గిరి ఉత్తర దిక్కున ఒక ఎత్తైన కోటగా రక్షణ ఇస్తుందో, ఏ గిరి చంద్రవంకలాగా అర్ధచంద్రకారంలో కిరీటం లాగా ప్రకాశిస్తూ ఉంటుందో, ఆ గిరియే హిమాలయ పర్వతము. అది శాశ్వతంగా ఉండి మనకు కనువిందు గొలుపుతూ ఉంటుంది.

3. శా. శ్రీ కైవల్యము లన్న నేమి సులువా? శ్రీయున్న గర్వంబు మా
కై కైదండఁ గొనుస్, స్వబంధు జనులుస్ కైలాటకాళ్ళుస్ సదా
మాకై తప్పుడు మార్గముల్ వెదకుచుస్ మమ్మాట పట్టింతురే,
యీ కైతల్ మము మార్చబోవు, తెర వీవే యిమ్ము, కామేశ్వరీ!

(శ్రీకైవల్యము = మోక్షసామ్రాజ్య లక్ష్మి, శ్రీ = సంపద, కైదండగొను = చేయూత నొసగు, కైలాటకాడు = మాయోపాయము కలవాడు, సదా = ఎల్లప్పుడు, తప్పుడు = చెడ్డ, కైత = కవిత్వము, తెరవు = విధము, ఈవు = నీవు)

మా గురువుగారు 'కామేశ్వరీ' అన్న మకుటంతో శతకం వ్రాశారు. నేను కూడా ఆ మకుటంతో ఒక పద్యం వ్రాయాలని ఈ ప్రయత్నం చేశాను. మోక్షసామ్రాజ్య లక్ష్మిని పొందడం అంటే తేలికా? సంపద ఉన్నదన్న గర్వము మా కోసం చేయూత నిస్తుంది. ఆత్మీయ బంధుకోటి, మోసగాళ్ళు, ఎప్పుడూ మా కోసం తప్పుడు మార్గాలు వెదుకుతూ మమ్మల్ని ఆట పట్టిస్తారు. ఈ కవిత్వాలు మమ్మల్ని మార్చబోవు. ఓ కామేశ్వరీ! నీవే మార్గము బోధించుము.

4. ఉ. తీరునె పాపకర్మములు, తీవ్ర జపంబులు దీక్ష లర్చనల్
జోరుగఁ జేసి నంతనె, ద్విజోత్తముకైన తదన్యుకైన, య
జ్ఞారుల గాథలన్ గరపు జ్ఞాన మిదేఁ గద, సాధువృత్తమున్
యోరిమి యున్న చాలు, చిరువోలు పురీశుడ రామభద్రుడా!

(తీరునె = దిద్దుబాటగునా, పాపకర్మములు = చెడ్డ పనులు, తీవ్ర = ఉధృతంగా, జపము = మంత్రావృత్తి, దీక్ష = యజ్ఞయాగాదులు [వ్రతాలు మొదలైన సందర్భాలలో దీక్షాధారణ విధి], అర్చన = పూజ, జోరుగ = ఉత్సాహముగా, ద్విజ = బ్రాహ్మణుడు, తత్ = ఆ, అన్యుడు = ఇతరుడు, యజ్ఞారి = రాక్షసుడు, గాథ = చరిత్రము, కరపు = నేర్పు, జ్ఞానము = తెలివి, సాధువృత్తము = సత్ప్రవర్తన, ఓరిమి = క్షమ)

మా గురువుగారు "చిరువోలు పురీశుడ రామభద్రుడా" అన్న మకుటంతో శతకం వ్రాశారు. ఆ మకుటంతో నాకు కూడా పద్యం వ్రాయాలని అనిపించి ఈ పద్యం, దీని తరువాతి పద్యం, వ్రాశాను. చిరువోలులో వెలసిన ఓ రామభద్రుడా! బ్రాహ్మణోత్తమునికైనా, వేరెవరికైనా, ఉధృతంగా జపాలు జోరుగా దీక్షలు పూజలు చేసినంత మాత్రాన చేసిన చెడ్డపనులు దిద్దుబాటవుతాయా? అంటే, వాటి పర్యవసానం అనుభవించక్కర్లేకుండా పోతుందా? రాక్షసుల చరిత్రము లన్నిటిలో నేర్పే జ్ఞానము ఇదే కదా. సత్ప్రవర్తన, క్షమ ఉంటే చాలు కదా.

5. ఉ. ధారుణి యందు ధర్మము నుదంచిత భంగము నుండిఁ గావ నీ
వారట చెందిఁ గాదె, పలు యాకృతులన్ ధరియించి, శిష్టులన్
కారుణికత్వమున్ నిలిపి, కావరులన్ గురిఁజేసి శిక్షకున్,
యూరట నిచ్చినావు, చిరువోలు పురీశుడ రామభద్రుడా!

(ఉదంచిత = విజృంభించినది, భంగము = అవమానము, కాచు = రక్షించు, ఆరట = విచారము, పలు = అనేక, అకృతి = రూపము, శిష్టులన్ = సాధువులందు, కారుణికత్వము = దయాభావము, కావరి = ధూర్తుడు, శిక్ష = దండనము, ఊరట = నిరుత్సాహ సమయంలో కలిగే ఉపశమనం)

ఓ, చిరువోలు పురీశుడైన రామభద్రుడా! ఈ లోకంలో ధర్మాన్ని విజృంభించే భంగపాటు నుండి కాపాడాలని నీవు విచారించి, అనేక రూపాలు ధరించి సాధువు లందు దయాభావాన్ని నిలిపి, ధూర్తులను దండనకు గురి చేసి ఊరట కలిగించావు.

6. కం. స్వాతంత్ర్యము మన కొచ్చెను,
జాతికి లక్ష్యము దొరికెను, జాగృతి హెచ్చెన్,
ఘాతక కృత్యము లున్నను,
నేతల కొరతున్న, యాప నేరవు ప్రగతిన్.

(జాగృతి = జాగరూకత, ఘాతుక = క్రూరమైన, కొరత = వెలితి)

మనకి స్వాతంత్ర్యము వచ్చింది. మన భారత జాతికి ధ్యేయము దొరికింది. జాగరూకత పెరిగింది. క్రూరకృత్యాలు ఉన్నప్పటికీ, నాయకత్వలోపము ఉన్నప్పటికీ, అభివృద్ధిని ఆపలేవు.

7. కం. యక్షుడు ప్రశ్నలు యడుగగ,
దక్షతగా నుత్తరములు ధర్మజు డిచ్చెన్,
దీక్షగ శిక్షణ ముండిన,

రక్షణ కది సాయపడును, లక్ష్యముఁ దెలుపున్.

(దక్షత = నేర్పు, ఉత్తరము = సమాధానము, దీక్ష = పట్టుదల, శిక్షణము = బోధించుట, లక్ష్యము = ధ్యేయము)

భారతంలో "యక్షప్రశ్నలు" అన్నది ప్రసిద్ధమైన ఘట్టం. యక్షుడు ప్రశ్నలు అడుగగా, నేర్పుగా ధర్మరాజు సమాధానాలు ఇచ్చాడు. గురువుల దగ్గర బోధన పట్టుదలగా జరిగితే, అది తనని తాను రక్షించుకోవడానికే కాకుండా, జీవితానికి ఒక ధ్యేయాన్ని కూడా ఇస్తుంది.

8. కం. సత్యము గల యోచనలే
నిత్యము మన మనసు నందు నిలచున్ స్మరణై,
యత్యంత ముదమ్ము నిడును,
స్తుత్యముగా ప్రేరణిచ్చు శుభములుఁ గూర్చున్.

(సత్యము = నిజము, యోచన = ఆలోచన, నిత్యము = ఎల్లప్పుడు, స్మరణ = జ్ఞాపకము, అత్యంత = చాలా అధికమైన, ముదము = సంతోషము, ఇడు = ఇచ్చు, స్తుత్యము = స్తుతింపదగినది, ప్రేరణ = పురికొల్పుట, శుభము = మంచి యోగము, కూర్చు = కలిగించు)

మన ఆలోచనలలో నిజము ఉంటే, అవి నిత్యము మన మనసులో జ్ఞాపకాలుగా నిలుస్తాయి, మిక్కిలి సంతోషాన్ని ఇస్తాయి. పొగడ తగినవిగా మనకి ప్రేరణ ఇచ్చి మంచి యోగము కలిగిస్తాయి.

9. కం. అక్షరము లేబదారే,
లాక్షణికుల త్రోవ మాని, లక్ష్యముగా కొ
న్నక్షరములు వాడనిచో,
లక్షణమగు తెలుగు భాష లంపట పడునే?

(లాక్షణికులు = వ్యాకరణాది శాస్త్రములు తెలిసినవారు, లక్ష్యముగా = ఉద్దేశ పూర్వకముగా, లక్షణమగు = శ్రేష్ఠమైన, లంపటపడు = ఆపదలో పడు)

తెలుగులో ప్రస్తుతం ఎక్కువ వాడుకలో ఉన్న అక్షరాల సంఖ్య సుమారుగా 52. అందులో 'అ' నుంచి 'అః' వరకు ఉన్న అచ్చులు 16, 'క' నుంచి 'ఱ' వరకు 36 హల్లులు ఉన్నాయి. ఌ, ౡ, ౘ, ౙ - అన్న నాలుగు అక్షరాలు వాడుకలో లేనట్లుగా కనిపిస్తున్నాయి. అందుకని, అక్షరములు యాభైయారే (56). లాక్షణికుల మార్గం వదిలిపెట్టి, ఉద్దేశ పూర్వకముగా, అంటే, కావాలని కొన్ని అక్షరాలు వాడకపోతే మాత్రం శ్రేష్ఠమైన తెలుగు భాష ఇబ్బందుల్లో పడుతుందా?

10. తే.గీ. వంద మిలియన్ల జనుల సంభాషణముల
తెలుగు భాష వెలుగు చుండ తెలుగు కవుల
సంఖ్య పెరిగె తెలుగు నాట, చదువు తెలుగు
మాధ్యమమున తగ్గఁ గడు యశ్మంత మయ్యె,
వచ్చిరాని తెలుగు స్థాయి వాడు కయ్యె.

(మిలియను = పదిలక్షలు, సంభాషణము = మాటలాడుట, నాడు = ప్రదేశము, తెలుగు మాధ్యమము = తెలుగులో లేక తెలుగు ద్వారా, కడు = మిక్కిలి, అశ్మంతము = హాని, స్థాయి = ఉనికి, వాడుక = పరిపాటి)

ప్రపంచంలో సుమారుగా 100 మిలియన్ల ప్రజలు తెలుగు మాట్లాడతారు అని తెలుస్తోంది. ఆ జనాల సంభాషణల్లో తెలుగు భాష ప్రకాశిస్తూ ఉండగా తెలుగు నాట తెలుగు కవుల సంఖ్య పెరిగింది. తెలుగు మీడియంలో విద్య తగ్గిపోవడం వల్ల మిక్కిలి హాని అయ్యింది. వచ్చీరాని తెలుగు స్థాయి అలవాటయ్యింది.

11. కం. సంహతి లేకున్న కొదమ
సింహమె యైనన్ దుముకును సింధువు పైనన్,
సింహం బాకలిఁ గొన్నను

సంహర్తగ నుండుఁ గాని, శాదముఁ దినునే.

(సంహతి = సత్తువ, కొదమ = పిల్ల, దుముకు = ఉఱుకు, సింధువు = ఏనుగు, సంహర్త = సంహరించువాడు, శాదము = గడ్డి)

బలం లేని సింహం పిల్ల అయినా సరే ఏనుగు మీదకు ఉఱుకుతుంది. సింహం ఆకలి మీద ఉన్నా కూడా చంపేదిగా ఉంటుంది గానీ గడ్డి తినదు.

12. ఉ. భాషణ చక్కదైన సులభమ్ముగ చిక్కులుఁ దీరుఁ గాని, యా
భాషణ క్రొత్త బాధలను పమ్మును, ఛాయనుఁ బోలె కాంతికిన్
భూషితమైన వస్తువులఁ బొంచి, యభాషణుడైన యీశుకున్
యేషను మాటలం దెలిపి యిమ్ముగఁ జూచును మర్త్యు డెప్పుడున్.

(భాషణ = మాట్లాడుట, సులభము = తేలిక, సంకటము = చిక్కు, పమ్ము = సృజించు, ఛాయ = నీడ, భూషితము = అలంకరింపబడినది, పొంచు = దాగుట, అభాషణుడు = మూగవాడు, ఈశుడు = ఈశ్వరుడు, ఏష = కోరిక, ఇమ్ము = ప్రీతి, మర్త్యుడు = మనుష్యుడు, ఎప్పుడు = నిత్యము)

ఆంగ్లంలో ఎవరో పంపిన ఈ క్రింది వాక్యాలకు వ్రాసిన పద్యం ఇది.

"Words solve a problem, simultaneously creating another, in the same way as the light bearer in darkness brings along a shadow. God speaks in silence. Man speaks and hopes for the best."

మాట్లాడటం చక్కగా ఉంటే చిక్కులు తీరతాయి కానీ, అది కాంతికి మెరిసే వస్తువుల వెనకాల దాగిన నీడ లాగా కొత్త బాధలను తెచ్చిపెడతాయి. మాట్లాడని ఈశ్వరునికి కోరికను మాటలలో చెప్పి, మనిషి ఎప్పుడూ ప్రీతిగా చూస్తాడు.

13. కం. సంక్రాంతిని మది నిలిపి య
హంక్రియ దూరముగ నుంచి యణకువ మాలా
లంక్రియగా జీవన మను
సంక్రమమును దాటఁ జూడ సతతము శుభమౌ.

(అహంక్రియ = గర్వము, అలంక్రియ = అలంకారము, సంక్రమము = వంతెన, సతతము = ఎల్లప్పుడు)

సంక్రాంతిని మనస్సులో నిలుపుకొని, గర్వాన్ని దూరం పెట్టి, వినయము అనే హారాన్ని అలంకారంగా, జీవితము అనే వంతెన దాటడానికి చూస్తే ఎప్పుడూ శుభము జరుగుతుంది.

14. కం. వాలెంటైన్స్ డే (valentines day) యందురు,
వీలుండదె వేరు రీతి వివశతఁ బొందన్?
ఛాలెంజిఁ (challenge) జేసి యడిగెద,
క్యాలెండరు (calendar) తేది ప్రేమ కంకుర మగునే?

(వాలెంటైన్స్ డే = ప్రేమికుల రోజు, వివశత = పరవశత్వము, ఛాలెంజి = సవాలు, అంకురము = చిగురు)

ఫిబ్రవరి 14వ తారీఖుని ప్రేమికుల రోజు అని అంటారు. వేరే విధంగా పరవశించడానికి వీలుండదా? సవాలు చేసి అడుగుతున్నా, క్యాలెండరులో ఉన్న తేదీ ప్రేమకి బీజమవుతుందా?

15. కం. చూపుల తలపుల వెల్లువ,
యాపై, మీ తీపి గురుతు లానంద మిడన్,
దీపము లైనవి మనసుకు,
దీపావళి యిచ్చె మాకు, దీప్తియు సుఖమున్.

(వెల్లువ = అధికప్రవాహము, ఇడు = ఇచ్చు, దీప్తి = కాంతి)

చూపులు, ఆలోచనల ప్రవాహము, ఆపైన మీ తీపి గుర్తులు ఆనందము ఇవ్వగా, అవే మనసుకు దీపాలైనాయి. దీపావళి మాకు కాంతి, సుఖము రెండూ ఇచ్చింది.

16. కం. బస పేరగు వయ సుడిగిన
ముసలోళ్ళకు, వృద్ధుల దినమునసే వారిస్
వసివాడని వాసిఁ దెలియు,
హసముఖులై కృత్రిమముగ యభినందించస్.

(బస = నివాసస్థానము, పేరు = ఇతరము, ఉడుగు = తీరు, వృద్ధుడు = ముసలివాడు, వసివాడు = కొంచెమై పోవు, వాసి = ఔన్నత్యము, హసముఖుడు = నవ్వు ముఖం కలవాడు, కృత్రిమము = నకిలీ, అభినందించు = స్తుతించు)

అక్టోబరు ఒకటవ తారీఖుని International day for the Elderly గా జరుపుకుంటాము. దాన్ని ఉద్దేశించి, కొన్ని కుటుంబాలలో ఇప్పుడున్న పరిస్థితులని దృష్టిలో పెట్టుకుని, వ్రాసిన పద్యం ఇది. వయస్సు మీరిన ముసలి వారికి నివాస స్థానము వేరుగా ఉంటుంది. వృద్ధుల దినం నాడే, కృతకంగా నవ్వుముఖంతో అభినందించడానికి, వారిలో తగ్గని ఔన్నత్యము తెలుస్తుంది.

17. కం. తలవని తలంపుగ యగును,
కలతలు యిడుములు బ్రతుకున, కర్మఠు డెటనో
కలడని యాతని కందురు,
కుల మతముల యద్ద మందు కొంచెపు బుద్ధిస్.

(తలవని తలంపుగ = యాదృచ్ఛికముగ, కలత = మనస్సులో ఆందోళనము, ఇడుము = క్లేశం, కర్మఠుడు = పూనిన కర్మ కొనసాగు వఱకు పని చేయువాడు, ఎటనో = ఎక్కడనో, కందురు = చూస్తారు, కొంచెము = అల్పము, బుద్ధి = మనస్సు)

యాదృచ్ఛికంగా జీవితంలో ఆందోళనలు, క్లేశాలు, కలుగుతూ వుంటాయి. చేయించే కర్త ఎక్కడనో ఉన్నాడని, అతణ్ణి కులమతముల అద్దములో అల్ప బుద్ధితో చూస్తారు.

18. కం. ఏదో యంశముఁ గైకొని
సాదించుట కన్న మిన్న, స్వయముగ లక్ష్యం
బొదలఁ దాల్చి, పరహితం
బేదైన సలిపి, జనాళి నెక్కొలుపఁ దగుస్.

(అంశము = విషయము, కైకొను = గ్రహించు, సాదించు = నిరంతరము నిందించు, మిన్న = శ్రేష్ఠము, స్వయముగ = తానుగా, లక్ష్యము = ఉద్దేశము, ఔదల దాల్చి = శిరసావహించి, పరహితము = ఇతరులకు మేలైనది, సలిపి = చేసి, జనాళి = జన సమూహము, ఎక్కొలుపు = ప్రేరేపించు, తగు = యుక్తమగు)

ఏదో ఒక విషయాన్ని తీసుకుని ఇతరులను ఎప్పుడూ నిందించడం కంటే, స్వయంగా లక్ష్యాన్ని చేబట్టి పరోపకారము ఏదైనా చేసి జన సమూహాన్ని ప్రేరేపించడం సరియైనది.

19. కం. నిత్యోపవాస పైత్యము
ప్రత్యేకతఁ జూప నెంచు పంత మనెడు యా
గాత్యం బతియై, యంగ
ప్రత్యంగమ్ములుఁ గృశింప బ్రతుకేఁ జెల్లుస్.

(నిత్య = ఎడతెగని, ఉపవాసము = భోజనము చేయకుండుట, పైత్యము = పిచ్చి, ప్రత్యేకత = విశిష్టత, పంతము = పోటి, ఆగాత్యము = అల్పవిషయము నధికముగా జేసి కావించెడు కోలాహలము, అతి = అధికము, అంగప్రత్యంగములు = చిన్నవి పెద్దవి యగు అన్ని అవయవములు, కృశించు = చిక్కిపోవు, చెల్లు = ముగియు)

ఎప్పుడూ భోజనము చేయకుండా ఉపవాసం చేసే పిచ్చి, ఈ విధంగా ప్రత్యేకత చూపెట్టుకోవాలనే పోటీతత్వముతో చేసే కోలాహలము ఎక్కువై, చిన్నా పెద్దా అన్ని అవయవాలు చిక్కి ప్రాణం మీదకు వస్తుంది.

20. ఉ. కూరిమి తోడి వంచనల కోట్ల నిధిన్ వెదజల్లి వోట్లకై
పౌరుల మోసపుచ్చ తమ వాక్పటిమన్ వెలయించు నేతలన్,
వారుణి మత్తులో నగు యవాంఛిత కృత్యము లన్ని చూచుచున్
కారణమైన వారి చెడు కర్మలు పట్టని న్యాయధృత్వులన్,
జోరుగ నాస్తిపాస్తులను సోమరులై తమ వంశ వారసుల్
యూరక కూరుచుండి తినుచున్నను తగ్గని రీతి దండు వ్యా
పారుల, లంచగాళ్ళు పరిపాటిగ త్రొక్కెడి యడ్డ దారులన్,
వారణఁ జేయగా నగును, వర్ధిలు సంఘ పటిష్ఠతన్ గనన్.

(కూరిమి = స్నేహము, వంచన = మోసము, నిధి = ధనము, వెదజల్లు = విరజిమ్ము, వాక్పటిమ = వాక్చాతుర్యము, వెలయించు = వెల్లడించు, నేత = నాయకుడు, వారుణి = సారాయి, వాంఛిత = కోరబడినది, కృత్యము = పని, కర్మ = కార్యము, ధృత్వుడు = మేధావి, జోరుగ = వేగంగా, సోమరి = ఒళ్లువంగనివాడు, వారసుడు = ఆస్తి మొదలగు వానిలో వంశపరంపరగా హక్కు గలవాడు, రీతి = విధము, దండు = సంపాదించు, వ్యాపారి = వర్తకుడు, పరిపాటిగ = సాధారణముగా, వారణ = వారించుట, వర్ధిలు = వృద్ధిపొందు, పటిష్ఠత = దృఢత్వము, కను = చూచు)

అభివృద్ధి పొందే సమాజము యొక్క చేవ చూడాలంటే, స్నేహంతో ఉన్న మోసాలను, కోట్ల డబ్బు విరజిమ్మి ఓట్ల కోసం పౌరులని మోసపుచ్చడానికి తమ ప్రసంగ నైపుణ్యం చూపెట్టే నాయకులను, సారాయి మత్తులో జరిగే అవాంఛిత కృత్యాలు చూస్తూ వాటికి కారణమైన వారి చెడు పనులు పట్టని న్యాయకోవిదులను, పనీపాటా లేకుండా తమ కుటుంబ వారసులు కూర్చుని తిన్నా తరగని విధంగా గబగబా ఆస్తిపాస్తులను సంపాదించే వ్యాపారులను, లంచగాళ్ళు సాధారణంగా తొక్కే అడ్డ దారులను, వారించాలి.

21. మ. మృతి లేదాత్మకు, మేనులే వలువలై మెట్టన్ విధింపం బడెన్,
మత తత్త్వంబులు పండితుల్ యదియె కర్మాయత్త పాశం బనన్,
గత జన్మంబున మర్త్యుడైన మతవర్గంబున్ కులంబున్ యెరుం
గ తరమ్మే? యది సత్యమే గద! యహంకారమ్ము లింకేలనో?

(మృతి = మరణం, మేను = శరీరము, వలువ = వస్త్రము, మెట్టు = ధరించు, విధించు = నియోగించు, కర్మాయత్త = తాను చేసుకున్న కర్మలను బట్టి పొందేది, పాశము = బంధము, మర్త్యుడు = మనుష్యుడు, మతము = కులాచార పద్ధతి, వర్గము = సజాతీయ సమూహము, కులము = వంశము, తరము = శక్యము, సత్యము = నిజము, అహంకారము = గర్వము)

ఆత్మకు మరణం లేదు. శరీరాలే వస్త్రాలుగా ధరించాలని విధింపబడింది. మత తత్త్వములు, పండితులు ఇదే పూర్వజన్మ కర్మల ననుసరించి ఏర్పడ్డ బంధం అని చెప్పగా, క్రిందటి జన్మలో ఒకవేళ మనిషే అయితే మతవర్గమేదో కులమేదో ఎరుగ సాధ్యమా? అది నిజమే కదా! మరి అహంకారం ఇంకా ఎందుకు?

22. కం. చెప్పిన మాటలు వినకనె
నప్పని వని తెలిసిఁ జేయు నష్టపు పనులన్,
గొప్పగఁ జెప్పుచు తిరిగెద,
వప్పాటున గొప్పఁ బెట్టు మావల గట్టున్.

(నప్పనివి = సరిపోవనివి, నష్టపు = చెఱుపు కలిగించు, అప్పాటున = ఉన్నపళాన, ఆవల = అవతల, గట్టు = తీరము)

చెప్పిన మాటలు వినకుండా, కూడనివని తెలిసి కూడా చేసే నష్టము కలిగించే పనుల గురించి గొప్పగా చెప్పుకుంటూ తిరుగుతావు. వెంటనే, నీ గొప్పతీసి అవతల గట్టున పెట్టు.

23. కం. విత్తము దండిగ యుండిన
చిత్తము మన మాట వినదు, చిందులు వేయున్,

విత్తము చాలక యున్నను
యొత్తిడులే పెరిగి చిత్త మొంటరి యగులే.

(విత్తము = ధనము, దండిగ = సమృద్ధిగా, చిత్తము = మనసు)

ధనం ఎక్కువగా ఉంటే మనసు మన మాటవినకుండా చిందులేస్తుంది. ధనం చాలకపోతే ఒత్తిడులు పెరిగి మనసు ఒంటరిదై పోతుంది.

24. కం. ఎప్పు డెది చేత మన్నను,
యప్పు డెదో సాకుఁ జెప్పి యవరోధంబుల్
కుప్పలుగఁ గలుగఁ జేసెడి
తప్పులు ప్రతిసారిఁ జేయు తకిలులఁ గనమే.

(సాకు = వంక, అవరోధము = అడ్డగింత, తకిలుడు = మోసగాడు, కను = చూచు)

ఎప్పుడు ఏది చేద్దామన్నా, అప్పుడు ఏదో వంక చెప్పి, కుప్పలుగా అడ్డంకులు కలిగేటట్లు చేసే తప్పులు ప్రతిసారి చేసే మోసగాళ్ళను చూడమా.

25. కం. మెత్తని వాడన చులకన,
మొత్తగఁ జూచెదరు వాడు మొగుడైన సుమీ,
జిత్తులమారి నెదుర్కొన
యెత్తునుఁ గడు చిత్తుఁ జేయు యెత్తే వలయున్.

(మెత్తనివాడు = మృదు స్వభావము గలవాడు, చులకన = లోకువ, మొత్తు = కొట్టు, జిత్తులమారి = మోసగాడు, ఎదుర్కొను = ప్రతిఘటించు, ఎత్తు = ఉపాయము, కడు = మిక్కిలి, చిత్తు చేయు = పూర్తిగా ఓడించు, వలయున్ = ఆవశ్యకము)

నెమ్మదైన వాడంటే లోకువ. వాడు మొగుడైనా సరే, మొత్తాలని చూస్తారు. మోసగాడిని ప్రతిఘటించాలంటే, వాడి ఎత్తును పూర్తిగా చిత్తు చేసే ఎత్తే అవసరం.

26. శా. మాయామేయ జగంబునన్ విధిని సంభావించి దారక్రియన్
స్వీయాదాయము మీరి హంగులకు వెచ్చింపంగ నేమాయె, యెం
తో యల్లాడుచు దంపతుల్ దుదకు నెందున్ సంధి లేకన్, సదా
గాయం బూనిన మానసంబులను ధిక్కారంబుఁ జూపించినన్.

(మాయ = అసత్యము, అమేయ = అపరిమితమైన, జగము = లోకము, విధి = పద్ధతి, సంభావించు = ఆదరించు, దారక్రియ = వివాహము, స్వీయ = తనది, ఆదాయము = రాబడి, మీరు = దాటు, హంగులు = ఏర్పాట్లు, వెచ్చించు = ఖర్చుపెట్టు, అల్లాడు = బాధనొందు, దంపతులు = ఆలుమగలు, తుద = చివర, సంధి = అంగీకారము, సదా = ఎల్లప్పుడు, ఊను = కలిగియుండు, మానసము = మనస్సు, ధిక్కారము = తిరస్కారము)

అపరిమితమైన మిథ్యాప్రపంచంలో పద్ధతిని ఆదరించి వివాహంలో తన రాబడిని మించి ఖర్చు చేస్తే ఏమయ్యింది?, ఎంతో బాధపడుతూ ఆలుమగలు చివరకు ఎందులోనూ అంగీకారము లేక ఎప్పుడూ గాయపడ్డ మనస్సులతో తిరస్కారం చూపిస్తే.

27. కం. తలచిన దుఃఖము వచ్చును
కల చెదరగ కలవరింత కనుమరు గవ్వన్,
సెలవులు ముగిసిన యటులే
పలు యాటలు ముచ్చటలకు భంగము కలుగున్.

(చెదరు = చిందఱ వందఱగు, కలవరింత = స్వప్న సంభాషణం, కనుమరుగగు = కంటికి కనిపించకుండా పోవు, ముచ్చటలు = కబుర్లు, భంగము = ఆటంకము)

కల చెదిరిపోతే కలవరింతలు కనబడకుండా పోవడం తలుచుకుంటే దుఃఖము వస్తోంది. సెలవులు ముగియగానే, అదే విధంగా, రకరకాల ఆటలకి కబుర్లకి ఆటంకం కలుగుతుంది.

28. కం. కానివి యాకాంక్షించుట,
తానకు తందాన యనుట, దాచుట నిజమున్,
తానన్న దురభిమానము,
మానవ నైజము, మనీషి మార్గము వేఱౌ.

(ఆకాంక్షించు = కోరు, తానకు తందాన యనుట = అవతలి వాడు చెప్పిందే నిజమని వంత పాడడం, దురభిమానము = చెడ్డ అభిమానము, నైజము = స్వాభావికము, మనీషి = బుద్ధిమంతుడు, వేఱు = అన్యము)

తనకు యుక్తము కానివి కావాలనుకోవడం, ఎదుటివారికి వంత పాడడం, నిజాన్ని దాయడం, తన మీద చెడ్డ అభిమానము అంటే అహంకారము, ఇవి మానవులకు స్వాభావికము. బుద్ధిమంతుల మార్గము వేరుగా ఉంటుంది.

29. కం. నవ్వుకు పునాది హాస్యమె
యవ్వగ, దానికి పునాది యడుగడుగున తా
నొవ్వంగా జీవనమున
కవ్వించిన వారి పట్ల కనపడు కరుణే.

(పునాది = మూలబంధము, హాస్యము = పరిహాసము, అడుగడుగున = మాటిమాటికి, నొవ్వంగా = వేదన చెందగా, కవ్వించు = రెచ్చగొట్టు, కరుణ = దయ)

"ఏకో రసః కరుణ యేవ" అని భవభూతి అన్నాడు. అంటే, కరుణ రసం ఒక్కటే రసం అన్నమాట. నవ్వుకు పునాది హాస్యమైతే, దానికి పునాది అడుగడుగునా బాధలు పడుతుంటే జీవితంలో రెచ్చగొట్టిన వాళ్ళ పట్ల కనపడే కరుణే. అంటే, కరుణ రసమే నవ్వుకు కూడా పునాది.

30. కం. దక్కనివి కలవు పెక్కులు,

జక్కని నిలబడని వాటి సాక్ష్యము లెన్నో,
దక్కని వాటికి వగచుట,
మిక్కిలి హాస్యాస్పదంబు, మిమ్మవి వేఁచుస్.

(దక్కు = చేకూరు, పెక్కులు = అనేకములు, నిలదొక్కుకొను = స్థిరపడు, జక్కొను = దొరకు, నిలబడు = స్థిరముగానుండు, సాక్ష్యము = ఋజువు, వగచు = విచారించు, హాస్యము = పరిహాసము, ఆస్పదము = ఆధారము, వేఁచు = బాధించు)

మనకి దక్కనివి చాలా ఉన్నాయి. మనకి దక్కి కూడా మన దగ్గర నిలబడని వాటి ఋజువులు చాలా ఉన్నాయి. దక్కని వాటి కోసం దుఃఖించడం చాలా హాస్యాస్పదం. మిమ్మల్ని అవి బాధిస్తాయి.

31. కం. కనుమా, "రమాకుమార" య
నినను వెనుకకు చదివినను నిభమే యగు, యు
జ్జనము సలుపంగ నక్షర
ము నొక టొకటిగ, మిగులు పదముఁ దెలుపు మరునే.

(కను = చూచు, రమ = మా = లక్ష్మి, కుమార = మార = మన్మథుడు, నిభము = సమానము, ఉజ్జనము = వదిలిపెట్టుట, చలుపు = చేయు, తెలుపు = సూచించు, మరుడు = మన్మథుడు)

రామరాజభూషణుడు తన సాహిత్యంలో "రమాకుమార" అనే పదప్రయోగం చేశారని ఎక్కడో చదివాను. ఈ పదం యొక్క అర్థం "మన్మథుడు". "రమాకుమార" పదాన్ని ఎడమ నుండి కుడికి చదివినా, కుడి నుండి ఎడమకు చదివినా, ఒకటే. దీనినే ఆంగ్ల భాషలో "పాలిండ్రోంమ్ (palindrome)" అని, తెలుగులో "పాదభ్రమకము" అని అంటారు. "రమాకుమార" లోని 'ర' తీసివేస్తే 'మాకుమార' అవుతుంది. దీని అర్థం కూడా 'మన్మథుడే'. అలాగే ఒకటొకటిగా, అక్షరాలు తీసేస్తూపోతే, మిగిలే పదాలు, 'కుమార', 'మార', 'ర' అవుతాయి. ఈ పదాలన్నిటికీ కూడా అర్థం "మన్మథుడు" అనే. ఈ విషయాలే పద్యంలో చెప్పబడినాయి. "రమాకుమార"

అన్నా దాన్ని వెనుకకు చదివినా సమానమే చూడండి. ఒక్కొక్క అక్షరము వదిలేస్తే మిగిలే మాట మన్మథునే సూచిస్తుంది.

32. కం. కవలలుగ యాడ పిల్లలు
కవలలుగా మగ శిశువులు కలుగంగ, మిరో
స్లవ (Miroslava) ఫెడరర్ (Federer) దంపతులకు
యివురించె ముదములు టెన్ని సేసుల (Tennis aces) వలెనే.

(ఇవురించె = చిగురించె)

ప్రఖ్యాత టెన్నిస్ ఆటగాళ్ళైన ఫెడరర్, మిరోస్లవ దంపతులకు మొదటి సారి కవలలుగా ఇద్దరు ఆడపిల్లలు, రెండవ సారి కవలలుగా ఇద్దరు మొగపిల్లలు కలిగారు. అలా జరగగానే, వారిలో టెన్నిస్ ఏసుల (Tennis aces) లాగా సంతోషాలు చిగురించాయి.

33. కం. వామాకు పకోడీలను,
నీమముగా సెలవు రోజు నిష్ఠగ తిన్నస్,
నోములు, పూజలు లేకనె,
క్షేమముగా నుందు రమ్మ, కిటుకిదె వినుమా.

వామాకు పకోడీలు సెలవు రోజున నియమ నిష్ఠలతో తింటే, నోములు పూజలు లేకుండానే క్షేమంగా ఉంటారమ్మా. ఇదే మర్మము, వినుము.

34. శా. ఎన్నో యేండ్లు గతించి పోయినవిఁ గానీ, యేను నా భావనల్,
కొన్నైనస్ మనసార యాంగ్లమున వాక్రుచ్చస్ బ్రయత్నించినస్,
పన్నీరయ్యెను బూడిదస్ గదిసి, చీవాట్లే మిగిల్చెస్ గడస్,
ఖిన్నత్వం బది యేమిఁ జెప్పుదును, నా ఖేదంబుఁ బో గొట్ట నే
నున్నా నంచు గురుండు యోజన లిడస్, యుద్యుక్త లోపంబుచే
కన్నీటస్ గరిగెస్, యశక్తతయు, నా కడ్డంబు నా మాంద్యమే.

(భావన = తలపు, మనసార = మనఃపూర్వకముగా, కడ = అంతము, వాక్రుచ్చు = చెప్పు, కదియు = చేరు, చీవాట్లు = తిట్లు, ఖిన్నత్వము = ఖేదము = శోకము, యోజన = ప్రణాళిక, ఉద్యుక్తలోపము = ప్రయత్నలోపము, అశక్తత = అసమర్థత, మాంద్యము = జడత్వము)

"ఎన్నో యేండ్లు గతించిపోయినవి గానీ, యీ శ్మశానస్థలిన్ ..." అన్న పద్యం "శ్మశానవాటిక" అన్న జాషువా గారి అద్భుతమైన ఖండకావ్యం లోది. ఈ పద్యం లోని ఎత్తుగడ నాకు చాలా ఇష్టం. అదే ఎత్తుగడతో ఒక పద్యం వ్రాయాలని అనుకున్నాను. నాకు తెలిసిన వాళ్ళు ఒకరు, ఎన్నాళ్ళనించో ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటున్నాను, ఎంత ప్రయత్నించినా చేయలేక పోతున్నాను, దాని మీద పద్యం వ్రాయమంటే, ఈ ఎత్తుగడ ఎంచుకుని పద్యం వ్రాశాను. ఎన్నో సంవత్సరాలు గడిచి పోయాయి కానీ, నేను నా ఆలోచనలు కొన్ని అయినా మనసారా ఇంగ్లీషులో చెప్పాలని ప్రయత్నించినా కూడా, బూడిదలో పోసిన పన్నీరయింది. చివరకు చీవాట్లే మిగిలాయి. ఏమి చెబుతాను, అది శోకమే. ఆ దుఃఖాన్ని పోగొట్టడానికి గురువు ప్రణాళికలు ఇవ్వగా, ప్రయత్నలోపం చేత కన్నీటిలో కరిగిపోయాయి. అసమర్థత, జడత్వములే నాకు అడ్డంకి.

35. చం. ఉపకరణంబు పెద్దలకు యూర్ధ్వగతుల్ గలిగింపఁ జేయగన్
యుపనయనంబె, పెండిలిని యుత్తిగ ముందరఁ జేయు వేడ్కయై
యపకరణమ్మయెన్ వరుని యన్నుకు మిన్నగఁ జేసిఁ జూపగన్,
యుపనయనంబె బాలుర గురూత్తముఁ జేర్చెను మున్ను, జంధ్యమే
యుపమగ బ్రహ్మచారులకు యూత మయెన్ సదుపాయముల్ యిడన్,
యుపకథ వంటి యుత్సవము లూరకఁ జేయుట సంప్రదాయమా?

(ఉపకరణము = సాధనము, ఊర్ధ్వగతి = ఊర్ధ్వలోకములగు స్వర్గాదుల కేగుట, ఉపనయనము = వడుగు, ఉత్తిగ = ఊరికినే, వేడ్క = వినోదము, అపకరణము = అవమానించుట, వరుడు = పెండ్లికొడుకు, అన్ను = స్త్రీ, మిన్న = ఎక్కువ, బాలుడు = పిల్లవాడు, గురూత్తముడు = ఉత్తముడైన ఉపాధ్యాయుడు, మున్ను = పూర్వము, జంధ్యము = యజ్ఞోపవీతము, ఉపమ = ఉపాయము, బ్రహ్మచారి = బ్రహ్మచర్య వత్రము

ననుష్ఠించువాడు, ఊతము = ఆధారము, సదుపాయము = వసతి, ఇడు = ఇచ్చు, ఉపకథ = ఒకకథలో వచ్చు అప్రధానమగు చిన్న కథ, సంప్రదాయము = ఆచారము)

ఉపనయనమే పెద్దవాళ్ళకి ఊర్ధ్వగతులు కలిగింప జేయడానికి సాధనం. వరుణ్ణి స్త్రీ కంటే ఎక్కువ చేసి చూపించడానికి, పెళ్ళిలో ఊరకనే ముందుగా చేసే వేడుకగా అపహాస్యానికి గురి అయింది. పూర్వము ఉపనయనమే బాలురను ఉత్తమమైన గురువు దగ్గరకి చేర్చింది. అప్పటి సాంప్రదాయం ప్రకారం, గురుకులాల్లో ఉన్న గురువుల పిల్లల పోషణ బాధ్యత, చదువు కయ్యే ఖర్చు, సమాజమే భరించాలి. సంపాదన కోసం గురువు కానీ, పిల్లలు కాని ఏ వృత్తినీ చేపట్టకూడదు. అంటే, పిల్లల విషయంలో ఉపనయనానికి ముందు అయితే వాళ్ళ తల్లిదండ్రుల బాధ్యత, ఉపనయనం అయిన తర్వాత, చదువు చెప్పడానికి గురువు బాధ్యత, పోషణకి సమాజం బాధ్యత. ఉపనయనం అయిన పిల్లలని బ్రహ్మచారులు అంటారు. గురువుగారు సరే, బ్రహ్మచారుల్ని సమాజం గుర్తించడం ఎలా? ఆ ఉపనయన ఉత్సవంలో వేసే జంద్యమే ఉపాయమై బ్రహ్మచారులకి ఉచిత సదుపాయములు ఇవ్వడానికి ఆధార మయ్యింది. ఉపకథ వంటి ఉత్సవాలు ఊరికే చేయడం ఆచారమా?

36. కం. లక్షింతలు యక్షింతలు
లక్షణ దాంపత్యమందు లటపట లున్నన్,
యక్షరమగు వలపున్న ప్ర
తిక్షణము ప్రణయ కలహము తీరున యుండున్.

(ఇంత = ఈకొలది, అక్షింతలు = చీవాట్లు, లక్షణ = శ్రేష్ఠము, లటపట = జగడము, అక్షరము = నాశము లేనిది, వలపు = ప్రేమ, ప్రణయకలహము = ప్రేమికుల తగువు)

చీవాట్లు లక్షింతలు, మంచి దాంపత్యంలో జగడాలు ఉన్నా, నాశము లేని ప్రేమ ఉంటే, ప్రతి క్షణం ప్రణయ కలహం లాగా ఉంటుంది.

37. కం. దంపతులు ప్రేమ నుండిన
లంపటములు పెద్దవైన రాజీ యుండున్,

దంపతులను రహి లేకనె
కుంపటిగా రగులుచుండు కొంచెపు తగవుల్.

(లంపటము = బాధ, రాజీ = ఒడబడిక, రహి = ప్రేమ, కుంపటి = నిత్యవ్యథ, రగులు = దగ్ధమగు, కొంచెము = చిన్న)

దంపతులు ప్రేమతో ఉంటే బాధలు పెద్దవి అయినా రాజీ ఉంటుంది. దంపతులలో ప్రేమ లేకపోవడం వల్లే చిన్న తగవులు కూడా నిత్యవ్యథగా రగులుతూ ఉంటాయి.

38. కం. లక్షణమగు సంసారము
కక్షలతో కాలుదువ్వ కాయువు తరుగున్,
తక్షణ సాధన మగును
దక్షతగా తగవు మాపు తాల్మియె సుమ్మీ.

(లక్షణము = శ్రేష్ఠము, కక్ష = ద్వేషము, కాలుదువ్వు = కలహమునకు సిద్ధపడు, కాయువు = అనురాగము, తరుగు = తగ్గు, తక్షణ = వెంటనే చేయవలసిన, సాధనము = ఉపాయము, దక్షత = నేర్పు, తగవు = జగడము, మాపు = పోగొట్టు, తాల్మి = సహనము)

మంచి కుటుంబము ద్వేషాలతో పోట్లాటలకి సిద్ధపడితే అనురాగము తగ్గుతుంది. నేర్పుగా కలహం పోగొట్టే సహనమే ఆ క్షణానికి ఉపాయ మవుతుంది సుమా.

39. కం. ఓటును వేటుగ వాడుము
నోటునుఁ జూపించు వారి నోర్మూయించన్,
కేటులు గెలిచిన యేర్పడు
కూటములే రాటుఁ దేలిఁ గూల్చును ప్రగతిన్.

(వేటు = దెబ్బ, కేటు = దొంగ, కూటమి = విలీనము, రాటుదేలు = గట్టిపడు, కూల్చు = అధోగతి నొందించు, ప్రగతి = అభివృద్ధి)

నోటును చూపించే వారి నోరు మూయించడానికి ఓటును దెబ్బగా వాడండి. దొంగలు గెలిస్తే ఏర్పడే కూటములు గట్టిపడి అభివృద్ధిని అధోగతి పాలు చేస్తాయి.

40. కం. నలుగురు నవ్వుదు రంచును
పలువురు పలుమార్లుఁ జెప్పు వాడుకఁ గనమే,
విలువలు గాలికి వదలిన
నలుగురితో జరుగుబాటు నాటక మగుగా.

(నలుగురు = అందఱు, వాడుక = ఆనవాయితి, విలువలు = ప్రయోజనములు, జరుగుబాటు = జీవనోపాధి, నాటకము = కపటోపాయము)

అందరూ నవ్వుతారంటూ పెక్కుమంది చాలాసార్లు చెప్పే ఆనవాయితి చూస్తాము కదా. విలువలు గాలికి వదిలేస్తే నలుగురిలో జీవనోపాధి కపటోపాయమే అవుతుందిగా.

10. కృష్ణాష్టమి

1. కం. కృష్ణాష్టమి ప్రత్యేకత
యుష్ణీషముఁ దోడ బాల లుత్సాహముగా
కృష్ణుని వేషముఁ గట్టుట,
కృష్ణునిఁ గని దినదినాభివృద్ధినిఁ బొందన్.

(ఉష్ణీషము = తలపాగ లేక కిరీటము)

కృష్ణాష్టమి ప్రత్యేకత ఏమిటంటే, కృష్ణుణ్ణి చూసి దినదినాభివృద్ధి పొందడం కోసం పిల్లలు తలపాగాతో కృష్ణుని వేషం కట్టడం.

2. కం. మురళీగానము నింపుగ,
నర లోకము నందు నింపి, నాద వినోదా!
నరునికి యద్వైతమ్మునుఁ
గఱపి జగద్గురు వయితివి, కంసారి! హరీ!

(ఇంపుగ = మధురంగా, అద్వైతము = జీవేశ్వరులకు అభేదమును చెప్పె మతము, కఱపు = బోధించు)

ఓ నాద వినోదా! ఓ కంస మర్దనా! కృష్ణా! మురళీ గానాన్ని మధురంగా మానవ లోకంలో నింపి, అర్జునునికి అద్వైతాన్ని బోధించి జగత్తుకే గురువువు అయినావు.

11. గారెలపై పద్యాలు

జక్కన కవి రచించినట్లుగా చెప్పబడుతున్న పెమ్మయ సింగధీమణి శతకంలోని పద్యాలలో "గారెలు లేని విందు" అన్న పద్యం నా చిన్నప్పుడు జనాల నోళ్ళలో నానుతూ ఉండేది. ఆ పద్యం అప్పట్లో నాకు తెలిసిన వాళ్ళలో ఎవరికీ రాదు గానీ పెమ్మయ సింగధీమణి మకుటంతో ఉన్న వేరే పద్యాలు మా తెలుగు పాఠ్య పుస్తకంలో ఉండేవి. ఇప్పుడు అంతర్జాలంలో వెతికితే, "గారెలు లేని విందు" అన్న పద్యం క్రింది విధంగా ఉంది.

ఉ. గారెలు లేని విందు, సహకారము లేని వనంబు, తొల్త నోం
కారము లేని మంత్ర మధికారము లేని ప్రతిజ్ఞ, వాక్చమ
త్కారము లేని తెల్వి, గుణకారము లేనటువంటి లెక్క, సా
కారము లేని పూజ, కొఱగానివి పెమ్మయ సింగ ధీమణీ.

ఓ, పెమ్మయ సింగ ధీమణీ! గారెలు లేని విందు భోజనం, సహకారం (అంటే మామిడి చెట్టు) లేని తోట, వేదమూలమైన బీజాక్షరం "ఓంకారము" లేని మంత్రము, అధికారం లేని వాడు చేసే ప్రతిన (అధికారం లేకుండా ప్రతిన చేస్తే పిచ్చి వాగుడు అనుకుంటారు), మాట చమత్కారం లేని వివేకము (చమత్కారం లేకపోతే వివేకం రాణించదు), గుణకారం లేని లెక్క (లేక పోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది), సాకారము (అంటే, భగవంతుని ఏదో ఒక రూపాన్ని తలచుకొని లేదా ఎదురుగా పెట్టుకొని) లేని పూజ, పనికిరావు.

పైన చెప్పిన "గారెలు లేని విందు" చిన్నప్పుడు నోటికి రాకపోయినా, ఆ మోస్తరు "పెమ్మయ సింగ ధీమణీ" పద్యాలు కొన్ని వచ్చు. ఉదాహరణకి "వాసన లేని పువ్వు .." పద్యం. ఇలాంటి పద్యం, ఒకటి "లేని" అని వచ్చేది (అంటే negative list), ఒకటి "ఉండి" అని వచ్చేది (అంటే positive list), వ్రాయాలని సంకల్పించి వ్రాసినవి క్రింద ఇచ్చిన మొదటి రెండు పద్యాలు. ఈ రెండు పద్యాలకి ప్రాస ఒకటే కాబట్టి కలిపి చదివితే 12 పాదాల ఉత్పల మాలిక అవుతుంది. ఇక మూడవ పద్యం, కొంత మంది గారెల పైన ఇష్టంతో చేసే శ్రాద్ధ కర్మ గురించి.

1. ఉ. ఓరిమి తోడి యత్నములు, యొమ్మికఁ గూడెడి భోగభాగ్యముల్,
గారెల తోడి విందు, కవి గాయక శ్రేష్ఠుల మంగళస్తుతుల్,
ధీరత మిత్ర ధర్మమున ధీమతు లాడు హితైక వాక్యముల్,
సారస చిత్త భావనలు, స్వాంతము శాంతిని యుంచు కోరికల్,
భారత భూమి కిచ్చు సమభావ సమన్వయ సంఘ సంస్కృతుల్.

(ఓరిమి = ఓర్పు, క్షమ; ఒమ్మిక = ఇమిడిక, పొందిక; ధీమతులు = బుద్ధిమంతులు; సారస = రసిక సంబంధియగు; సమన్వయ = కూడుకొన్న)

ఓర్పుతో చేసే ప్రయత్నాలు, కలిసివచ్చే సిరిసంపదలు, గారెలతో విందు, ఉత్తములైన కవులు, గాయకులు చేసే మంగళ స్తుతులు, మిత్ర ధర్మం పాటించడానికి ధైర్యంగా బుద్ధిమంతులు చేసే నీతి బోధలు, సహృదయుల మనస్సులలోని ఆలోచనలు, మనస్సుని శాంతంగా ఉంచే కోరికలు (అంటే, అశాంతికి దారితియ్యని కోరికలు), మన భరత భూమికి సమానత్వంతో కూడుకున్న సంఘసంస్కృతులని ఇస్తాయి.

2. ఉ. కారము లేని కూర, యధికారముఁ దెచ్చెడి కీర్తి దర్పముల్,
గారెలు లేని విందు, పడిగాపుల సేవల పబ్లికాఫిసుల్ (public offices),
బారులఁ (Bars) గల్గు స్నేహములు, బాసట నివ్వని బంధువర్గముస్,
గారవముల్ నటించి యపకారముఁ జేసెడి యాప్త బంధువుల్,
చేరువ యుండి మిత్రులకు చేటగు బుద్ధులు నేర్పు ధూర్తులుస్,
చారుల కున్న యిచ్చకపు చాతురి, ఖర్వముఁ గాని గర్వముస్,
యూరకఁ బల్కు యుబ్బకము లొప్పునె శిష్ట జనంబు మెత్తురే.

(దర్పము = గర్వము; పడిగాపులు = ఎక్కువసేపు వేచివుండటం; బాసట = సహాయము; గారవము = ప్రేమ; చేరువ = సమీపము; చేటు = కీడు; ధూర్తులు = మోసగాళ్ళు; చారులు = వేగులు [secret agents]; ఇచ్చకము = ముఖప్రీతి; చాతురి = నేర్పు; ఖర్వము గాని = తగ్గని; ఉబ్బకములు = హెచ్చులు; ఒప్పునె = ఉచితమా, సమ్మతమా; శిష్ట జనంబు = సదాచార సంపన్నులు)

కారము లేని కూర (చప్పగా ఉంటుంది కాబట్టి), అధికారం తెచ్చిపెట్టే కీర్తియు గర్వమున్నూ, గారెలు లేకుండా విందుభోజనము, చాల ఆలస్యంగా సేవలందించే పబ్లిక్ ఆఫీసులు (public offices), మద్యపానము చేసే ప్రదేశాలలో ఏర్పడే స్నేహాలు, అవసరమయినపుడు సహాయము కోసము నిలబడని బంధువర్గము, ప్రేమ ఉన్నట్లుగా నటించి అపకారము చేసే ఆప్త బంధువులు, దగ్గరగా ఉండి చెడ్డ బుద్ధులు నేర్పే మోసగాళ్ళు, చూసింది చూసినట్లుగా కాక ముఖప్రీతి కోసం నచ్చేటట్లుగా చెప్పటంలో వేగుల కున్న నేర్పు, తగ్గని అహంకారం, ఊరికే చెప్పే హెచ్చులు (గొప్పలు) తగినవేనా? వాటిని విబుధులు మెచ్చుకుంటారా?

3. ఉ. జీవన ముండు దాక సహజీవుల మంచని యప్రియంబులౌ
త్రోవలు పెక్కుఁ జూపి పడదోయగఁ జూచి, యనంతరంబు నా
జీవికి లేని గౌరవము జీవి శవంబున కివ్వఁ జేయు ప
ల్పావన మాసికంబుల కుపారము, గారెల విందు మాత్రమే.

(జీవనము = బ్రతుకు, సహజీవి = సహజీవనము చేయు ప్రాణులలో ఒకటి, అప్రియము = ఇష్టము కాని, పెక్కు = అనేక, అనంతరము = తరువాత, పల్ = పలు లేక అనేక, పావన = పవిత్రమైన, మాసికము = శ్రాద్ధము, ఉపారము = నైవేద్య పదార్థము)

బ్రతికి నంత కాలం తోటివారు ఎందరో ఇష్టంలేని అనేక మార్గాలు చూపించి కూలదోయడానికి చూస్తారు. తర్వాత, ఆ జీవి అంటే లేని గౌరవము జీవి శవానికి కివ్వడం కోసం చేసే పలు పవిత్రమైన శ్రాద్ధాలలో నైవేద్య పదార్థము గారెల విందు మాత్రమే సుమా!

12. గురువులు

ఉపాధ్యాయ వృత్తి అన్నిటి కన్నా గొప్ప అని కొంత మంది అంటే, బతక లేక బడిపంతులు అని కొంత మంది అంటూవుంటారు. ఉపాధ్యాయ వృత్తి అంటే నాకు చాలా గౌరవం. ఆ వృత్తి గురించి నాకు అర్థమైనంత వరకు చెప్పాలని ఉంది. నాకు విద్యతో పాటు విచక్షణ నేర్పిన గురువులు చాలా మంది ఉన్నారు. వాళ్ళ గురించి నా భావనలను కొన్ని పద్యాలలో చెప్పాను. నా మొదటి గురువైన కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాద రావు గారి గురించి కూడా కొన్ని పద్యాలు వ్రాశాను.

1. కం. చాతుర్వర్ణ్య వ్యవస్థను
యే తీరుగ విద్య వృత్తు లెగుదలఁ బొందుస్,
జాతీయ సంప దెయ్యది,
యా తీవంచను తొలుతను యాచార్యులెగా.

(చాతుర్వర్ణ్య = బ్రాహ్మణాది చతుర్వర్ణములు, అనగా, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర జాతులు; వ్యవస్థ = పరంపరగా వచ్చిన ఏర్పాటు; విద్య = జ్ఞానము, విద్య, అష్టాదశ విద్యలు (చతుర్వేదములు, షడంగములు, మీమాంస, న్యాయశాస్త్రము, పురాణములు, ధర్మశాస్త్రము, ఆయుర్వేదము, ధనుర్వేదము, నీతిశాస్త్రము, అర్థశాస్త్రము); వృత్తి = జీవనోపాయము; ఎగుదల = అభివృద్ధి; తీవంచ = నాలుగు; తొలుత = మొదట; ఆచార్యుడు = గురువు, ఉపాద్యాయుడు)

ఇప్పుడున్న కుల వ్యవస్థకి, ఆ కాలంలో వున్న చాతుర్వర్ణ్య వ్యవస్థకి ఎక్కడా పొంతన లేదు అని నా అభిప్రాయము. సంఘానికి కావలసిన నాలుగు ప్రధాన వృత్తులే ఆనాటి నాలుగు వర్ణాలు. మొదటిది, సంఘానికి కావలసిన విద్యలు, వృత్తులు నేర్పేవారి తరగతి. ఇప్పటి కాలంతో పోలిస్తే, టీచర్లు, ట్రైనర్లు (Teachers and Trainers). అంటే, ఒక కాలంలో వున్న వృత్తి, విద్యలు ఆ తరానికే కాకుండా తరువాతి తరాలకి కూడా అందేడట్లు చూసే వాళ్ళు. ఇక రెండవ తరగతి వాళ్ళెవరంటే, అందరికీ, అందరి సంపదకీ రక్షణ (security) కలిపిస్తూ దానికి కావాల్సిన పరిపాలనా వ్యవస్థని (public administration) నిర్మించే వాళ్ళు. మూడవ తరగతి వాళ్ళు, వ్యవసాయం, వ్యాపారం (agriculture & businesses) చూసుకునే వారు.

ఇక నాల్గవ తరగతి వాళ్ళు, పై మూడు తరగతుల వాళ్ళకి అన్ని విధాల సాయం చేసే వాళ్ళు (support staff). మన సంఘంలో ఇప్పుడు కూడా ఈ రకమైన సోషల్ స్ట్రక్చర్ (social structure) చూడవచ్చు. మొదటి తరగతి వాళ్ళ పనేమిటంటే, తమ తరగతి వాళ్ళకే కాక, మిగిలిన మూడు తరగతుల వాళ్ళకి కావలసిన వృత్తి, విద్య నేర్పడం. అందుకే, వాళ్ళు ముఖ్యము.

ఈ పద్యము భావములోకి వస్తే, నాలుగు వర్ణాల వ్యవస్థలో, ఏ విధంగా విద్య, వృత్తులు అభివృద్ధి సాధిస్తాయో, ఎవరైతే జాతీయ సంపదగా పరిగణింప బడతారో, అటువంటి నాలుగు వర్ణాలలో మొదట నిలచేది గురువులే కదా.

2. కం. దక్షత యంతయు గురువుల
భిక్షగ ప్రాప్తించు, నందుపేక్షను యుంటన్
శిక్షణను లోప మేర్పడి,
శిక్షగ నది పరిణమించు శిష్యుల లోనన్.

(దక్షత = నేర్పు, ప్రాప్తించు = లభించు, ఉపేక్ష = అశ్రద్ధ లేక అలక్ష్యము, శిక్షణ = అభ్యాసము, లోపము = కొఱత, శిక్ష = దండన, పరిణమించు = మార్పునొందు)

నేర్పు అంతా గురువులు పెట్టిన భిక్షగా లభిస్తుంది. అందులో అశ్రద్ధగా ఉండడం చేత, అభ్యాసంలో లోపం వచ్చి, శిష్యులకు అది శిక్షగా మారుతుంది.

3. కం. నేర్పిరి విద్యల నెన్నియొ,
నేర్పిరి నైరాశ్యము, కడు నెయ్యము, భయమున్,
నేర్పిరి వినయము, విజ్ఞత,
నేర్పు, విచక్షణ, విహితము, నేర్పిరి గురువుల్.

(నైరాశ్యము = ఆశలేనితనము, కడు = మిక్కిలి, నెయ్యము = స్నేహము, విజ్ఞత = లోకజ్ఞానము, నేర్పు = నైపుణ్యము, విచక్షణ = యుక్తాయుక్త జ్ఞానము, విహితము = తగినది)

ఎన్నో విద్యలు నేర్పారు. ఆశలని పెంచుకోకుండా ఉండడం, స్నేహ స్వభావము, భయము నేర్పారు. వినమ్రత, లోకజ్ఞానము నేర్పారు. నైపుణ్యము, యుక్తాయుక్త జ్ఞానము, ఏది చేయ తగినది అన్నవి గురువులు నేర్పారు.

4. కం. సాక్షాత్కారము గురువుల
యక్షర రూపంబు నందు యందెను, యది నా
కక్షీణము, గురు యాశీ
స్స్వక్షయముగఁ బొంద నాకు సఫలతఁ గలిగెన్.

(సాక్షాత్కారము = సాన్నిధ్యము, సాముఖ్యము; అక్షర = నశించనిది. అకారము మొదలగు అక్షరములు; అక్షీణము = ఎడతెగనిది, తఱుగనిది; ఆశీస్సు = దీవన, ఆశీర్వాదము; అక్షయము = నాశము కానిది, స్థిరము; సఫలత = సార్థకత, సాఫల్యము)

గురువుల సాక్షాత్కారము అక్షర రూపంలో అందింది. అది నాకు శాశ్వతమైనది. గురు ఆశీర్వాదము స్థిరముగా పొందడం వల్ల నాకు సార్థకత లభించింది.

5. కం. కొద్దో గొప్పో కవనము,
ఒద్దికగా నాదు విధులు యొనఁగూర్చుటయున్,
హద్దుల కనువగు నడవడి,
విద్దెలు నేర్పిన గురువుల వితరణ నబ్బెన్.

(కవనము = కవిత్వము, ఒద్దిక = అడకువ, ఒనగూర్చుట = నెరవేర్చుట, హద్దు = పరిమితి, అనువు = అనుకూలమైన, నడవడి = ప్రవర్తనము, విద్దె = విద్య, వితరణ = దానము, అబ్బు = ప్రాప్తించు)

కొద్దో గొప్పో కవిత్వము, అడకువగా నా విద్యుక్త ధర్మాలు నెరవేర్చడం, పరిమితులకు అనుకూలమైన ప్రవర్తన, ఇవన్నీ విద్యలు నేర్పిన గురువుల దానము వల్ల ప్రాప్తించినాయి.

6. కం. పసితనమున గురువుల కడ
కుసుమించిన కవన విద్య కుంటు పడంగా,
హాసముఖియై యిన్నాళ్ళకు
రసవశునిగ పరవశునిగ రంజించెఁ గదా.

(పసితనము = బాల్యము, కడ = దగ్గర, కుసుమించిన = మొగ్గవిచ్చుకున్న, కవన విద్య = కవిత్వం అల్లే విద్య, కుంటుపడు = విఘ్నమగు, హాసముఖి = నవ్వు ముఖము కలది, రసవశుడు = ఆస్వాదింపబడు రసమునకు వశుడు, పరవశము = ఆనంద పారవశ్యము, రంజించు = సంతోషము కలుగజేయు)

బాల్యంలో గురువుల దగ్గర మొగ్గవిచ్చుకున్న కవిత్వం అల్లే విద్యకి విఘ్నమైంది. నవ్వు ముఖంతో ఇన్నాళ్ళకి అది రసవశునిగా, పరవశునిగా సంతోష పెట్టింది కదా.

నా మొదటి గురువు గురించి:

7. కం. భగవద్గీతా పఠనము
సుగమంబుగ స్మరణ పెంచు సొబగగు కవితల్
జగతికి చెందిన జ్ఞానము
ఒగి బోధనఁ జేసి నట్టి యొజ్జకు ప్రణతుల్.

(సుగమము = సులభము, స్మరణ = జ్ఞాపకము, సొబగు = సౌందర్యము, ఒగి = యథాక్రమముగా)

భగవద్గీత చదవడం, తేలికగా జ్ఞాపకశక్తిని పెంచే అందమైన కవిత్వం, లోకజ్ఞానము యథాక్రమముగా బోధించిన గురువుకు నమస్కారాలు.

8. సీ. అన్యాయ మన్నది యణు మాత్రమైనను
యెదురు బెదురు లేక యెగయు చేయి
పాండితీ విభవమ్ము పక్కదోవలుఁ బట్ట
కంటకమ్ములఁ దుంచిఁ గాచు చేయి
సత్కార్యములుఁ జేయు సన్మార్గు లందర
నొక తాటిపైఁ దెచ్చి యొడియు చేయి
భిన్నత్వమందు నభేదమ్ము కలదంచు
సమతా నినాదంబు సలుపు చేయి

తే. గీ. నాకు మార్గదర్శకముగ, నాకు నండ
దండ, నాకు నన్ని విధాల ధైర్య మొసగి
తీర్చి దిద్దిన ఘనమైన తీరుఁ జూడ
గుర్తు కొచ్చెను యదియె నా గురువు చేయి.

(ఎగయు = పైకిలేచు; విభవము = సంపద; కంటకము = ముల్లు, విరుద్ధము, తప్పు; కాచు = రక్షించు; ఒడియు = ఆకర్షించు, లాగు, పట్టుకొను; భిన్నత్వము = భేదము, నానాత్వము; అభేదము = భేదములేమి, ఏకీభావము; సమత = సమత్వము; నినాదము = ఏదేని ఒక కార్యసాధనకై చేయు అఱపు; సలుపు = చేయు; మార్గదర్శకము = దారి చూపునది; అండదండ = దిక్కు, ప్రాపు, సహాయము; తీర్చిదిద్దు = సవరించు, చక్కగా నుంచు)

అన్యాయం కొంచెమైనా ఎదురు బెదురు లేకుండా పైకి లేచే చేయి, పాండిత్య సంపద పనికిరాకుండా పక్కదోవలు పట్టినప్పుడు ఆటంకంగా వున్న ముళ్ళు తొలగించి రక్షించే చేయి, మంచి పనులు చేస్తూ మంచి మార్గంలో నడిచే వాళ్ళని ఒకే తాటి పైకి తెచ్చే చేయి, భిన్నత్వంలో ఏకత్వమున్నదను సమతా నినాదాన్ని చేసే చేయి, నాకు దారి చూపుచు, నాకు అండదండ, నాకు అన్ని విధాల ధైర్య మిచ్చి తీర్చిదిద్దిన ఆ గొప్ప తీరు చూస్తుంటే నా గురువు చేయి గుర్తు కొచ్చింది.

9. కం. తన వారని పెర వారని

మనమున భేదంబు లేక మసలిన మహితా

త్ముని నా గురువును మదిఁ దల

తు నెపుడు, యహమును మమత్వ ధోరణి వీడస్.

(పెర వారు = అన్యులు, మసలిన = నడయాడిన, మహితాత్ముడు = గొప్ప మనస్సు కలవాడు, అహము = అహంకారము, మమత్వ = 'నాది' అను భావము, ధోరణి = పద్ధతి, వీడస్ = విడుచుటకు)

అహంకారాన్ని, మమత్వాన్ని విడిచిపెట్టడానికి, తనవారు, అన్యులు అన్న భేదం మనస్సులో లేకుండా నడయాడిన నా గురువును ఎప్పుడూ మనసులో తలుచుకుంటాను.

10. ఉ. విద్యలు నేర్పి శిష్యులను విజ్ఞులఁ జేయుటె వృత్తి, హోమియో

వైద్యముఁ జేసి బీదలకు బాధలు తీర్చుటె సేవ, ధాటిగా

పద్యము లందు వ్యాసముల భాషణలం దవినీతి నేకుటల్,

సేద్యము, దైవభక్తి, కడు చిత్రపు భాష్యములస్ పురాణముల్

హృద్యముగా వచించుటయు, రేవగలుస్ జన భవ్యమే జపం

బుద్యమమై తలిర్చిన గురూత్తముడుస్, బహు త్యాగశీలి, సౌ

హృద్యము రూపుగొన్న ఘనుడే చిరువోలు ప్రసాదరావగుస్.

(విజ్ఞులు = సమర్థులు, ధాటిగా = నిర్ణయాత్మకంగా, భాషణ = మాటాడుట, ఏకుట = నిందించుట, సేద్యము = వ్యవసాయము, చిత్రపు = మనోహరమైన, భాష్యము = వ్యాఖ్యానము, హృద్యముగా = మనస్సున కింపుగా, వచించు = చెప్పు, రేవగలు = అహూరాత్రము, భవ్యము = శ్రేయము, జపము = మంత్రావృత్తి, ఉద్యమము = ప్రయాసము, తలిర్చు = అతిశయించు, ఉత్తముడు = శ్రేష్ఠుడు, సౌహృద్యము = స్నేహము, రూపుగొన్న = మూర్తీభవించిన)

అన్ని రకాల చదువులు నేర్పి శిష్యులను సమర్థులుగా చేయడమే వృత్తిగా, హోమియో వైద్యము చేసి పేదవాళ్ళ బాధలు తీర్చడమే సేవగా, తన పద్యాలలో, వ్యాసాలలో, మాటలలో ధాటిగా అవినీతిని తూర్పారబట్టడం, వ్యవసాయము, దైవభక్తి, పురాణాలకి అతి మనోహరమైన వ్యాఖ్యానము చెప్పడం, అహోరాత్రము జనశ్రేయస్సే జపంగా, ఉద్యమంగా విలసిల్లిన గురూత్తముడు, గొప్ప త్యాగశీలి, స్నేహము మూర్తీభవించిన మహనీయుడే, మా గురువుగారైన కీర్తిశేషులు శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారవుతారు.

13. నూతన సంవత్సరం

నూతన సంవత్సరం అన్నది తెలుగు వాళ్ళు రెండు సార్లు చేసుకుంటారు. మొదటిది, ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం జనవరి ఒకటవ తారీఖున, రెండవది తెలుగు క్యాలెండర్ ప్రకారం వచ్చే ఉగాది పర్వదినాన. తెలుగు సంవత్సరాలకి అర్థవంతమైన పేర్లు 60 ఉన్నాయి. ఆ 60 అవగానే మళ్ళీ అవే పునరావృతమవుతాయి. ఈ విషయాలు దృష్టిలో పెట్టుకుని మొదటి నాలుగు పద్యాలు రెండు రకాల నూతన సంవత్సరాలకి వర్తించేటట్లుగా, తరువాతి మూడు పద్యాలు "శ్రీవికారి", "శార్వరి" అన్న పేర్లున్న సంవత్సరాలకి వర్తించేటట్లుగా వ్రాయబడ్డాయి. మిగతా సంవత్సరాల పేర్ల ఆధారంగా కూడా పద్యాలు వ్రాయ వచ్చు.

1. కం. ఎడదయె కడిగిన ముత్యము
నడతయె మనకున్న కలిమి నగవులె బలమై
గడచిన వత్సర మంతయు
యొడుదుడుకుల నడుమ శుభము లొనఁగూడెఁ గదా.

(ఎడద = హృదయము, మనస్సు; నడత = నడవడి, ప్రవర్తన; కలిమి = సంపద; నగవు = నవ్వు, హాసము; వత్సరము = సంవత్సరము; ఒడుదుడుకు = సంకటము, కష్టస్థితి; ఒనగూడు = సిద్ధించు, ప్రాప్తించు)

మనస్సు కడిగిన ముత్యంలా స్వచ్ఛమైనది. మన ప్రవర్తనయే మన సంపద. నవ్వులే బలం. నిరుడు అంతా కష్టాల మధ్య మంచి కూడా జరిగింది కదా.

2. కం. మనుజుడు యాశాజీవియె,
వెనుకటి విఫలము విజయము వెనుకనె విడచున్,
మనమున నాహ్వానించును,
జనవరి యొకటిన వినూత్న జగతిన్ ప్రగతిన్.

(విఫలము = నిరర్థకము, వినూత్న = సరికొత్త, ప్రగతి = అభ్యున్నతి)

మనిషి ఆశాజీవియే. వెనకటి వైఫల్యాలు, విజయాలు వెనకే వదిలేసి జనవరి ఒకటో తారీఖున కొత్త లోకాన్ని అభ్యుదయాన్ని మనసుస్సులో ఆహ్వానిస్తాడు.

3. కం. వచ్చిన నూతన వత్సర
మిచ్చును యొక నూత్న తేజ మిచ్చును శుభముల్
దెచ్చును యుత్సాహంబులు
యిచ్చును మన జగతి కంత యీప్సిత సుఖముల్.

(తేజము = ప్రకాశము, ఈప్సిత = వాంఛితము, కోరబడినది)

వచ్చిన నూతన సంవత్సరము ఒక నూత్న తేజాన్ని, ఉత్సాహాన్ని, శుభాలనీ ఇస్తుంది. జగత్తుకి కోరిన సుఖాలని ఇస్తుంది.

4. కం. హ్యాపీ న్యూయియ రంచును
కోపములను తాపములను కోరిక లెల్లన్
పాపముల నన్ని మరతుము
తాపీగా తందనాల తాండవ మాడన్.

(తాపీగా = విశ్రాంతిగా, తందనాలు = చిందులు, తాండవము = ఉద్ధతమైన నృత్యము)

Happy New Year అంటూ కోపాలూ, తాపాలూ, కోరికలూ, పాపాలూ, అన్నీ మరచిపోతాము, విశ్రాంతిగా చిందులేస్తూ నృత్యము చేయడానికి.

5. కం. మార్చును వికార మందురు,
దర్పణమై శ్రీవికారి దారినిఁ జూపున్,
కర్పూర కళిక భాతిని,
యర్పణఁ జేయంగ మనము నంకిత బుద్ధిన్.

(వికారము = మార్పు, దర్పణము = అద్దము, కళిక = దీపజ్వాల, భాతిస్ = విధముగా, అర్పణ = సమర్పణము, అంకిత = స్వార్థము లేకుండ చూపు నిష్ఠ)

"వికారి" అంటే "వికారము కలది" అని. వికారము అంటే మార్పు. మనస్సును అంకిత బుద్ధితో సమర్పణము చేయాలని కర్పూర దీపంలాగ శ్రీవికారి నామ సంవత్సరం అద్దమై దారిని చూపిస్తుంది.

6. కం. వచ్చిన వికారి వత్సర
మిచ్చును, సుఖశాంతు లెన్నొ యింటస్ బయటస్,
దెచ్చును పెక్కులు మార్పులు,
ముచ్చటగా తెలుగు నాట ముంగిళ్ళందుస్.

(ముచ్చట = ప్రియము, ముంగిలి = ఇంటిలోని దొడ్డి)

వచ్చిన వికారినామ సంవత్సరము ఇంటా బయటా ఎన్నో సుఖశాంతుల్ని ఇస్తుంది. తెలుగు వారి ఇళ్ళ ప్రాంగణాలలో ముచ్చటైన పెక్కు మార్పులు తెస్తుంది.

7. కం. శార్వరి వత్సర మంతయు
సర్వైశ్వర్య ఫలదముగ, శాంతియు సుఖముస్
శర్వుని యాశీస్సులతో
సర్వంసహ పరిఢవిల్లు, సఖ్యత పెరుగుస్.

(శర్వుడు = శివుడు, సర్వంసహ = పుడమి యంతను, పరిఢవిల్లు = శోభిల్లు)

శార్వరినామ సంవత్సరాగమనాన్ని ఉద్దేశించి వ్రాసిన పద్యం ఇది. శార్వరి నామ సంవత్సరమంతా సర్వైశ్వర్యాలు ఇచ్చేదిగా, శివుని ఆశీస్సులతో సుఖశాంతులు అంతటా శోభిల్లుతాయి. చెలిమి పెంపొందుతుంది.

14. నోట్ల రద్దు

2016లో భారత ప్రభుత్వము కొన్ని డినామినేషన్ల (denominations) కరెన్సీ నోట్లను (currency notes) రద్దు చేసింది. అంతకు ముందు కూడా ఇటువంటి చర్యలు తీసుకోవడం జరిగింది. నల్ల ధనాన్ని (black money) అరికట్టడానికి ఇది ఒక మార్గము అని ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతారు. అలాంటి చర్య తీసుకున్న రోజుల్లో పత్రికలలోను ఇతరత్రా వచ్చిన వార్తల ఆధారంగా వ్రాసిన పద్యాలు క్రింద ఇవ్వబడ్డాయి. నల్లధనం అరికట్టడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు అంతగా సఫలం కాలేదని వచ్చిన వార్తల / అభిప్రాయాల నేపథ్యంలో, ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించి ఒక పరిష్కారం ఆఖరి పద్యంలో సూచించడం జరిగింది.

1. కం. పెద్ద కరెన్సీ నోట్లను,
హద్దులు మీఱుచునె పెద్ద లన్ని విధాలన్
పెద్దెత్తున గడియించిరి
యెద్దడి యొక పక్క జనుల హెచ్చవఁ గనియున్.

(మీఱు = అతిక్రమించు, పెద్దెత్తున = భారీగా, గడియించు = సంపాదించు, ఎద్దడి = దరిద్రము, హెచ్చవు = అతిగా పెరిగిపోవు, కను = చూచు)

ఒక పక్క దరిద్రము అతిగా పెరిగిపోవడం చూసి కూడా హద్దులు అతిక్రమించి పెద్దలు అన్ని విధాలా భారీగా పెద్ద కరెన్సీ నోట్లని (currency notes) సంపాదించారు.

2. కం. దాచెద రాభరణములను,
దాచెదరు స్థిరాస్తు లందు, ధన రూపమునన్,
తోచిన ఖాతా లందున,
దాచెదరు గడించు నల్ల ధనములు యెల్లన్.

(ఆభరణము = నగ, స్థిరాస్తి = ఒక చోటినుండి మరియొక చోటికి తీసికొని పోవుటకు వీలులేని (భూమి ఇల్లు తోటలు మొ. నవి) ఆస్తి, తోచిన = స్ఫురించిన, ఖాతా = పద్దు, నల్లధనము = ప్రభుత్వపు లెక్కలోనికి రాని (అన్యాయార్జితమగు) ధనము, ఎల్ల = సర్వము)

సంపాదించిన నల్ల ధనాలు సమస్తము నగలలో, స్థిరాస్తులలో, ధనరూపంలో, మనసుకు తట్టిన ఖాతాలలో దాస్తారు.

3. కం. మన ఆర్థికస్థితికి, భ్రం
శనమునుఁ గలిగింప దుష్ట శక్తులు, తా ము
ద్రణఁ జేసి నోట్లను చలా
మణిఁ జేయుట తీవ్రమగు సమస్యగ మారెన్.

(భ్రంశనము = పతనము)

మన ఆర్థికస్థితి పతనం అవ్వడానికి కొన్ని దుష్టశక్తులు తాము ముద్రించిన జాలీ నోట్లను చలామణి చేయడం తీవ్రమైన సమస్యగా మారింది.

4. కం. గుట్టుగ దాచిన సొమ్ములు,
పెట్టని కోటలుగఁ దలచు పెద్దల ధీమా
రట్టయె, కరెన్సి రద్దవ
వట్టిగ మారెను, ప్రభుత్వ పథకము వల్లన్.

(గుట్టుగ = రహస్యముగ,పెట్టని కోటలు = ఎక్కువ రక్షణగా ఉండునవి, ధీమా = తమ ప్రజ్ఞపట్ల తమకు నమ్మకం, రట్టయె = రహస్యము బట్టబయలు అయ్యె, వట్టిగ = ప్రయోజనము లేకుండా)

ప్రభుత్వ పథకము వల్ల కరెన్సీ రద్దయ్యి ఎందుకూ పనికి రాకుండా పోవడంతో, గుట్టుగా దాచుకున్న ధనం తమకి పెట్టనికోట అని భావించే పెద్దల ధిలాసా బట్టబయలు అయింది.

5. కం. పెద్ద కరెన్సీ రద్దవ
పెద్దలకే తగిలె దెబ్బ పెద్దగ, పైకిస్
సద్దేమి చేయ కుండిరి,
యెద్దేవా చేతు రంచు యెరిగిన జనులే.

(సద్దు = చప్పుడు, ఎద్దేవా చేయు = ఎగతాళిచేయు)

పెద్ద కరెన్సీ నోట్లు రద్దవడం వల్ల పెద్దలకే దెబ్బ పెద్దగా తగిలింది. తెలిసిన వాళ్ళే ఎగతాళి చేస్తారని, పైకి చప్పుడు చేయకుండా ఉన్నారు.

6. కం. ఎన్నో పథకము లల్లిరి
పన్నుల నెగవేయు వారి భరతము పట్టన్,
పన్నుగడ లన్ని విఫలము,
విన్నంటెను నల్లధనము, పెంజీకటియై.

(పథకము = వ్యూహము, అల్లు = రచించు, ఎగవేయు = చెల్లించకుండా తప్పించుకొను, భరతముపట్టు = శిక్షించు, పన్నుగడ = ఎత్తుగడ, విఫలము = నిరర్థకము, విన్ను = ఆకాశము, నల్లధనము = ప్రభుత్వపు లెక్కలోనికి రాని (అన్యాయార్జితమగు) ధనము, పెంజీకటి = కటికచీకటి)

పన్నులు ఎగ్గొట్టే వాళ్ళ భరతం పట్టడానికి, ఎన్నో వ్యూహాలు రచించారు. ఆ పన్నాగాలన్నీ విఫలము అయ్యాయి. నల్లధనం కనిపించని కటిక చీకటి లాగా ఆకాశాన్ని అంటింది.

7. కం. వారసులకు నల్లధనము
జోరుగ నార్జించి యివ్వఁ జూతురు, వారిన్
వారింప నాస్తి హక్కులు
వారసులకు మొత్త మివని పైనమె వలయున్.

(వారసులు = ఆస్తి మొదలగు వానిలో వంశపరంపరగా హక్కు పొందువారు, నల్లధనము = ప్రభుత్వపు లెక్కలోనికి రాని అన్యాయార్జితమగు ధనము, జోరు = వేగం, ఆర్జించు = సంపాదించు, వారించు = నిరోధించు, పైనము = ఉపాయము, వలయు = ఆవశ్యకమగు)

వారసులకు నల్లధనం జోరుగా సంపాదించి ఇవ్వాలని చూస్తారు. అట్లాంటి వారిని నిరోధించాలంటే ఆస్తిహక్కులు వారసులకి పూర్తిగా ఇవ్వని ఉపాయం ఆవశ్యకము.

15. పురాణ కథలు

చిన్నప్పటి నుండి రామాయణ మహాభారతాలు ఇతర పురాణ కథలు వింటూనే ఉన్నాము. వాటిల్లో ఉన్న పాత్రలని దైవాలుగా చేసి పూజ చెయ్యడం కూడా చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నాం. ఆ దేవుళ్ళకి ఒక మతం పేరు కూడా అంటగట్టాం. ఉదాహరణకి శ్రీరాముణ్ణి దేవుడు అని అనుకుంటే, ఆయన్ని అనుసరించడం కానీ అనుకరించడం కానీ చెయ్యక్కర్లేదు. దేవుడు కాబట్టి చెయ్యగలిగాడు, మన వల్ల ఎక్కడ అవుతుంది అని ప్రతిదీ సులభంగా కొట్టి పడెయ్యచ్చు. దేవుడే వరాలిచ్చినా మరణం తప్పించుకోవడం కుదరదు, ఇతర కర్మ ఫలాలు తప్పించుకోవడం కుదరదు అని ఎన్ని పురాణ కథలు చెప్పినా మనం వాటిని అలక్ష్యం చేసి ఆచరణ మీద దృష్టి పెట్టకుండా మనం సృష్టించు కున్న సంకుచిత ప్రపంచంలో కొట్టుమిట్టాడుతున్నాం. ఈ విషయంలో నా ఆవేదనని కొంత వరకు క్రింది పద్యాలలో వ్యక్త పరచాను.

1. కం. విందుము యనేక కథలను,
    యందలి యుత్తముల పాత్ర లన్నిటి గుణముల్
    డెందమునన్ బూజ సలిపి
    పొందెడి లాభము హుళక్కి, పొందుము తెలివిన్.

(హుళక్కి = శూన్యము)

అనేకమైన కథలు వింటాము. వాటిల్లోని ఉత్తమ పాత్రలన్నిటి గుణాలు మనసులో నిలుపుకొని పూజ చేసి పొందే లాభము శూన్యము. తెలివి తెచ్చుకోండి.

2. కం. పౌరాణిక కథ లందున
    తారసపడు పాత్ర లెన్నొ తలపుకు నచ్చన్
    యారాధింపకఁ గేవల
    మారాటము నిలుప వలెను యాచరణమునన్.

(పౌరాణిక = పురాణములకు సంబంధించినది; తారసపడు = దృష్టిలోకి వచ్చు, ఎదురగు; పాత్ర = నాటకమున ఒక వేషము; తలపు = హృదయము; ఆరాధించు = పూజించు; కేవలము = ఒక్కటేయైన, అంత; ఆరాటము = పెంకితనము, పరితాపము; ఆచరణము = ఆచారము, నడత)

పురాణాల్లో మన దృష్టికి వచ్చే పాత్రలెన్నో మన మనసుకి నచ్చితే వాటిని పూజింపక, మన ఆరాటమంతా కేవలము ఆచరించడం మీదే పెట్టాలి.

3. కం. కథలో పాత్రల గుణముల్
వ్యధలోఁ దగు త్రోవఁ జూపి భయమును మాపుస్
కథల ప్రయోజన మిదియే
కథ లందున దేవతలను కల్పింపకుడీ.

(గుణము = స్వభావము, వ్యధ = బాధ, మాపు = పోగొట్టు)

ఏ కథలోనైనా కనిపించే పాత్రల స్వభావాలు కష్టకాలంలో సరియైన మార్గము చూపించి భయాన్ని పోగొడతాయి. కథల వల్ల ఉపయోగం అంతవరకే. కథల్లో దేవతల్ని సృష్టించ వద్దు.

4. కం. కథలో పాత్ర ప్రతీకయె,
వృథయేఁ గద వ్యక్తి పూజ వేల్పుల పూజల్,
విధుల నెరిగి విజ్ఞతతో
బుధులుగ మారంగ జనుల బోధించు కథల్.

(ప్రతీక = చిహ్నము, సూచకము; వృథ = వ్యర్థమైనది, ప్రయోజనము లేనిది; వేల్పు = దేవత; విధి = చేయవలసిన పని; విజ్ఞత = వివేకము, లోకజ్ఞానము; బుధులు = పండితులు)

ఏ కథలోనైనా వుండే పాత్ర ప్రతీకాత్మకమే. అది జరిగిందా, జరగలేదా అన్న చర్చ అనవసరము. ఆ పాత్రలని అలా చూడకుండా వ్యక్తి పూజ చేయడం, దేవుళ్ళనుకొని పూజలు చేయడం వ్యర్థమే. కర్తవ్య మెరిగి వివేకంతో పండితులుగా మారమని కథలు బోధిస్తాయి.

16. ప్రముఖులు

నేను గౌరవించే వ్యక్తులలో కొంత మంది గురించి వేరు వేరు సందర్భాలలో నేను వ్రాసిన పద్యాలు క్రింద ఇస్తున్నాను.

శ్రీ గుర్రం జాషువా:

1. సీ. భావ కవిత్వంబు భాసిల్లు కాలాన
దాని దరికి పోక, ధాటిగ పలు
సాంఘికాంశములపై సానుభూతిని జూప,
గబ్బిలము, అనాథ, కాందిశీకు
డు, ఫిరదౌసి, గిజిగాడు, తెరచాటు, శిశువు,
క్రీస్తు చరిత్ర, సఖి, అనసూయ,
శిల్పి, శ్మశానము, జేబున్నిసా, వివే
కానంద, యిత్యాది ఖండకావ్య

తే. గీ. నిధుల రచియించి, నిర్జాతి నిర్మత సమ
సంఘ మాదర్శముగ నెంచి, జగతి మెచ్చ
విశ్వ నరుడను నేనని వినుతి కెక్కి
నట్టి జాషువా సుకవికి నంజలింతు.

(భాసిల్లు = ప్రకాశించు, దరికి = దగ్గరకు, ధాటిగ = పట్టుదలగా, పలు = అనేక, ఇత్యాది = మొదలైన)

భావకవిత్వం బాగా ప్రాచుర్యం పొందిన కాలంలో దాని జోలికి పోక, పట్టుదలగా అనేక సాంఘిక సమస్యల మీద సానుభూతితో గబ్బిలము, అనాథ, కాందిశీకుడు, ఫిరదౌసి, గిజిగాడు, తెరచాటు, శిశువు, క్రీస్తు చరిత్ర, సఖి, అనసూయ, శిల్పి, శ్మశానము, జేబున్నిసా, వివేకానంద మొదలైన ఖండకావ్యాలను రచించి జాతి, మతాలకు అతీతంగా సమసమాజం

ఆదర్శంగా తీసుకుని, లోకం మెచ్చేటట్లుగా 'విశ్వనరుడను నేను' అని ప్రసిద్ధి కెక్కిన జాషువ మహాకవికి నమస్కరిస్తాను.

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):

2. కం. సిరి సిరి మువ్వల సవ్వడి,
తరగని దాహార్తి కవిత, తాపాల్, కోపాల్,
అ.ర.సం. వి.ర.సం. శ్రీశ్రీ
చిరునామా రగడ కష్టజీవి కిటు నటే.

(సిరి సిరి మువ్వల సవ్వడి = సంపదకి శోభకి ప్రతీకయైన అందెల ధ్వని అని మామూలు అర్థము, 'సిరి సిరి మువ్వా' అనే మకుటంతో శ్రీశ్రీగారు వ్రాసిన కంద పద్యాల శబ్దార్థ మాధుర్యము అని అంతరార్థము; తరగని = తగ్గని, దాహం = దప్పిక, ఏవ, ఆర్తి = పీడ, మనోవ్యథ, దాహార్తి కవిత అంటే "కవిత్వమొక తీరని దాహం" అన్న శ్రీశ్రీ మాటలని సూచిస్తుంది, తాపాల్ = బాధలు, సంతాపములు; కోపాల్ = క్రోధము, కినుక, కళారవి అన్న ఖండికలో శ్రీశ్రీ గారు వ్రాసిన "వస్తే రానీ! కష్టాల్, నష్టాల్, కోపాల్, తాపాల్, శాపాల్, రానీ" అన్న మాటలు గుర్తుకొస్తాయి; అ.ర.సం. = అభ్యుదయ రచయితల సంఘం; వి.ర.సం. = విప్లవ రచయితల సంఘం; రగడ = శ్రీశ్రీ గారు ఉపయోగించిన మాత్రాచందస్సు)

'సిరి సిరి మువ్వా' అనే మకుటంతో వ్రాసిన కంద పద్యాల శబ్దార్థ మాధుర్యము, ఎప్పటికీ తీరని దాహంగా ఉన్న కవిత్వము, తాపాలూ, కోపాలూ, అ.ర.సం., వి.ర.సం. లకు అధ్యక్షుడుగా ఉన్న శ్రీశ్రీగారి చిరునామా అనిపించే రగడ (ఆయన వ్రాసిన మాత్రాచందస్సు రగడలు) కష్టజీవుల గురించే. కవికి నిర్వచనంగా శ్రీశ్రీగారు ఏమన్నారంటే, 'కష్టజీవి'కి అటూ ఇటూ నిలిచినవాడే 'కవి' అని. 'కష్టజీవి' అన్న పదంలో మధ్యలో ఉన్న రెండు అక్షరాలు తొలగిస్తే, ఇటున్న అక్షరం అటున్న అక్షరం కలిపి 'కవి' మిగులుతుంది. అందుకే, కష్టజీవి చుట్టూ, పతితుల కోసం, బాధాసర్పద్రష్టుల కోసం విప్లవ శంఖం పూరించారు, తమ కవితల ద్వారా, శ్రీశ్రీగారు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ:

3. కం. సద్విషయమ్ముల నెన్నిటొ,
తద్విషయమ్ముల యపూర్వ తత్త్వము తోడన్,
యుద్విగ్నతఁ దీర్పగ తా
నద్వైతము విశ్వనాథ యందించె నిలన్.

(సద్విషయములు = మంచి విషయములు; తద్విషయములు = ఆ విషయములు; అపూర్వ = పూర్వము లేనిది, క్రొత్తది; తత్త్వము = స్వభావము, సారము; ఉద్విగ్నత = వ్యాకుల చిత్తత, భయము; అద్వైతము = జీవేశ్వరులకు అభేదము; అందించు = ఇచ్చు, ఇల = భూమి)

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు లోకానికి ఎన్నో మంచి విషయాలని, ఆ విషయాలలో ఉన్న లోతైన సారంతో, భయాందోళనలను పోగొట్టడం కోసం, జీవేశ్వరులకు ఉన్న అభేద తత్త్వాన్ని లోకానికి ఇచ్చారు.

డా. సి. నారాయణరెడ్డి:

4. కం. విశ్వంబున మనిషి ప్రగతి
నాస్వాదితముగ సి.నా.రె. యందించిన యా
సుస్వర వికాస గేయము
'విశ్వంభర' జ్ఞాన పీఠ విడెము నొసంగెన్.

(ఆస్వాదితముగ = అనుభవింప బడునట్లుగా, విడెము = తాంబూలము)

లోకంలో మనిషి అభ్యుదయాన్ని ఆస్వాదింపబడేటట్లుగా సి. నారాయణ రెడ్డి గారు అందించిన 'విశ్వంభర' అన్న లయబద్ధమైన వికాస గేయము 'జ్ఞానపీఠము' (భారతదేశపు అత్యున్నత సాహితీ పురస్కారం) అనే తాంబూలము ఇచ్చింది.

శ్రీ గిడుగు రామమూర్తి:

5.   సీ.   వ్యాకరణ నిఘంటు వ్యవహారమే లేని
        సవర భాషకు నవి సంతరించి,
    బడుల నేర్పెడి భాష పలుకు లాడెడి భాష
        వేరన్న నిజమును విశదపరచి,
    వీరేశ, గురజాడ, వేంకట కవివర్గ
        మెంతొ ప్రోత్సాహంబు నిచ్చి మెచ్చ,
    కావ్యపు భాషయేఁ గడు భేషజమ్మని
        వ్యవహార భాషకు వన్నె తెచ్చి,

    తే.గీ.   జీవితాంతము భాషకు సేవఁ జేసి
    వాసి కెక్కినట్టి పిడుగు వార్షికపు జ
    యంతి భాషా దినోత్సవ మాంధ్ర జగతి,
    కట్టి రామమూర్తి గిడుగు కంజలింతు.

(వ్యవహారము = వాడుక, సంతరించి = కలిగించి, విశదపరచి = స్పష్టముచేసి, భేషజము = వట్టి బడాయి, వన్నె = గౌరవము, వాసి = ప్రసిద్ధి, వార్షికపు జయంతి = చనిపోయిన తర్వాత సంస్మరణంగా ఏటా జరుపుకొనే మహాపురుషుని పుట్టినరోజు, అంజలింతు = నమస్కరిస్తాను)

వ్యాకరణం, నిఘంటువు వాడుకలో లేని సవర భాషకి (దక్షిణ ముండా భాష) వాటి నిచ్చి, విద్యాలయాల్లో నేర్పే భాషా మాట్లాడే భాషా వేరు అన్న నిజాన్ని స్పష్టంగా చెప్పి, కందుకూరి వీరేశలింగం పంతులు గారు, గురజాడ అప్పారావు గారు, చెళ్ళపల్లి వేంకటశాస్త్రి గారు లాంటి కవులు ఎంతో ప్రోత్సాహ మిచ్చి మెచ్చగా కావ్యభాష పెద్ద బడాయి అని చెప్పి వాడుక భాషకి ప్రశస్తి తెచ్చి, జీవితాంతము భాషాసేవ చేసి ప్రసిద్ధి కెక్కిన పిడుగు (వంటి గిడుగు) వార్షిక జయంతి ఆంధ్ర లోకంలో భాషాదినోత్సవము. అటువంటి గిడుగు రామమూర్తిగారికి నమస్కరిస్తాను.

శ్రీ జంధ్యాల:

6. కం. జంధ్యాల హాస్య సంద్రపు
సంధ్యామారుతము, మధుర సరసోక్తుల సౌ
గంధ్యము, ముంచెను మము, యను
బంధ్యాశ్రిత నటులు మేలు భళిరా యనగా.

(సంద్రము = సముద్రము, సంధ్య = ఉదయకాలము, మారుతము = గాలి, మధుర = ఇంపైన, సరస = రసముతో గూడిన, ఉక్తుల = మాటల, సౌగంధ్యము = పరిమళము, అనుబంధ్య = ముఖ్యమైన, ఆశ్రిత = ఆశ్రయము పొందిన)

సినీదర్శకుడు జంధ్యాల హాస్యసముద్రపు ప్రాతఃకాల మారుతము, ఆయన ఇంపైన రసగుళికలు లాంటి మాటలు, ఆయనను ఆశ్రయించిన ముఖ్యమైన నటులు భళీయని మెచ్చుకోగా, మమ్మల్ని ముంచేసినాయి.

శ్రీ అటల్ బిహారీ వాజపాయి:

7. కం. ప్రబలము శాంతము మనమున,
నిబిడము యాలోచనములు, నిష్ఠను తన దై
న బలము, వాక్చాతురి, అట
ల బిహారీ వాజపేయి లక్షణము లివే.

(ప్రబలము = ప్రధానమైన గుణము, నిబిడము = దృఢమైన, నిష్ఠ = ఉనికి, నిర్వహణము; వాక్చాతురి = మాటల నేర్పు)

మానసికంగా పరమ శాంతస్వభావము, దృఢమైన ఆలోచనాసరళి, నిష్ఠలో తనదైన దిటవు, మాటల నేర్పు, ఇవే అటల్ బిహారీ వాజపేయి లక్షణాలు.

శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ:

8. మ. అల త్యాగయ్యకు లేదు యన్నమయకున్ యానాటి వాగ్గేయకా
రులు యెవ్వారికి లేదు, శారదకు సద్రూపంబులౌ స్వీయ సం
కలనమ్ముల్ తమ కాల మందె రసికుల్ గానమ్ముఁ జేయంగ వ
ర్ధిలు భోగంబు, జగాన బాలమురళీకృష్ణాఖ్యు కున్నట్లుగన్.

(అల = ఆ, వాగ్గేయకారులు = వాక్కును గేయరూపంలో వెలిబుచ్చేవారు, సంకలనము = కూర్పు (composition), రసికులు = సహృదయులు, వర్ధిలు = వృద్ధిపొందు, భోగము = అనుభవము, జగాన = లోకంలో, బాలమురళీకృష్ణాఖ్యుకు = బాలమురళీకృష్ణ అనే పేరు గల వానికి)

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తాము రచించిన "రామాయణ కల్పవృక్షము" అన్న కావ్యం యొక్క అవతారికలో చెప్పిన "అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగ ..." అన్న పద్యం చాలా విలక్షణంగా ఉంటుంది. ఒక గురువుకి తన లాంటి శిష్యుడు ఉండడం ఒక భోగమైతే, ఆ భోగము తన గురువు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారికి దక్కింది గాని, అల నాటి మహా కవులు నన్నయ్య తిక్కనకి కూడా దక్క లేదనడం ఒక గొప్ప భావన. ఇలాంటి పద్యం వ్రాయాలని ఎప్పటి నుంచో అనుకుంటూ ఉంటే, పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి గురించి అలాంటి పద్యం వ్రాస్తే బాగుండు అని అనిపించింది. వారు వాగ్గేయకారుడు మాత్రమే కాదు, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి లాగా శిష్య పరంపర ఉన్న గురువు (సంగీతంలో). త్యాగయ్యకు అన్నమయ్యకు దక్కని ఒక సౌభాగ్యం ఆయనకు లభించాయని చెప్పడమే పై పద్యంలో ఉన్న ఉద్దేశ్యం.

సరస్వతికికి నిజమైన రూపాలనిపించే తమ కూర్పులు (compositions) తమ కాలంలోనే సహృదయులు పాడగా వృద్ధి పొందడం (వ్యాప్తి పొందడం) అన్న అనుభవము లోకంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారికి ఉన్నట్లుగా అప్పటి త్యాగరాజుకు గానీ, అన్నమయ్యకు గానీ, మరే యితర వాగ్గేయకారులకి గానీ లేదు.

శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం:

9. కం. ఎన్నో సుమధుర గీతము
లెన్నో భాషలను పాడి, యెన్నో మెప్పుల్
మన్నన లందిన బాలూ
కన్నీటను ముంచి మనల కనుమరుగయ్యెస్.

ఎన్నో మంచి ఇంపైన పాటలు ఎన్నో భాషలలో పాడి ఎంతోమంది మెప్పులు, గౌరవాలు అందుకున్న శ్రీ ఎస్. పీ. బాలసుబ్రహ్మణ్యం గారు మన నందరినీ శోకంలో ముంచి కనుమరుగయ్యారు.

శ్రీ చాగంటి కోటేశ్వరరావు:

10. శా. శ్రీ శ్రీ, కైవల్యము లందు, రెండవదె తుష్టిస్ యిచ్చు నంచుస్, యధి
శ్రీకుండై సదుపాసనా పరిమళశ్రీలస్, యుపన్యాస ధా
రా కాంతిస్ ధర వెల్గు నింపుటను నీ లక్ష్యంబులో యోగిపై
సాకారమ్ముగఁ జూచినావు భవునే, చాగంటి కోటేశ్వరా!

(శ్రీ = ఐశ్వర్యము, కైవల్యము = మోక్షము, తుష్టి = సంతోషము, అధిశ్రీకుడు = చక్రవర్తి లేక గొప్ప సంపద కలవాడు, ఉపాసన = ఆరాధనము, పరిమళ = సౌరభము, ధార = ప్రవాహము, యోగి = సాధువు, సాకారము = ఆకృతితో సహా, భవుడు = శివుడు)

శ్రీ చాగంటి కోటేశ్వరా! సంపద, మోక్షముల రెంటిలో మోక్షమే సంతోష మిస్తుందని, ఉత్తమమైన ఆరాధనా పరిమళముల సంపదలో చక్రవర్తివై ఉపన్యాస ధారలనే కాంతితో లోకంలో వెలుగు నింపడం అనే నీ లక్ష్యంలో యోగివై సాకారంగా శివుణ్ణే దర్శించావు.

11\. శా. నిస్స్వార్థమ్ముగ ధర్మచింతనుడవై నీతిన్ సుశబ్దంబుగా
యస్వాధ్యాయులకున్ నిరంతరము నధ్యాత్మోపదేశంబులన్
యాస్వాదింపగఁ జేయుచున్, బ్రతుకు నందర్థం బదే నంచు యో
జస్వంతుం డను పేరుఁ గాంచిన ఘనా! చాగంటి కోటేశ్వరా!

(నిస్స్వార్థమ్ముగ = స్వప్రయోజనము ఆశింపకుండా, అస్వాధ్యాయుడు = వేదాధ్యయనము చేయనివాడు, అధ్యాత్మ = వేదాంతజ్ఞానము, ఆస్వాదింపగ జేయు = అనుభవింప జేయు, ఓజస్వంతుడు = దీప్తి కలవాడు, ఘనుడు = గొప్పవాడు)

శ్రీ చాగంటి కోటేశ్వరా! నిస్స్వార్థముగా ధర్మచింతనతో నీతిని మంచి వాక్కులతో వేదాద్యయనము చేయని వారికి ఎల్లప్పుడు వేదాంత జ్ఞానోపదేశాలతో చవి చూపిస్తూ జన్మసార్థకము చేసుకుని దీప్తి కలవాడుగా పేరు తెచ్చుకున్న మహనీయుడవు.

12\. శా. ఐశ్వర్యంబుల వెంట పర్వు లిడకన్ యైతిహ్య భావార్భటిన్
నిశ్వాసంబున కర్మఠుం డగుచు నిర్నిద్రోపభోగమ్ముగా
విశ్వం బంతయు యీశ్వరేచ్ఛ యనుచున్ వేదోక్తులన్ జెప్పుచున్
శశ్వత్కీర్తి గడించినట్టి యతివే చాగంటి కోటేశ్వరా!

(ఐతిహ్య =పారంపర్యముచేనగు ఉపదేశము; ఆర్భటి = ఆర్భాటము, అతిశయము; నిశ్వాసము = ఊపిరి; కర్మఠుడు = కార్యదక్షుడు, నిర్నిద్ర = జాగరూకత కల, ఉపభోగము = అనుభవము, శశ్వత్కీర్తి = శాశ్వతమైన కీర్తి, గడించు = సంపాదించు, యతి = యోగి)

శ్రీ చాగంటి కోటేశ్వరా! సిరిసంపదల వెంట పరుగు లెత్తక కార్యదక్షత జాగరూకతలే ఊపిరిగా వెనుకటి తరాలనుండి ముందు తరాలకి అందించే సందేశాలను భావాతిశయంతో విశ్వమంతా ఈశ్వరేచ్ఛ యని వేద వాక్కులతో చెప్పుతూ శాశ్వతమైన కీర్తిని సంపాదించిన యోగివి నీవే.

శ్రీ కె. ఎస్. రాజన్న:

13. కం. దివ్యాంగుల క్రీడలలో
భవ్యంబగు ఖ్యాతి గొన్న, వర రాజన్నా!
సవ్యముగ సదృశులకు సం
భావ్యము సలుప తమకు గతిపడె పద్మశ్రీ.

(దివ్యాంగులు = వికలాంగులైనా విభిన్న ప్రతిభావంతులు, క్రీడ = ఆట, భవ్యము = యోగ్యమైనది, ఖ్యాతి = కీర్తి, వర = శ్రేష్ఠుఁడు, సవ్యము = అనుకూలము, సదృశుడు = సమానుడు, సంభావ్యము = అవశ్యమైనది, సలుపు = చేయు, గతిపడు = లభించు)

కె. ఎస్. రాజన్నగారు బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త. పోలియో బారిన పడి చిన్నప్పుడే కాళ్ళు చేతుల వాడకం కోల్పోయినా, 2002వ సంవత్సరంలో జరిగిన పారాలింపిక్సులో డిస్కస్ త్రోలో స్వర్ణం స్విమ్మింగులో రజత పతకం భారత దేశానికి గెలిచారు. ఒక ఎంట్రప్రెన్యూర్ అయ్యి సుమారు 350 మందికి బ్రతుకుతెరువు ఇస్తున్నారు. వారిలో చాలా మంది దివ్యాంగులే. ఈ పద్యం రాజన్న గారికి అంకితం. వికలాంగులైనా విభిన్న ప్రతిభావంతులైన వారికి సంబంధించిన క్రీడలలో యోగ్యమైన కీర్తిని గడించిన మహాత్మా! రాజన్నా! సరియైన విధంగా నీ సమానులకి అవసరమయినది చెయ్యడం వలన తమరికి పద్మశ్రీ బిరుదు లభించింది.

17. భక్తి

భక్తు లంటే ఎలా ఉండకూడదో అనడానికి రెండు పద్యాలు, ఎలా ఉండాలి అని చెప్పడానికి ఒక పద్యము, నేను వ్రాసినవి క్రింద ఇవ్వబడినాయి.

1. శా. భారీ యాస్తులు యక్రమార్జనలతో భాసిల్ల, భూకబ్జలన్
 మారీచంబుల వక్ర మార్గముల సంపద్గర్వమే హెచ్చవన్,
 బోరాడన్ తమ పాపభీతిని మదిన్ బోటెత్తు సంఘర్షణల్
 దూరం బుంచగ, చేరుపైరి ప్రభుకున్ దోడ్పాటు నాశించుచున్,
 యూరూరన్ తమ భక్తి చాటుటకు యెన్నో పూజలం సల్పుచున్,
 కారుణ్యంబునుఁ జూప దానము లనేకమ్ముల్ యొనర్పించుచున్,
 వారా భక్తులు? వారి యర్పణల కైవారంబు లందన్నిటన్,
 నైరాశ్యంబగు భక్తి లేక, వెలయున్ నైపథ్య నైచ్యంబెగా,
 యారాధించు విధమ్మటన్న యదియా! యార్భాటమేఁ గన్పడున్.

(కబ్జా = ఇతరుల లేదా ప్రభుత్వ స్థలాన్ని అనుమతి లేకుండా ఆక్రమించటం, మారీచము = మోసము, హెచ్చు = అధికము, సంఘర్షణ = ఒత్తిడి, తోడ్పాటు = సహాయము, ఆశించు = ఆశపడు, అర్పణ = సమర్పణము, కైవారము = స్తోత్రము, నైరాశ్యము = ఆశలేనితనము, వెలయు = బయలుపడు, నైపథ్య = నేపథ్యము, నైచ్యము = నీచభావము, ఆరాధించు = పూజించు, ఆర్భాటము = ఆడంబరము)

అక్రమ సంపాదనతో భారీ ఆస్తులు విలసిల్లగా, భూ కబ్జాలు, మోసాలు, అడ్డదారులతో సంపద ఉన్నదనే గర్వం ఎక్కువ అవ్వగా, తమ పాప భయంతో పోరాడడానికి, మానసిక ఒత్తిడులను దూరం పెట్టడానికి, దైవ సహాయం ఆశించి, ఊరూరా తమ భక్తి చాటి చెప్పడానికి పలు విధాల పూజలు చేస్తూ, దయ చూపించడం కోసం అనేక దానాలు చేయిస్తూ, దేవునికి దగ్గర అయ్యారు. వాళ్ళు భక్తులా? వాళ్ళ అర్పణలు, స్తోత్రములు అన్నిటిలో, కోరికలు లేకుండా

ఉండే భక్తి లేక, ముస్తాబు చేసిన నీచత్వమే బయటపడుతుంది. పూజ చేసే పద్ధతి అంటే అదా! డాబే కనపడుతుంది.

2. ఉ. కోరిక కోర నెంచియొ, ప్రకోపము చేకుఱు భీతి చేతనో,
మీరగ రాని హద్దులను మీరుటకో, తమ గొప్ప కోసమో,
ప్రేరిత డంబరమ్ములకు, ప్రీతికి భక్ష్య నివేదనార్థమో,
కారణమైన పూజ కొఱఁగానిది, మీ కది యాత్మవంచనే.

(ప్రకోపము = ఉగ్రము, చేకుఱు = సిద్ధించు, భీతి = బెదురు, హద్దు = పరిమితి, మీరుట = అతిక్రమించుట, ప్రేరిత = ఉత్తేజింపబడిన, డంబరము = ప్రతిష్ఠ)

కోరిక కోరుదాం అనుకునో, ఏదో ప్రకోపము సంభవిస్తుందేమోననే భయం చేతనో (అంటే, పూజ చెయ్యకపోతే భగవంతుడికి కోపం వస్తుందనో), దాటకూడని పరిమితులు దాటడం కోసమో (భగవంతుని దయ మనమీద ఉంటే ఏదైనా చెయ్యగలం అని కొందరు అనుకుంటారు), సంఘంలో గొప్పవారన్న గుర్తింపు కోసమో, ఎవరో ప్రేరేపిస్తే వచ్చే ప్రతిష్ఠ కోసమో, భగవత్ప్రీత్యర్థం భక్ష్యాలు నైవేద్యం పెట్టడం కోసమో, కారణమైన పూజ ఎందుకూ పనికి రానిదే. అది మీకు ఆత్మవంచనే.

3. ఉ. ఎంచిన వృత్తినే తమకు యీశ్వరు డిచ్చిన కార్య మంచుఁ, గ
న్పించున దంతయుస్ జెవుల విన్పడు దెల్లయు లోన వెల్పలస్
సంచరణమ్ముఁ జేయునది, సర్వము దేవుని తత్త్వమేఁ గదా
యంచను దృష్టి తోడ మది నందరికిస్ తన ప్రేమఁ బంచుచుస్,
యంచితమౌ స్వధర్మమున కంకిత మయ్యెడు వారె భక్తులౌ.

(ఎంచిన = అనుకున్న, ఎల్ల = సమస్తము, సంచరణము = సంచారము, అంచితము = సమ్మానితము, స్వధర్మము = తన విధి)

ఎంచుకున్న వృత్తినే తమకి భగవంతు డిచ్చిన పనిగా అనుకుని, "యచ్చకించి జ్జగత్సర్వం, దృశ్యతే శ్రూయతేఽ పివా, అంతర్బహిశ్చ తత్సర్వం, వ్యాప్య నారాయణ స్స్థితః" అని మంత్రపుష్పంలో చెప్పినట్లుగా కనిపించేదంతా, వినిపించేదంతా, లోనా బయటా ఉన్నదంతా, భగవంతుని తత్త్వమే అనే దృష్టితో, మనస్సులో అందరికీ ప్రేమ పంచుతూ, సమ్మానింప దగ్గ స్వధర్మానికి అంకితమయ్యే వారే భక్తులు.

18. భావావేశము

1. కం. భావావేశము కవులన్
    లావా వలె పొంగిపొరలు లహరుల వలె, మే
    ధావులగు కవుల చింతన
    లావా వలె చల్లఁబడదు లాహిరిఁ గ్రమ్మన్.

(లావా = అగ్నిపర్వతముల నుండి రాయికరగి ప్రవహించు అత్యధికోష్ణోగ్రత కల ద్రవము; పొంగిపొరలు = అధికమగు, మిక్కుటమగు; లహరి = పెద్ద అల; లాహిరి = మైకము; క్రమ్ము = వ్యాపించు)

కవులలో భావావేశము లావా లాగా పెద్ద అలల వలె పొంగుతుంది. సూక్ష్మబుద్ధి గల కవుల ఆలోచనా స్రవంతి ఆ మత్తులో ఉండటం వలన లావా లాగా చల్లబడదు. అంటే, ఎప్పటికీ శిలగా (రాయిగా) మారదు.

2. కం. భావము యందదు భాషకు
    భావంబున కంద నట్టి బంధము లోతే
    కోవిదుల పలుకు సత్యము
    భావాంబర వీధి యందు భాషలు కలవా?

(భావము = తలపు, ఊహ; బంధము = కావ్యరచనావిశేషము, కోవిదులు = విద్వాంసులు, అంబర వీధి = ఆకాశవీధి)

ఊహలు భాష కందవు. ఊహల కందని కావ్యరచన లోతుగా ఉంటుంది. విద్వాంసులు చెప్పే మాట నిజము. భావాకాశంలో భాషలు ఉంటాయా?

19. ముందు తెలిసెనా

కీర్తిశేషులు దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు వ్రాసిన 'విప్రనారాయణ' అన్న ఆకాశవాణి నాటికలో "ముందు తెలిసెనా, ప్రభూ" అన్న పాట ఉంది. ఆ పాటని తర్వాత 'మేఘ సందేశం' అన్న సినిమాలో పెట్టారు. ఆ పాటంటే నాకు చాలా ఇష్టం. దాని ఆధారంగా వ్రాసిన పద్యాలే ఈ శీర్షికలో ఇచ్చాను. పద్యాలలో ఉన్న భావం, వాడిన పదాలు చాలావరకు కృష్ణశాస్త్రి గారివే.

1. కం. ముందుగ నీ రాకెరిగిన,

    మందిర మిటు లుంచనాయె, మందమతిని, యా

    సుందర క్షణమే కొంచెము

    ముందు తెలియ నా మనసును ముందుంతు ప్రభూ!

ముందుగా నీ రాక నాకు తెలిస్తే, మందిరం ఇలా ఉంచను కదా, అవివేకిని. ఆ సుందర క్షణమే కొంచెం ముందు తెలిస్తే, నా మనసే నీ ముందు ఉంచుతాను కదా, ప్రభూ!

2. కం. ముందే యలికిడి తెలిసిన

    సుందర మందార కుంద సుమ దళములతో

    యందముగా వాకిలి కను

    విందుగ ముస్తాబుఁ జేసి విస్మయ పరతుస్.

ముందుగా నీవు వస్తున్నట్లు అలికిడి తెలిస్తే, సుందరమైన మందార, మల్లె పూదళములతో అందముగా వాకిలిని కనులకు విందుగా ఉండేటట్లు అలంకరించి నిన్ను అశ్చర్యపరుస్తానుగా.

3. కం. నీ రాక ముందు తెలిసిన

    జోరుగ, నే, పారిజాత సుమ దళములు నీ

    దారంతయు పరతునుగా,

    తీరుగ యడుగుల గురుతులు దీపించు నటుల్.

నీ రాక ముందుగా తెలిస్తే, ఉత్సాహంగా నేను, నీ అడుగుల గుర్తులు చక్కగా ప్రకాశించేటట్లుగా, పారిజాత పూదళములు నీ దారంతా పరుస్తాను.

4. కం. బ్రతుకంత యెదురుఁ జూడగ
యతిగతి లేదే, యెదు రరయని వేళస్ వ
చ్చి తికమకఁ బెట్టి, నాకుస్
యతి శీఘ్రంబుగ కనుమరు గగుటల్ దగునే.

బ్రతుకంతా ఎదురు చూస్తే నీ అతీగతీ లేదే. ఎదురు చూడని వేళలో వచ్చి నన్ను గాబరా పెట్టి హఠాత్తుగా కనిపించకుండా పోవడం నీకు తగునా.

5. కం. క్షణమైన కదలనీయక
మనసును సంకెలగఁ జేసి, మాటు పరుచ లే
ననిఁ దెలిసి నీవు నిలువక
నను యిచటనె వదలిఁ బోవ, న్యాయం బగునా?

ఒక క్షణమైనా కదలనీయకుండా నా మనస్సును సంకెలగా చేసి నిన్ను దాచలేనని తెలిసి నువ్వు నిలవకుండా నన్ను ఇక్కడే వదలి వెళ్ళిపోవడం న్యాయమేనా.

6. కం. అందముగా నీ కనులకు,
సుందర వదనారవింద! సుమనస్సులతో
విందుగ నీకై నా మ
న్మందిరముస్ సిద్ధ పరచి మాన్యుడ నైతిస్.

సుందరంగా ఉండే తామర పుష్పం లాంటి మోము కలవాడా! అందమైన పుష్పాలతో నీ కళ్ళకి విందుగా నా మనో మందిరాన్ని సిద్ధం చేసి నన్ను నేను గౌరవించుకున్నాను.

20. రంగనాథము

నా పేరు రంగనాథము. నా పేరులో ఉన్న 5 అక్షరాలు, ఒక్కొక్కటి మొదటి అక్షరం అయ్యేటట్లుగా 5 కంద పద్యాలు వ్రాశాను. చూడండి.

1. నా పేరులోని మొదటి అక్షరం 'రం' తో మొదలయ్యే పద్యం క్రింద ఇవ్వబడింది.

కం. రంజకమగు పద్యకవిత
మంజులమగు వాగ్విభవము మైమరపించున్
జంజాటము, జీవిత మం
దుం జింతలుఁ బాప శాంతి దొరకొను మదిలో.

(రంజకము = ఆనందకరము, మంజులము = మనోహరము, వాగ్విభవము = మాట్లాడడంలో నేర్పు, మైమరపించు = ఒడలు మరచిపోయేటట్లు చేయు, జంజాటము = ఆడంబరము, చింత = తలపు, పాపి = తొలగించి, దొరకొను = లభించు, మది = మనస్సు)

ఆనందకరమైన పద్య కవిత్వం, మనోహరమైన వాగ్విభవము తగులాటము లన్నిటినీ మరచిపోయేటట్లు చేస్తుంది. జీవితంలో చింతలు పోగొట్టడం వల్ల మదిలో శాంతి లభిస్తుంది.

2. శ్రీమద్రామాయణంలోని యుద్ధకాండలో ఆదికవి వాల్మీకి రామ రావణ యుద్ధాన్ని వర్ణిస్తూ చెప్పిన శ్లోకం క్రింద ఇవ్వబడింది.

గగనం గగనాకారం సాగరః సాగరోపమః,
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ

అంటే, "ఆకాశానికి ఆకాశమే పోలిక, సముద్రానికి సముద్రమే పోలిక, రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే పోలిక" అని. ఇది అనన్వయాలంకారము. దీన్ని ఆధారంగా చేసుకుని క్రింది పద్యం వ్రాశాను. నా పేరులోని రెండవ అక్షరం 'గ' తో మొదలయ్యే పద్యం ఇదే.

కం. గగనము గగనాకారమె,
జగమున సరిపోలు నెద్ది సాగరమున, కా
శుగ సాగను రవి కిరణమె,
సొగసున నీ కెవరు సాటి శుభకర రామా!

(గగనము = ఆకాశము, సరిపోలు = సాటివచ్చు, ఎద్ది = ఏది, ఆశుగ = వేగముగా పరుగెత్తే, సాగను = పోవుటకు, సొగసు = అందము, సాటి = సమానము, శుభకర = శుభమును చేయు)

పద్యంలో ఉన్న మొదటి రెండు ఉపమానాలు (అనన్వయాలంకారం కాబట్టి ఉపమేయాలు కూడా) వాల్మీకి శ్లోకం నుండే వచ్చాయి. గగనం గగనాకారం లోనే ఉంటుంది. లోకంలో సముద్రానికి సరిపోలేది ఏది? అంటే, లేదని. ఇక, పద్యంలో మూడవ, నాల్గవ అనన్వయాలకి ఏమి తీసుకోవాలి అన్న ప్రశ్న ఉదయించింది. మూడవ దానికి, సూర్య కిరణాల కన్నా వేగంగా ఏవీ ప్రయాణించ లేవన్న ఆలోచన ఐన్ స్టీన్ (Einstein) సాపేక్ష సిద్ధాంతం (Relativity Theory) నుండి తీసుకున్నాను. నాల్గవ దానికి, 'పుంసాం మోహన రూపాయ' అన్న మాట గుర్తొచ్చి 'శుభకరుడైన రామా! అందానికి నీకెవరు సాటి' అని చెప్పడం జరిగింది.

3. నా పేరు లోని మూడవ అక్షరము “నా” తో మొదలయ్యే పద్యం క్రింద ఇవ్వబడింది.

కం. నాలో సత్యాన్వేషణ
కాల పరీక్షలకు నిలచి కరుణను నింపన్
క్షాళిత మయ్యెను నా మది,
యాలాపించుచు కవితల నానందముతో.

(అన్వేషణ = వెదకుట, క్షాళితము = కడుగబడినది, మది = మనస్సు, ఆలాపించుచు = చెప్పుకొనుచు)

నాలో సత్యాన్వేషణ సమయము పెట్టిన పరీక్షలకు నిలచి దయను నింపగా, ఆనందంతో కవితలు ఆలాపిస్తూ నా మనస్సు కడుగబడింది.

4. భగవద్గీత లోని మూడవ అధ్యాయంలో 35వ శ్లోకం క్రింద ఇవ్వబడింది.

శ్రేయాన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః

చక్కగా ఆచరించబడిన పరధర్మం కన్నా, గుణరహితమైనప్పటికీ స్వధర్మమే అత్యుత్తమమైనది. స్వధర్మాచరణంలో మరణం సంభవించినప్పటికీ అది శ్రేయస్కరమే. కానీ, పరధర్మం మాత్రం భయంకరమైనది. ఇది పై శ్లోకానికి అర్థము. దీన్ని ఆధారంగా చేసుకుని నా పేరు లోని నాల్గవ అక్షరము "ధ" తో మొదలయ్యే పద్యం వ్రాశాను.

కం. ధర్మాత్ము లెవరి కైనను,
కర్మమన స్వధర్మమెఁ గద, కర్మఠు లెపుడున్,
ధర్మము పరులదిఁ జేయ ర
ధర్మ మటంచు నది యాభ్యుదయితం బైనన్.

(ధర్మాత్ములు = పుణ్యాత్ములు, కర్మము = కార్యము, స్వధర్మము = తన విధి, కర్మఠులు = నెఱవేరుదాక నొకపని చేయువారు, ధర్మము = విధి, అధర్మము = ధర్మమునకు విరుద్ధమైనది, ఆభ్యుదయితము = వృద్ధియే ప్రయోజనముగా గలది)

ధర్మాత్ములు ఎవరికైనా చేయవలసిన కర్మము స్వధర్మమే. అంటే, తమ బాధ్యతలు, విధులు నిర్వర్తించడమే. అలా చేపట్టిన పనిని చివరిదాకా వదలక చేసేవారు, ఇతరుల విధులను, అవి అధర్మమనే ఉద్దేశ్యంతో అభ్యుదయమే ప్రయోజనంగా ఉన్నప్పటికీ చేయరు. ఎవరు ఏ విధులకై నియోగింపబడతారో వారు ఆ విధులు నిర్వర్తించడమే ధర్మము. వేరే వాళ్ళ విధులు చేయాలనుకోవడం సంఘంలో పొసగదు. అట్లా చేయలనుకుంటే, పంచతంత్రంలో చెప్పినట్లు,

కుక్క పని గాడిద చేసినట్లుంటుంది. ఇంకో విషయమేమిటంటే, మనకి మన పని కాకుండా ఎప్పుడూ వేరే వాళ్ళ పని నచ్చుతూ ఉంటే, మన పని మనం ఎప్పుడు చేస్తాం?

5. నా పేరులోని ఐదవ అక్షరం 'ము' తో మొదలయ్యే పద్యం క్రింద ఇవ్వబడింది.

కం. మును యాలుచిప్ప యైనన్
చినుకులుగా స్వాతి వాన చిప్పిల యదియే
మిణికెడి ముత్యం బయె, దీ
వన లటు నాపై గురువులు వర్షించిరిలే.

(మును = మొదలు, స్వాతి వాన = సూర్యుడు స్వాతి నక్షత్రమున నున్నపుడు పడే వాన, చిప్పిలు = స్రవించు, మిణుకు = తళుకుమను)

మొదట్లో కేవలము ఆలుచిప్ప అయినా కూడా, స్వాతివాన చినుకులు పడగానే తళుక్కుమనే ముత్యం అయింది. అదే విధంగా, నాపై గురువులు వారి దీవనలు కురిపించారు.

21. రామరాజ్యం

గాంధీగారు కలలు కన్న రామరాజ్యం అంటే ఒక ఆదర్శమైన రాజ్యం. రామరాజ్యం యొక్క లక్షణాలు కొన్ని క్రింద ఇచ్చిన ద్విపదల్లో చెప్పబడినాయి.

రామరాజ్యం బన్న రామరాజ్యంబె
నామమాత్రం బన నగుఁబాటుఁ గాదె 1

లక్షణములనుఁ బోల్చఁ దెలియు నిజము
దీక్షగా విన్నచో తీరు సంశయము 2

అన్నదమ్ముల నున్న యనుబంధమునకు
మన్నియ పుత్రులే మన్ననఁ దెచ్చె 3

యశము సంపాదించ నన్ని రీతులను
దశరథు సుతులకు తౌల్యమే లేరు 4

సామ్రాజ్య కాంక్ష దిశల యందుఁ గ్రమ్మ
నమ్ములై సోదరు ల్నాకొద్దు యనుట 5

భోగ లాలసు లేలు భూమిపై నరుదు
త్యాగ నిరతికి యుదాహరణయ్యె 6

పెట్టుపోఁతల తోడఁ బ్రీతి నుగాదిఁ
బట్టున కోసల పార్థివుఁ జేయ 7

రాముడు రాజయ్యి రక్షించె ప్రజల
నీమంబులను నిల్పి నిశ్చింత నిచ్చె 8

క్రూర మృగములచే క్షోభయే లేదు
చోరు లున్నటువంటి చోటెందు లేదు 27

దండనకు జడిసి దాంతి వాంఛించి
దుండగము జనపదులుఁ జేయ లేదు 28

వైధవ్య దుఃఖము వనితల లేదు
బాధ యసలు లేదు వ్యాధుల వల్ల 29

యపమృత్యుభయ మను నది యట వినము
యుపకార వాంఛయే యుండె ప్రజలకు 30

యెట్టి యనర్థము లెట్టి దుఃఖములు
యెట్టి బాదరబంది యెరుగరు ప్రజలు 31

యసమానముగఁ జేసి యశ్వమేధమును
వసుధైక భావంబు వ్యాపింపఁ జేసె 32

సమకూర్చ కీర్తిని సకల విధముల
రమణించె జగతియె రామరాజ్యముగ 33

పాలించె నీ రీతి పదివేల యేండ్లు
నేల నాల్గు దిశల నిత్య పర్వముగ. 34

(నామమాత్రం = పేరుకు మాత్రమే చెప్పుకోదగినది, నగుఁబాటు = అపహాస్యము, లక్షణము = గుణము, దీక్ష = పట్టుదల, తీరు = పరిష్కృతమగు, సంశయము = సందేహము, మన్నియ = ప్రభువు, మన్నన = గౌరవము, యశము = కీర్తి , తౌల్యము = పోలిక, క్రమ్ము = వ్యాపించు, నమ్రుడు = వినయవంతుడు, ఒద్దు = అక్కఱలేదు, భోగలాలసుడు = సుఖము లందు మిక్కిలి

కాంక్షగలవాడు, ఏలు = పాలించు, అరుదు = దుర్లభము, నిరతి = మిక్కిలి ఆసక్తి, పెట్టుపోఁతలు = కానుకలు, ప్రీతి = సంతోషము, పట్టు = సమయము, పార్థివుడు = రాజు, నీమము = నియమము, నిశ్చింత = నిబ్బరం, పరులు = ఇతరులు, ఉపకృతి = ఉపకారము, పరమ = శ్రేష్ఠమైన, ధర్మము = కర్తవ్యము, నరపాలుడు = రాజు, ప్రథమ = మొదటి, నైర్ధిశికుడు = సేవకుడు, వలయు = ఆవశ్యకమగు, వేనవేలు = అసంఖ్యము, శఠుడు = మోసకాడు, విడుచు = త్యజించు, జ్ఞాని = తెలివి గలవాడు, ఒలయు = ఇష్టపడు, చాలిక = సామర్థ్యము, సహచారుడు = సేవకుడు, పనుచు = నియోగించు, మాలిమి = వాత్సల్యము, కురిపించు = వర్షించు, మనుపు = కాపాడు, వేతనము = జీతము, ఇడు = ఇచ్చు, ఘాతకుడు = బాధించువాఁడు, కదలిక = చలనము, వేగు = గూఢచారి, పనుచు = నియోగించు, వేరు = ప్రత్యేకము, అరయు = విచారించు, ఓగు = కీడు, నీరదము = మబ్బు, మారుతము = గాలి, మది = మనస్సు, భూజము = వృక్షము, నిష్పన్నము = సిద్ధించినది, నృపుడు = రాజు, నడత = ప్రవర్తనము, గురుడు = గురువు, ప్రణమిల్లు = నమస్కారముచేయు, ప్రాపు = రక్షణ, విరుద్ధము = ప్రతికూలము, కామము = ఇచ్ఛ, కర్మచండాలుడు = చండాలకర్మము చేయువాఁడు, కాంక్షించు = కోరు, నవ = నూతనము, వికాసము = ప్రకాశము, వర్ధిల్లు = వృద్ధినందు, వివరణాత్మకము = వ్యాఖ్యానము కలిగియుండెడు, వెరవు = ఉపాయము, కఱపు = బోధించు, ఇల = భూమి, పాటించు = ఆచరించు, లోకపాలుడు = రాజు, మొగి = పూనిక, నిరూపణము = తార్కాణము, నాగరికత = నగరసంస్కృతి, నైకట్యము = సామీప్యము, నౌక = ఓడ, సామాన్య = సాధారణము, దాంపత్యము = భార్యాభర్తృభావము, ఆదర్శము = అనుకరింపదగినది, సొంపు = సంతోషము, కర్తవ్యనిష్ఠ = చేయదగిన దానిలో శ్రద్ధ, వఱలు = వ్యాపించు, వర్తన = నడవడి, బద్ధము = రచింపఁబడినది, ఘనము = గొప్ప, ఆర్తుడు = దుఃఖితుఁడు, అమరించు = ఏర్పఱచు, వేఁబోక = తెల్లవారగ, విపులము = విస్తారమైనది, ప్రొద్దు = దినము, వివరము = విస్పష్టత, యోచించు = ఆలోచించు, సమాప్తి = ముగింపు, వరకు = అంత దనుక, అవగమించు = తెలిసికొను, ఉంచు = నిలువరించు, క్షోభ = అల్లకల్లోలము, చోరుడు = దొంగ, దండన = దండించుట, జడియు = భయపడు, దాంతి = ఓర్పు, వాంఛించి = కోరి, దుండగము = కీడు, జనపదుఁడు = మనుష్యుఁడు, వైధవ్యము = విధవగా నగుట, వనిత = స్త్రీ, అసలు = ఏ మాత్రము, వ్యాధి = రోగము, అపమృత్యువు = అకాలమరణము, వాంఛ = కోరిక, అనర్థము = అపాయము, బాదరబంది = ఇబ్బంది, అసమానము = సాటిలేని, అశ్వమేధము = గుఱ్ఱమును పశువుగా జేసి చక్రవర్తి చేయు

యాగము, వసుధ = భూమి, సమకూర్చు = ఏర్పాటుచేయు, రమణించు = శోభించు, జగతి = లోకము, రీతి = విధము, దిశ = దిక్కు, నిత్య = ఎల్లప్పుడు, పర్వము = పండుగ)

రామరాజ్యం అంటే రామరాజ్యమే. పేరుకు మాత్రమే చెప్పుకోదగినది అంటే అపహాస్యం కాదా. లక్షణాలను సరిపోలిస్తే నిజం తెలుస్తుంది. దీక్షగా వింటే సందేహం తీరుతుంది. అన్నదమ్ములలో ఉన్న అనుబంధానికి రాజకుమారులే గౌరవం తెచ్చారు. అన్ని విధాల కీర్తిని సంపాదించడంలో దశరథ పుత్రులకు పోలిక ఎవరూ లేరు. సామ్రాజ్య కాంక్ష దిక్కు లందు వ్యాపించగా వినయవంతులై సోదరులు "నాకు వద్దు" అనడం భోగాపేక్ష ఉన్న వారు పాలించే ధరణి పైన అరుదు. త్యాగనిరతికి ఉదాహరణము అయ్యింది. కానుకలతో సంతోషంగా ఉగాది సమయాన కోసల రాజును చేయగా, రాముడు రాజై ప్రజలను రక్షించాడు, నియమాలను స్థిరపరచి నిబ్బరం కలిగించాడు. పరోపకారమే ఉత్తమ కర్తవ్య మన్నాడు. రాజు మొదటి సేవకు డన్నాడు. వృత్తివిద్యల అభివృద్ధికి ఆవశ్యకమైన వృత్తులను పోషించు విధానము ముఖ్యమని అన్నాడు. అసంఖ్యాకంగా మోసగాళ్ళను వదిలించుకున్నాడే గానీ, ఒక్క జ్ఞానిని కూడా త్యజించడానికి ఇష్టపడ లేదు. సామర్థ్యమున్న సేవకులను నియోగించి ప్రజలను కాపాడి వాత్సల్యము కురిపించాడు. ఘాతకుల కదలికలు తెలుసుకొనడానికి వాళ్ళకు సమయానికి జీతాలిచ్చాడు. ప్రత్యేకంగా విచారించి అపాయాలు ఉన్నవి ఉన్నట్లుగా తెలియజేయడానికి గూఢచారులను నియోగించాడు. మబ్బుల నుండి వాన నీరు కురిసింది. గాలులు వీచి మనస్సుకు హాయి నిచ్చాయి. ఫలపుష్పాలతో వృక్షాలు ఉన్నాయి. రాజు ప్రవర్తనము వల్ల నీతి సిద్ధించింది. అంటే, రాజు నడవడి నీతికి ఉదాహరణగా నిలిచింది. గురువులకు పెద్దలకు నమస్కారము చేయడం నగర ప్రజలకు రక్షణని ఇవ్వడం తెలిసి చేశాడు. ధర్మానికి ప్రతికూలంగా ఉండే అర్థకామాలను కర్మచండాలురు కోరతారు అని అన్నాడు. నూతన తేజంతో మానవులు వృద్ధి నందడానికి వ్యాఖ్యాన సహితమైన ఉపాయాలను బోధించాడు. ధరణిపై ఏకపత్నీవ్రతమును ఆచరించే రాజు విధానము తార్కాణము నివ్వగా, అది నాగరికతకు సామీప్యము అంటూ సామాన్య ప్రజల జీవన నౌక సాగింది. దాంపత్య బంధము ఆదర్శమైనదంటూ సంతోషంగా సుఖజీవనము సాగించారు. కర్తవ్యనిష్ఠ ప్రపంచంలో వ్యాపించడానికి, నడవడులు స్వధర్మబద్ధంగా సాగడానికి, కర్తవ్యము ఆచరించడాన్ని గొప్పగా మెచ్చుకొని దుఃఖితులే లేకుండా అన్నీ సమకూర్చాడు. తెల్లవారగానే మేల్కొని విపులంగా తాను రాబోయే రోజుకు సంబంధించిన కార్యక్రమాల వివరాలు ఆలోచించి పనుల ముగింపు

అయ్యేవరకు అవి ప్రజలకు తెలియకుండా ఉంచాడు. క్రూరమృగాల చేత అల్లకల్లోలము లేదు. దొంగలు ఉన్నటువంటి చోటు ఎక్కడా లేదు. దండనకు భయపడి సహనం కోరి మనుష్యులు కీడు చేయ లేదు. స్త్రీలలో వైధవ్య దుఃఖము లేదు. రోగాల వలన బాధ ఏ మాత్రం లేదు. అకాల మరణం అనేది అక్కడ వినము. ప్రజలకు మేలు చెయ్యాలనే కోరికే ఉంది. ఎలాంటి అపాయాలు, ఎలాంటి బాధలు, ఎలాంటి ఇబ్బందులు ప్రజలు ఎరుగరు. సాటిలేని విధంగా అశ్వమేధ యాగాన్ని చేసి భూమి అంతటా ఏకత్వ భావాన్ని వ్యాపింప జేశాడు. అన్ని విధాల కీర్తిని సమకూర్చగా లోకమే రామరాజ్యంగా శోభిల్లింది. ఈ విధంగా నేల నలు దిక్కులా ప్రతిరోజు పండుగ లాగ పదివేల సంవత్సరాలు పాలించాడు.

22. వివాహము

1. కం. మనువు విశేష సమర్పణె,
    మన సంస్కృతి కదియె యూత, మమతకు నెలవై,
    మనుపు, గృహస్థాశ్రమ లాం
    ఛనమగు, కలిమియును, సప్త సంతానములన్.

(మనువు = వివాహము; విశేష = సంపూర్ణమైనది; సమర్పణ = సమర్పించుట, ఇచ్చుట; సంస్కృతి = నాగరికత; ఊత = ఆధారము; మమత = మమత్వము, అభిమానము, 'నాది' అను భావము; నెలవు = వాసస్థానము, ఉనికిపట్టు; మనుపు = పోషించు, బ్రతికించు; గృహస్థాశ్రమము = నాలుగు ఆశ్రమాలలో ఒకటి. ఆ నాలుగు, 1. బ్రహ్మచర్యము, 2. గార్హస్థ్యము, 3. వానప్రస్థము, 4. సన్యాసము, గార్హస్థ్యము అంటే గృహస్థాశ్రమము; లాంఛనము = చిహ్నము, గుర్తు; కలిమి = సంపద; సప్త సంతానములు = 1. కూపము, 2. తటాకము, 3. ఉద్యానము, 4. మండపము, 5. జలశాల, 6. సద్ధర్మాచరణము, 7. పుత్రుడు అనీ, 1. తటాకప్రతిష్ఠ, 2. ధననిక్షేపము, 3. అగ్రహారప్రతిష్ఠ, 4. దేవాలయప్రతిష్ఠ, 5. వనప్రతిష్ఠ, 6. ప్రబంధ నిర్మాణము, 7. సత్రప్రతిష్ఠ అనీ రెండు విధాలుగా విన్నాను.)

మనువు అంటే వివాహము అని అర్థము. వివాహము అంటే విశేష ప్రాపణం లేక విశేషమైన లేదా ప్రత్యేకమైన సమర్పణ అని అర్థం, అని ఎక్కడో చదివాను. అంటే, ఒక యువతి ఒక యువకుడు ఒకరికొకరి విశేషంగా సమర్పించుకోవడం. అంటే, స్వార్థం వదలి ఒకరు రెండవ వారికి జీవితం అంకితం చేయడం. అదే మన నాగరికతకు ఆధారము. సమాజంలో బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలకు ఆధారమైన గృహస్థాశ్రమం ఎంతో విశేషమైంది. అంటే కుటుంబంలో తల్లి నాశ్రయించి పిల్లలు జీవిస్తున్నట్లే సమాజంలోని అన్ని వర్గాల వారూ, గృహస్థుల నాశ్రయించే బతుకుతున్నారు అని అంటోంది మన సనాతన ధర్మం. అంటే గృహస్థాశ్రమం ఈ సమాజానికి తల్లి వంటిదన్న మాట. అది వివాహం ద్వారానే సాధ్యము.

మనుషుల్లో మమత్వానికి, 'నాది' అన్న భావాన్ని కలిగించడానికి వివాహమే నెలవు, ఆధారపీఠము. వివాహమనే వ్యవస్థ లేకపోతే 'నాది' అనుకోవడానికి బహుశా ఏమీ మిగలదేమో. అలా, మమతకు ఆధారభూతమైన వివాహము, గృహస్థాశ్రమానికి చిహ్నమైన సంపద, సప్తసంతానాల్ని పెంచి పోషిస్తుంది.

'Marriage is for procreation of children' అని అంటారు. ఇక్కడ children అంటే biological children మాత్రమే కాదు. సప్త సంతానాలు ఆ పదంలోకి వస్తాయి. Biological children లేకపోతే సంతానం లేనట్లు కాదు. మిగిలిన ఆరు రకాల సంతానాలు ఉండవచ్చు.

ఒక మనిషి పోయిన తర్వాత కూడా లోకంలో గుర్తుంచుకోబడేది సప్త సంతానాల ద్వారానే. సప్త సంతానాల పట్టికలో తేడాలు ఉండొచ్చుగానీ వాటి వెనకాల ఉన్న ప్రయోజనం ఇదే. ఫలానా వారు తవ్వించిన నుయ్యి లేక చెరువు, ఫలానా వారు కట్టించిన దేవాలయము, ఫలానా వారు వ్రాసిన కావ్యము, నవల, గ్రంథము, ఫలానా వారి అబ్బాయి లేక అమ్మాయి, ఇలా వాళ్ళ గురించి వాళ్ళ జీవిత కాలంలోనే కాక వాళ్ళు మరణించిన తర్వాత కూడా చెప్పుకుంటారు. ఇదే ఉద్దేశ్యంతో, కృష్ణదేవరాయలు తన అష్టదిగ్గజాలలో ఒకరైన పెద్దన మహాకవిని సప్త సంతానములలో ఖిలము గాకుండునది, అంటే పాడవనిది కాబట్టి, కృతి రచించమని అడిగినట్లుగా ఈ క్రింది పద్యం చెబుతోంది.

తే.గీ. సప్త సంతానములలో ప్రశస్తి గాంచి
ఖిలము గాకుండునది ధాత్రి "కృతియ" గాన
కృతి రచింపుము మాకు, శిరీష కుసుమ
పేశల సుధామ యోక్తుల, పెద్దనార్య.

అయితే, వివాహం లేకపోతే సప్త సంతానాలకి తావు లేదా అంటే దాదాపు లేనట్లే అని నా అభిప్రాయము. ఈ సూత్రానికి మినహాయింపులు ఆదిశంకరాచార్యుల వారు, స్వామి వివేకానంద, మదర్ థెరిసా లాంటి మహానుభావులు, మహామహితాత్ములు. వారికి సంతానం లేదంటే దానికి అర్థం ఉండదు. వారిని ఇప్పటికీ ఈ లోకంలో తలుచుకుంటున్నామంటే, తలుచుకునే వాళ్ళందరూ వాళ్ళ సంతానమే.

2. కం. ఎన్నో వివాహ వేడ్కలు
కన్నుల విందగును< గాని కౌతుక మిచ్చున్,
కన్నార్పక వధువు వరుడు
కన్నులు< గలుపుట ముహూర్త కాలము నందున్.

(వేడ్క = వేడుక, వినోదము; కౌతుకము = కుతూహలము)

వివాహాలలో వేడుకలు ఎన్నో కన్నుల విందు చేసేవి ఉన్నా, కుతూహలాన్ని కలిగించేది మాత్రం, ముహూర్త సమయంలో వధూవరులు కళ్ళార్పకుండా ఒకరి కళ్ళలోకి మరొకరు చూడడం.

3. కం. చెప్పకనే తమ చూపులు
రెప్పలు మూయక< గలుపుట రెప్పము కాగా,
కుప్పల ప్రాలను తలలం
గప్పు వధూవరుల కేళి< గాంచుదు రచటన్.

(రెప్పము = సంపూర్ణము, కుప్ప = రాశి, ప్రాలు = తలంబ్రాలు, కప్పు = ఆచ్ఛాదించు, కేళి = ఆట, కాంచు = చూచు)

చెప్పక్కర్లేకుండానే రెప్పలు మూయకుండా తమ చూపులు కలపడం సంపూర్ణము కాగా, కుప్పలుగా తలంబ్రాలతో శిరస్సులు కప్పుకునే వధూవరుల ఆట పెండ్లిలో చూస్తారు.

4. సీ. వరుని కళ్ళ మెరుపు వధువుకు వర మంట
కను రెప్ప లార్పగ కళ్ళెమంట
వధువు కనుల కాంతి వరునికి పొడగాంచ
వేది కయ్యె వివాహ వేళ యందు
ఎందరో తము< జూడ నేమఱ కుండక

గ్రోలు కనుల లేదు గొళ్ళె మంట
కనులు కనులఁ జేర్చు కచ్చిత సమయంబె
ముచ్చటగ వివాహ మూరుతంబు,

తే. గీ. యవ్విధముగ వధూవరు లన్ను కొనుచు
మనమున నిలుపు కొను కాంతిమధువు, కష్ట
సుఖము లందు స్మరణ కొచ్చి, సుస్థిరమగు
ధైర్య మిచ్చును, జీవితాంత ముభయులకు.

(మెరుపు = ప్రకాశము, వరమంట = ప్రియమైనదట, కళ్ళెము = లగాము, పొడగాంచ = చూడ, ఏమరక = జాగ్రత్తగా, గ్రోలు = త్రాగు, కచ్చిత = ఎచ్చుతక్కువలు లేక సరిగానున్న, మూరుతము = పండ్రెండుక్షణముల కాలమున్న ముహూర్తము, అవ్విధముగ = ఆ ప్రకారంగా, అన్ను కొను = పరవశమగు, మధువు = తేనె, స్మరణ = జ్ఞప్తి, సుస్థిరము = గట్టిగా నిలుచునది)

వివాహంలో ముహూర్త సమయంలో వధూవరులని ఒకరి తలమీద మరొకరిని జీలకర్ర బెల్లం పెట్టమంటారు. అంత కన్నా ముఖ్యంగా, ఆ ముహూర్తం ఉన్నంతసేపు ఒకరి కళ్ళలోకి మరొకరిని చూస్తూ ఉండమని చెబుతారు. దాని ఉద్దేశ్యము ఏమిటంటే, ఇరువురికీ ఆ సమయంలో కనిపించిన ఎదుటివారి కంట్లోని వెలుగు, జీవితాంతం గుర్తుండి మాటిమాటికి రెండవ వారిపట్ల తమ ధర్మాన్ని గుర్తు చేయాలని. ఆ విధంగా, ఆ వెలుగు ఇద్దరికీ జీవితాంతం మార్గదర్శకంగా ఉంటుందని ఆకాంక్ష. ముఖ్యంగా, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవడానికి కావలసిన శక్తిని ఆ కంటి వెలుగు ఇస్తుంది.

శాంతారాంగారు తీసిన 'దో ఆంఖే బారహ్ హాత్' (రెండు కళ్ళు పన్నెండు చేతులు) అన్న సినిమాలో ఈ భావన ఇంకో రకంగా ప్రయోగించారని నా అభిప్రాయం. ఒక జైలరు (Jailor), పెరోల్ (parole) మీద విడుదలైన ఆరుగురు ప్రమాదకరమైన నేరస్థులను మంచి మార్గంలో ఎలా పెట్టారో ఈ సినిమాలో చూపించారు. బతిమాలీ, బామాలీ కాదు, తన్నీ, కొట్టీ కాదు, కేవలం కంటి చూపుకున్న శక్తితోనే అది సాధించారు. ఆ నేరస్థులు కొంత కాలం ఆ జైలరు

చెప్పినట్లుగా ఒక కమతంలో కష్టపడి పంటలు పండించి, మధ్యలో బుద్ధి దాటేస్తే, 'వెనుకటి గుణమేల మాను కదరా సుమతీ' అన్నట్లుగా, తమ పాత బాట లోకి పోవాలనుకున్న సందర్భంలో, ఆ జైలరు గారి కంటి వెలుగుకున్న శక్తి వాళ్ళని ముందుకు వెళ్ళనీకుండా చేస్తుంది.

పై రెండు సందర్భాలలో భావన (concept) ఒకటే. ఇక పద్యంలోకి వస్తే, పెళ్ళికొడుకు కళ్ళలో ప్రకాశము పెళ్ళికూతురికి ఒక వరము. అది కనురెప్పలు ఆర్పకుండా చేసే కళ్ళెం. పెళ్ళికూతురు కళ్ళలో వెలుగు పెళ్ళికొడుకు చూడడానికి వేదిక అయ్యింది. వివాహ సమయంలో ఎందరో తమను చూస్తున్నా జాగ్రత్తగా ఉండాలనే ధ్యాస లేకుండా తాగే కళ్ళకి గొళ్ళెం లేదంట. అలాగ, కళ్ళని కళ్ళతో కలిపే కచ్చిత సమయమే వివాహ ముహూర్తము. ఆ విధంగా వధూవరులు మైమరచి మనస్సులో నిలుపుకున్న, ఆ కాంతి మధువు, కష్టసుఖాలలో జ్ఞాపకం వచ్చి జీవితాంతము ఉభయులకీ నిలకడైన ధైర్యాన్ని ఇస్తుంది.

5. కం. ఒడుదుడుకు వేళ లందున
జడమతులను హెచ్చరింప జ్ఞప్తికి వచ్చున్,
వొడగన్న కనుల కాంతియె
వడిగా సరి త్రోవఁ జూపి, వగలను డుల్చున్.

(ఒడుదుడుకు = సంకటము, కష్టస్థితి; జడమతి = జడుడు, మందబుద్ధి గలవాడు; హెచ్చరించు = జాగ్రత చెప్పు; జ్ఞప్తి = జ్ఞాపకము; వొడగన్న = చూచిన; వడిగా = వేగంగా; వగ = సంతాపము, దుఃఖము; డుల్చు = వేఱుచేయు, దూరము చేయు)

కష్టకాలంలో జడత్వంతో తిరిగే వారికి ఆ సమయంలో (వివాహ సమయంలో) చూసిన కళ్ళ లోని కాంతి జాగ్రత చెప్పడానికి జ్ఞాపకము వస్తుంది. వేగంగా, సరియైన దోవను చూపి, బాధలను తొలగిస్తుంది.

23. శ్రేష్ఠుల నడవడి

రెండు సంస్కృత శ్లోకాల ఆధారంగా శ్రేష్ఠుల నడవడిని గురించి నేను వ్రాసిన పద్యాలు ఈ శీర్షిక క్రింద ఇవ్వబడ్డాయి. వాటిల్లో మొదటిది, క్రింద ఇవ్వబడిన శ్రీమద్భగవద్గీత మూడవ అధ్యాయంలో వున్న 21వ శ్లోకం.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే

(యద్యత్ (యత్ యత్) = ఏదైతే, ఆచరతి = చేస్తారో, శ్రేష్ఠః = శ్రేష్ఠులు (ఉత్తములు), తత్తత్ (తత్ తత్) = అది మాత్రమే, ఏవ = తప్పకుండా, ఇతరః = ఇతరులైన (సామాన్యులు), జనః = జనులు, సః = వారు, యత్ = దేనినైతే, ప్రమాణం = ప్రమాణముగా, కురుతే = చేయునో, లోకః = ప్రపంచము, తత్ = దానిని, అనువర్తతే = అనుసరించును.)

"శ్రేష్ఠులు (ఉత్తములు) చేసే పనులను సామాన్య జనులు అనుకరిస్తారు. వారు నెలకొల్పిన ప్రమాణాన్నే, ప్రపంచమంతా అనుసరిస్తారు." అని పై శ్లోకానికి అర్థము. నిజ జీవితంలో ఈ సూత్రం ప్రభావం చాలా ఎక్కువ. జీవితంలోను, సంఘంలోను ఉన్నతమైన స్థానంలో ఉన్న వాళ్ళు (శ్రేష్ఠులు) ఏవిధంగా నడుచుకుంటారో, మిగిలిన వాళ్ళు దాన్ని ఒక ప్రమాణంగా స్వీకరించి అలాగే నడుచుకుంటారు. మనకి తెలియకుండా మనని చాలా కళ్ళు నిశితంగా పరిశీలిస్తూ ఉంటాయి. అది పోలీసింగ్ (policing) కాదు. ఆ పరిశీలన, ఆ చూడటం ఏదో ఆశించడం (expectation) లాంటిది. ఆ ఉద్దేశ్యముతోనే ఒక కుటుంబంలో పిల్లలు పెద్దవాళ్ళని చూసి అన్నీ నేర్చుకుంటారు. విద్యార్థులు ఉపాధ్యాయులను చూసి, సామాన్యులు ఒక నాయకుని చూసి నేర్చుకుంటారు. అలా అనుసరించడంలో ఒక నమ్మకం చోటుచేసుకుని ఉంది. పెద్దవాళ్ళు కాని, ఉపాధ్యాయులు కాని, నాయకులు కాని ఏమి చేసినా అది సరియైనదే అయ్యుంటుందనే నమ్మకం.

సామాన్యులు పెంచుకునే ఈ నమ్మకం, శ్రేష్ఠులు అని అనిపించుకునే వాళ్ళకి, అలాంటి పొజిషనులో (position) ఉన్న వాళ్ళకి ఒక హెచ్చరిక. అంటే, వాళ్ళు ఒళ్ళు దగ్గరపెట్టుకుని

ఉండాలి. వాళ్ళ ప్రవర్తన మామూలు ప్రజానీకం మీద లేదా వాళ్ళని అనుసరించే వాళ్ళ మీదా ఎలాంటి ప్రభావము చూపుతుందో గుర్తెరిగి నడుచుకోవాలి. పిల్లలు చెడిపోవడానికి పెద్దవాళ్ళు లేదా ఆ పిల్లలు ఎవరిని అనుసరిస్తే వాళ్ళు కారణమని వేరే చెప్పనక్కరలేదు.

ఈ సూత్రాన్ని ఒక్కొక్కప్పుడు మంచిని, ఒక్కొక్కప్పుడు చెడుని, సమర్థించడానికి వాడటం మనము చూస్తూ ఉంటాము. ఏదైనా వ్యవహారంలో, పెద్దవాళ్ళు ఎవరికన్నా అన్యాయం చేస్తున్నట్లుగానో లేదా విషయం అర్థము కానట్లుగానో మాట్లాడుతున్నట్లనిపిస్తే చిన్నవాళ్ళు కలుగజేసుకుందామని చూస్తారు. అప్పుడు, వాళ్ళని వారించడానికి ఉపయోగబడే సూత్రం ఇదే. అందాకా ఎందుకు, కౌరవ సభలో ద్రౌపది 'నేను ధర్మ విజితనా, అధర్మ విజితనా' అని అందరినీ నిలదీస్తే, అప్పుడు దుర్యోధనుని తమ్ములలో ఒకరైన వికర్ణుడు లేచి తన వాదన ద్రౌపదికి అనుకూలంగా వినిపించాలని చూస్తే, అతడిని వారించడానికి చెప్పిన మాట ఏమిటంటే, పెద్దలు భీష్మాదులు మిన్నకున్నారు, వాళ్ళని అనుసరించమని. నన్ను ఇంత బాగా ఆకట్టుకున్న పై శ్లోకం ఆధారంగా క్రింద ఇచ్చిన రెండు పద్యాలు వ్రాశాను.

1. కం. శిష్టాచారము నితరులు
యిష్టముగా యనుకరింతు రిది సహజమ్మౌ,
శిష్టుల ప్రమాణ మందరు
యిష్టముగా యనుసరింతు రిదియును నిజమే.

(శిష్టాచారము = తెలిసిన పెద్దలనడవడి, సాధువ్యవహారము; అనుకరించు = ఒకరు చేయునట్లు చేయు, శిష్టుల = ఉత్తముల, శ్రేష్ఠుల; ప్రమాణము = మేర, శాస్త్రము, కొలమానిక; అనుసరించు = ఒక పద్ధతిని పాటించు)

తెలిసిన పెద్దలు వివిధ సందర్భాలలో ఎలా నడుచుకుంటారో ఇతరులు అది ఇష్టంగా అనుకరిస్తారు. అంటే, ఇమిటేట్ (imitate) చెయ్యడం. పెద్దలు ఏదైనా ఒక నియమము లేక ఒక హద్దు నిర్ణయిస్తే, ఇతరులు ఇష్టంగా ఆ పద్ధతిని పాటిస్తారు.

2. కం. పెద్దల కున్న విచక్షణ
పద్ధతి గల నడవడియును పలువురు నేర్వన్,
పెద్ద లుపేక్ష వహించిన
పద్ధతులే సమసి పోయి పాపము పెరుగున్.

(విచక్షణ = యుక్తాయుక్త జ్ఞానము; నడవడి = నడత, చరిత్రము, ప్రవర్తనము; ఉపేక్ష = అశ్రద్ధ, ఉదాసీనత; సమసిపోవు = నశించు)

పెద్దలకి ఉన్న మంచి చెడుల గురించిన జ్ఞానము, వాళ్ళ నియమబద్ధమైన ప్రవర్తన చాలా మంది నేర్చుకోగా, పెద్దలు గనక అశ్రద్ధ చేస్తే, పద్ధతులన్నీ పోయి పాపం పెరుగుతుంది.

నన్ను ఆకట్టుకున్న ఇంకో శ్లోకం క్రింద ఇవ్వబడిన వాల్మీకి రామాయణం అరణ్యకాండలో 37వ సర్గములో ఉన్న శ్లోకం.

సులభాః పురుషా రాజన్
సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య
వక్తా శ్రోతా చ దుర్లభః

ఇవి మారీచుడు రావణాసురుడితో చెప్పిన మాటలు. ఈ మాటలు రామాయణంలో ఆ సందర్భానికే కాక, సర్వసాధారణంగా కూడా వర్తిస్తాయి. మారీచుడు ఏమన్నాడంటే: "ఓ రాజా! మనకి ఎప్పుడూ నచ్చేటట్లుగా మాట్లాడేవాళ్ళు సులభంగా దొరుకుతారు. కానీ, మనకి అప్రియమైనా హితవు చెప్పేవాళ్ళు అరుదు. అలా చెప్పే వాళ్ళున్నా వినేవాళ్ళు కూడా అరుదు." అంటే, ఎప్పుడూ యిచ్చకాలు చెప్పే వాళ్ళు అంతటా కనిపిస్తారు గానీ, మనకి యిష్టము కానిదైనా, హితమైన దానిని చెప్పువాళ్ళు లభించుట దుర్లభము. అప్రియమైనను పథ్యమైన (హితమైన) మాట చెప్పువారూ, వినేవారూ కూడా అరుదే.

సరిగ్గా ఇలాంటి శ్లోకమే వ్యాస భారతంలో సభాపర్వంలో విదురుడు ద్యూతగృహంలో దుర్యోధనునికి సద్బోధ చేసే సందర్భంలో చెప్పబడింది.

లభ్యతే ఖలు పాపీయాన్ నరో సుప్రియ వాగిహా
అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః

తియ్యని మాటలు చెప్పి మోసం చేసే పాపాత్ములు ఈ లోకం అంతటా ఉన్నారు. కాని కటువైనా కూడా పథ్యము మాదిరిగా ఉండే మాటలు చెప్పేవాళ్ళు, అట్లా చెబితే వినే వాళ్ళు కూడా లోకంలో అరుదుగానే ఉంటారు.

ప్రియవాదినః అన్నదానికి తియ్యని మాటలు చెప్పి మోసం చెయ్యడానికి చక్కని ఉదాహరణ గురజాడవారి కన్యాశుల్కంలో చూడచ్చు. రామప్పపంతులుకీ కొండిభొట్లుకీ జరిగిన ఈ క్రింది సంభాషణ చూడండి.

రామప్ప పంతులు: మధురవాణి పాడింది కాదేం?
కొండిభొట్లు: పాడింది.
రామప్ప పంతులు:ఆ!
కొండిభొట్లు: కాదండి.

రామప్పపంతులుకి ఏమి చెబితే నచ్చుతుందన్న ఆరాటమే కానీ, నిజమే చెప్పాలన్న ఎజండా (agenda) గానీ ఉద్దేశ్యము గానీ కొండిభొట్లుకి లేదు. 'మధురవాణి పాడింది' అంటే రామప్పపంతులుకి నచ్చుతుందనుకుని మొదట 'పాడింది' అని చెబుతాడు. అతను, 'ఆ!' అని కళ్ళెర్రజేయగానే, అతని కది నచ్చలేదనుకుని 'కాదండి' అని ఇంకో పదం చేరుస్తాడు. అంటే, 'పాడింది కాదండి' అని చెప్పినట్లన్న మాట.

అంటే, ఎదుటి వాళ్ళతో పని ఉంటే, వాళ్ళకి నచ్చేటట్లుగా ఉండి పబ్బము గడుపుకోవడం చేసేవాళ్ళని మనం చూస్తూనే ఉంటాం. యజమాని దగ్గర సేవకులు, తల్లిదండ్రుల దగ్గర పిల్లలు అప్పుడప్పుడూ ఇలా ప్రవర్తించి ఉండొచ్చు. ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూల కెళ్ళే యువతీ

యువకులు ఇంటర్వ్యూలో వివాదాస్పద విషయాల గురించి అడిగితే ఏమి చెబితే దాని పర్యవసానం ఎలా ఉంటుందో అని ఒత్తిడికి లోనవుతారు. చివరికి, ఆ ఇంటర్వ్యూ చేసేవాళ్ళకి ఏమి నచ్చుతుందనుకుంటారో అదే చెబుతారు. మారీచుడు, పాపం రావణుడికి హితమే చెప్పాడు. కానీ, అతను వినకపోగా తనని బెదిరించడం వల్ల అతను చెప్పినట్లు మాయలేడి వేషం వేశాడు. ఆ విధంగా కథ ముందుకు సాగింది.

సూటిగా, కుండ బద్దలు కొట్టినట్లుగా, ఉన్నదున్నట్లుగా, నిజం నిర్భయంగా మాట్లాడే వాళ్ళకి మంచి ఉదాహరణ, భారతంలో విదురుడి ప్రవర్తన. ధృతరాష్ట్రుడికి దుర్యోధనుడికి ఎన్నో సందర్భాలలో వాళ్ళకి హితమయే మాటలే చెబుతాడు, విదురుడు, వాళ్ళు ఎంత విసుక్కున్నా కూడా. వాళ్ళకి నచ్చే మాట, వాళ్ళకి మేలు చేసేది కాకపోతే, చెప్పడు.

పై శ్లోకానికి సమానార్థకముగా క్రింది పద్యం వ్రాశాను.

3. కం. మెరమెచ్చులాడి సులువుగఁ
బెఱవారిని మభ్యపెట్టఁ బెక్కురు వెలయన్,
పరహిత మప్రియమైనను,
వెరవని వదు లరుదుఁ, జెప్ప విను వారు నటే.

(మెరమెచ్చులాడు = ముఖప్రీతి కొరకు మెచ్చుకొను; సులువుగ = సులభంగా, పెఱవాడు = ఇతరుడు, మభ్యపెట్టు = తప్పుడు అవగాహన కలిగించటం ద్వారా ఇతరులను మోసగించు, పెక్కురు = అనేకులు, వెలయు = కనిపించు, పర = ఇతరుల; హితము = మేలు, అప్రియము = ఇష్టము కానిది, వెరచు = భయపడు; వదుడు = మాటలాడువాడు, అరుదు = దుర్లభం, అటు = ఆప్రకారము)

ముఖప్రీతి మాటలు మాట్లాడి తేలికగా ఇతరులని మభ్యపెట్టడానికి చాలామంది ఉండగా, ఇష్టం కాని విషయము అయినా కూడా ఇతరులకి మేలు చేసేది అయితే భయపడకుండా చెప్పే వాళ్ళు అరుదు. చెప్పినా వినేవాళ్ళు కూడా ఆప్రకారమే.

24. స్త్రీలు

మంచి చెడులకు పురుషు లెంతో స్త్రీలు కూడా అంతే బాధ్యులని చెబుతూనే, స్త్రీలని గౌరవించాల్సిన అవసరాన్ని వాళ్ళలో లోపాలు వెతకడం మానుకోవాలని చెప్పడానికి వ్రాసిన పద్యాలు క్రింద ఇవ్వబడ్డాయి.

1. కం. మహిళా దినోత్సవం బన
   సహనము సౌశీల్యములకు సంఘపు ప్రణతుల్
   మహిళల పాత్రయె ప్రగతికి
   విహితముగా నున్న యట్టి విషయముఁ దెలుపున్.

(సహనము = ఓర్పు, సౌశీల్యము = మంచి ప్రవర్తన, ప్రణతులు = నమస్కారములు, ప్రగతి = అభివృద్ధి, విహితము = విధింపబడినది)

మహిళా దినోత్సవము అంటే, ఓర్పుకి, మంచి నడవడికి సమాజం చేసే ప్రణామాలు. అంటే, వాటికి మారుపేరైన మహిళలకి నమస్కారాలు. అభివృద్ధిలో మహిళలు పోషించవలసిన పాత్రను గురించి కూడా అది తెలుపుతుంది.

2. తే. గీ. పురుషు లందరు వొట్టి కాపురుషు లనుట,
   యెంత సులభమో యిప్పటి యింతులకును,
   యందు స్త్రీ పాత్ర లేదని యనగఁ గలదె?
   యెంత యన్యాయ మొక వైపె యెంచిఁ జూడ.

(కాపురుషుడు = దుష్ట ప్రవర్తన గల పురుషుడు, ఇంతి = స్త్రీ, ఎంచు = పరిశీలించు)

పురుషులు అందరూ చెడ్డ ప్రవర్తన గల వారు అని అనడం ఈనాటి స్త్రీలకి ఎంత తేలికో. అందులో, స్త్రీల పాత్ర లేదని అనడానికి ఉందా? ఒక వేపు మాత్రమే పరిశీలించి చూడడం ఎంత అన్యాయమో.

3. కం. స్త్రీలను భోగాస్పదులని
ప్రేలుట, మనుటన్న భీతి పెంచుట, యెందుస్
స్త్రీలకు విలువివ్వక, కల
కాలము లోపమె వెదకుట, గర్హింప వలెన్.

(భోగాస్పదులు = సుఖమునకు స్థానమైన వారు, ప్రేలు = ఎడాపెడా వాగు, మనుట = బ్రతుకుట, గర్హించు = ఏవగించు)

స్త్రీలు కేవలము భోగం కోసమే ఉన్నారని ఇష్టమొచ్చినట్లుగా వాగడం, వాళ్ళకి బ్రతుకు మీద భయం పెంచడం, ఎక్కడా కూడా వాళ్ళకి విలువ ఇవ్వకపోవడం, ఎప్పుడూ వాళ్ళ లోపమే వెదకడం, అసహ్యించుకోవాల్సి ఉంటుంది.

25. స్నేహము

స్నేహం నిజజీవితంలో ఎంత అవసరమో, నిజమైన స్నేహితు లెవరో చెప్పడానికి వ్రాసిన పద్యాలు క్రింద ఇవ్వబడ్డాయి.

1. కం. స్నేహ మొక గొప్ప వర మగు,
స్నేహము లేకున్న మనిషి నిర్ఘృణుఁడె యగున్,
స్నేహమె మధురానుభవము,
స్నేహముఁ జేయంగ మనకు నిర్వృతిఁ గలుగున్.

(వరము = దేవతానుగ్రహము, నిర్ఘృణుఁడు = నిర్దయుడు, మధుర = తియ్యనిది, అనుభవము = ప్రత్యక్షజ్ఞానము, నిర్వృతి = సుఖము; ఊఱట)

స్నేహమనేది గొప్ప భగవదనుగ్రహము. అది లేకపోతే, మనిషి నిర్దయుడు అయిపోవును. స్నేహము ఒక తియ్యని అనుభూతి. స్నేహము చేయడం వల్ల మనకి సుఖము, ఊఱట కలుగుతాయి.

2. కం. స్నేహం బహమునుఁ జంపును
మోహంబుల చెదర గొట్టు మొగ్గను, యాశా
సాహసము లందు నిస్పృహ
లో హద్దుఁ గఱపి మనుజుల లొసుగులు దిద్దున్.

(అహము = అహంకారము, మోహము = చిత్తవైకల్యము, చెదర గొట్టు = చెల్లాచెదరుసేయు, ఆశ = అపేక్ష, సాహసము = శక్తికి మించిన పనిలో దిగుట, నిస్పృహ = నైరాశ్యము, హద్దు = పరిమితి, కఱపి = బోధించి, లొసుగు = లోపము, దిద్దు = సవరించు)

స్నేహం అహంకారాన్ని నాశనం చేస్తుంది. చిత్తచాంచల్యాన్ని మొగ్గలోనే చెల్లాచెదరు చేసేస్తుంది. కోరికలున్నపుడు, శక్తికి మించిన పనుల లోకి దిగినపుడు, నిరాశలోను, పరిమితి నేర్పి మనుషుల లోపాలు దిద్దుతుంది.

3. కం. దైవ మిడిన సఖు డెవ్వరు?
జీవితమున భర్తఁ దక్క చింతనఁ జేయస్
దైవ మిడిన సఖి యెవ్వరు?
పావనియై మనసెరిగిన భార్యయెఁ గాదా.

(ఇడు = ఇచ్చు, సఖుఁడు = స్నేహితుఁడు, తక్క = తప్ప, చింతన = పలుమాఱు తలఁచుట, సఖి = స్నేహితురాలు, పావని = పవిత్రురాలు, ఎరుగు = తెలిసికొను)

మహాభారతంలో అరణ్య పర్వంలో 'కింస్విద్దైవకృతః సఖా' అని యక్షుడు అడిగిన ప్రశ్నకి ధర్మరాజు చెప్పిన సమాధానం 'భార్యా దైవ కృతస్సఖా' అని. అదే, ఈ పద్యానికి ఆధారం. 'దేవుడిచ్చిన స్నేహితుడెవరు?' అని పలుమారు ఆలోచిస్తే 'జీవితంలో భర్త తప్ప ఎవరు' అన్నదే సమాధానం. అలాగే, 'దేవుడిచ్చిన స్నేహితురాలు ఎవరు?' అంటే, 'పతివ్రతయైన మనసెరిగిన భార్యే కదా' అన్నది సమాధానం.

26. స్వగతము

స్వగతము (soliloquy) అంటే సాధారణంగా నాటకాలలో ఒక పాత్ర ఒంటరిగా ఉన్నప్పుడు ప్రేక్షకులకు తెలియజెయ్యాలనే ఉద్దేశ్యంతో తన ఆలోచనలను తనకే చెప్పుకోవడం. నేనొక్కడినే ఉన్నప్పుడు వివిధ సందర్భాలలో నాకు కలిగిన భావనల ననుసరించి వ్రాసిన పద్యాలు ఈ శీర్షికలో పొందుపరుస్తున్నాను.

1. కం. పూవుల బాటగ నుండదు
దోవను ముళ్ళెన్నొ యుండుఁ, ద్రోవరి నాపన్,
జీవిత చక్రము వక్రమె,
యీ విషయముఁ దెలుసుకొంటి నిడుములఁ బాయన్.

(త్రోవరి = బాటసారి; ఇడుము = ఆపద; పాయు = తొలగు, విడుచు)

జీవితచక్రము వంకరగానే ఉంటుంది. పూలబాటగా ఉండదు. బాటసారికి ఆటంకంగా తోవలో ముళ్ళెన్నో ఉంటాయి. ఇబ్బందులని అధిగమించడానికి ఈ విషయము తెలుసుకున్నాను.

2. కం. మార్గం బున్నను దొడ్డగ
స్వర్గముగా పరిణమించు సత్ఫలములతో,
మార్గం బున్నను చెడ్డగ
స్వర్గములను కూలదోయు సంకట పరుపన్.

(దొడ్డ = మంచిది, పరిణమించు = మార్పునొందు, కూలదోయు = పడగొట్టు, సంకటపరుచు = పీడించు)

మనము నడిచే తోవ, అంటే మన ప్రవర్తన, మంచిదైతే, మంచి ఫలితాలతో సుఖం కలుగుతుంది. మన ప్రవర్తన చెడ్డదైతే, మనని పీడించడానికి కష్టాలు వస్తాయి. అందుకని,

అనుసరించే మార్గము చాలా ముఖ్యము. Means justify the ends. చెడ్డ మార్గాలు, short-cuts అవలంభించకూడదు.

3. కం. మితి మీరి యేమిఁ జేసిన
మతిమాలిన చేష్ట యగును మంచికి నైనన్,
బ్రతు కన్న మితుల హారమె,
యతి వర్జించిన బ్రతుకున కనపాయెమెగా.

(మితి = హద్దు; మతిమాలు = భ్రంశమగు; చేష్ట = క్రియ, పని; అతి = అధిక్యమును, అతిక్రిమించుటను తెలుపును; వర్జించు = విడుచు; అనపాయము = అపాయములేనిది)

మంచికైనా, హద్దు మీరి ప్రవర్తిస్తే మతిమాలిన చేష్ట అవుతుంది. జీవితమంటే హద్దుల హారమే. అంటే, అడుగడుగునా, ఏవో ఆటంకాలు వస్తూనే ఉంటాయి. అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు. అతిని వీడితే, జీవితంలో అపాయాలు ఉండవుగా.

4. కం. దొడ్డ పనుల కడ్డంకులు
యడ్డుఁ దొలగు దొడ్డ దారి నడుగులు వేయన్,
దొడ్డవి కానేర వెదో
గడ్డి కఱచి దొడ్డిదారి గమ్యముఁ జేరన్.

(గడ్డికఱచి = తప్పుడు పని చేసి, దొడ్డిదారి = న్యాయసమ్మతం కాని అక్రమ మార్గం, గమ్యము = పొందదగినది)

మంచి దారిలో అడుగులు వేస్తే, అంటే, మంచి ప్రవర్తన ఉంటే, మంచి పనులకి అడ్డంకులు తొలగి పోతాయి. ఏదో తప్పుడు పని చేసి, న్యాయసమ్మతం కాని అక్రమ మార్గం ద్వారా ఏదైనా పొందడానికి చూస్తే ఆ పనులు మంచివి అవ్వవు. కాబట్టి, ఎంత ప్రలోభం (temptation) ఉన్నా మంచిని సాధించడానికి అడ్డదారులు త్రొక్కకూడదు.

5. కం. చీత్కారము లడ్డంకులు,
సత్కార్యముఁ జేయఁ బోవ సహజమెఁ గాదా,
తత్కాల విష మణచి యా
పత్కాలము నిర్వహింప ఫల మమృత మగున్.

(చీత్కారములు = చీచీలు, అడ్డంకులు = ఆటంకాలు, తత్కాల = ఆ సమయము, ఆపత్కాలము = ఆపత్తు గలిగిన సమయము, నిర్వహించు = నడిపించు)

క్షీర సాగర మథన వృత్తాంతము ప్రతీకాత్మకంగా ఇచ్చిన సందేశమే, నా ఉద్దేశ్యములో, ఈ పద్యము సారాంశము. ఏదైనా మంచి పని చేయాలి అనుకున్నప్పుడు, ఎదురయ్యే చీచీలు, ఆటంకాలు, తత్కాల (ఆ సమయానికి ఉన్న) విషము లాంటివి. వాటిని అదుపులో పెడితే, అంటే, ఆపత్తు కలిగిన సమయాన్ని ఏదో విధంగా నిర్వహిస్తే, మనకు దక్కే ఫలితము అమృతమవుతుంది. 'సహజము' అంటే 'స్వాభావికము' అనే అర్థంతో పాటు 'కూడ పుట్టినది' అని కూడా అర్థం ఉంది. ఈ పద్యంలో చెప్పిన విషము, అమృతము రెండూ కూడబుట్టినవే. క్రొత్తగా ఏదన్నా ప్రాజెక్ట్ (project) గానీ పని (work) గానీ చేపట్టినప్పుడు, ముందుగా రకరకాల సమస్యలు వస్తాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని పరిష్కరిస్తే లక్ష్యంగా చేసుకున్న మంచి తరువాత జరుగుతుంది.

6. చం. కల సకలాధ్వముల్ మదభిగాములుఁ గావ నెరింగి యజ్ఞతన్
పలుమరు పర్వువెట్టితి నెపంబుల కోర్కెల వెంట గెల్పుకై
కలగితి యొంటరయ్యుఁ బలు కార్యములన్ విఫలత్వ మొందగా
విలువగు కాలమంత యవివేకముఁ దోడ వృధా యొనర్చితిన్.

(సకల = సమస్తమైన; అధ్వము = మార్గము; మత్ = నేను; అభిగాములు = పొందబడినవి, సమీపింపబడినవి; అజ్ఞత = తెలివిలేనితనము; పలుమరు = మాటిమాటికి, చాల తడవలు; పర్వు = పరుగు; నెపము = మిష, వ్యాజము; కలగు = చలించు, కలతపడు)

మహా కవి కాటూరి వేంకటేశ్వరరావు గారి 'పౌలస్త్య హృదయము' అన్న ఖండ కావ్యములో (ఇది స్వగతంలా ఉంటుంది), 'కల సకలాధ్వముల్ మదభిగాములు గావు' అన్న ఎత్తుగడతో ఒక చంపకమాల పద్యం ఉంది. ఆ పద్యం నాకు చాలా ఇష్టం. భక్తికి తొమ్మిది మార్గాలు ఉండగా, అవి కాక వైరభక్తి మార్గం ఎంచుకున్నాను అని రావణుడి చేత చెప్పించడం, ఆ పద్యం సారాంశము. దాని స్ఫూర్తితో మూడు పద్యాలు వ్రాశాను. అవే, ఈ పద్యం, దీని తరువాతి రెండు పద్యాలు.

ఉన్న మార్గాలు అన్నీ నాకు చేతనయ్యేవి కావు అని తెలిసి కూడా తెలివి తక్కువగా, విజయం కోసం ఏదో వంకతో, కోరికలతో చాలా సార్లు పరుగులు పెట్టాను. చాలా కార్యాలలో వైఫల్యము పొంది ఒంటరిగా బాధపడ్డాను. అవివేకముతో, విలువైన కాలమంతా వృధా చేశాను.

7. చం.కల సకలాధ్వముల్ మదభిగాములుఁ గావ నెరింగి మూర్ఖతన్
 పలుచన యయ్యితిన్ సమయపాలనఁ జేయుట యంద విజ్ఞతన్
 తలపగ సిగ్గుఁ గాదె నిరతమ్ము యెదో విజయేశ్ఛ వెంబడిన్
 యలు పెరుగంగ రాని పరు గాపగఁ దోచ దదేమి చిత్రమో.

(పలుచన యగు = లోకువగు, అవిజ్ఞత = తనను తాను అంచనా వేసుకోలేక పోవడం, విజయేచ్ఛ = విజయము నందు వాంఛ)

ఉన్న మార్గాలు అన్నీ నాకు చేతనయ్యేవి కావు అని తెలిసి కూడా, మూర్ఖంగా, సమయపాలన చెయ్యడంలో సరియైన అంచనా వేసుకోలేక పోవడం వల్ల లోకువ అయ్యాను. ఎప్పుడూ ఏదో కావాలని కోరికల వెంబడి అలుపెరుగ కుండా పరుగు పెట్టాను. అదేమి చిత్రమో, ఆ పరుగు ఆపాలని కూడా తోచలేదు. తలుచుకుంటే సిగ్గు కాదా.

8. చం.కల సకలాధ్వముల్ మదభిగాములుఁ గావని యేల చింత? నీ
 బలము స్వధర్మమేఁ గనుక భారమె యైనను స్వీకరించుమా,
 ఫలిత మెద్దైన నేమి యదె భాగ్యమటంచును తృప్తిఁ జెంది నీ
 తులు నిజ జీవితానుభవ తోరణముల్ జతఁ జేసి పంచుమా.

ఉన్న మార్గాలు అన్నీ నాకు చేతనయ్యేవి కావు అని ఎందుకు బెంగ? స్వధర్మాచరణమే నీకున్న బలము. అది, బరువనిపించినా స్వీకరించు. ఫలితమెలా ఉన్నా అదే భాగ్యమని తృప్తి పడు. నీతులను జీవితానుభవాలతో జోడించి పంచు.

9. కం. తనదగు ధర్మాచరణము,
యనవరతముఁ జేయఁ గల్గు యద్భుత శక్తిన్,
మనమున నాటుము దేవా!
జని సార్థకతను ఘటిల్లు జన్నముఁ జేయన్.

(అనవరతము = ఎల్లప్పుడు, జని = పుట్టుక, సార్థకత = ప్రయోజనము, ఘటిల్లు = ప్రాప్తించు, జన్నము = యజ్ఞము)

ఓ దేవా! జన్మ సార్థకత పొందే యాగం చేయడానికి ఎల్లప్పుడు స్వధర్మము ఆచరించే అద్భుత శక్తిని నా మనస్సులో కలిగించుము.

10. ఉ. పల్లెను జీవితమ్ము నొక పక్షిగ నెంచితి, స్వేచ్ఛ నొందితిన్,
చల్లగ పట్నవాసమను చాతురి చేష్టల పంజరమ్ములో,
కల్లలు సత్యముల్ గనుచు, కన్పడు బాధ్యత లన్ని మోయుచున్,
మెల్లగ మింటికిన్ యెగసి, మెప్పులు పొందితి, తృప్తి నందితిన్.

(చాతురి = చతురత్వము, నేర్పు; చేష్ట = క్రియ, పని; మింటికి = ఆకాశానికి; మెప్పు = శ్లాఘన)

గ్రామంలో జీవితాన్ని ఒక స్వేచ్ఛావిహంగంలా అనుకున్నాను. చలాకీ పనులకి ఆవాసమైన పట్నమనే పంజరంలో కల్లలు, నిజాలు చూస్తూ, తెలిసిన బాధ్యతలన్నీ నిర్వహిస్తూ, మెల్లగా పైకొచ్చి అందరి మెప్పులూ పొందాను. తృప్తి నందాను.

11. కం. సాంఖ్యక సేవనుఁ (Indian Statistical Service) జేరి, ప్ర
సంఖ్యానము తెచ్చుకొంటి సాంఖ్యక జగతిన్,
సంఖ్యముఁ జేసితి స్వేచ్ఛగ,
సాంఖ్యక విలువలనుఁ బెంచ సంఘము నందున్.

(సాంఖ్యక సేవ = ప్రజలయొక్క సామాజిక వర్గముల యొక్క సాంఘికార్థిక పరిస్థితులను గురించి క్రమపద్ధతిలో విషయములను సేకరించు సేవ, ప్రసంఖ్యానము = కీర్తి, సంఖ్యము = యుద్ధము, విలువ = ప్రయోజనము)

ప్రజల యొక్క సామాజిక వర్గముల యొక్క సాంఘికార్థిక పరిస్థితులను గురించి క్రమపద్ధతిలో విషయములను సేకరించే ప్రభుత్వ సేవలో (Statistical Service) చేరి, సాంఖ్యక ప్రపంచంలో పేరు తెచ్చుకున్నాను. సంఘంలో సాంఖ్యక శాస్త్ర ప్రయోజనాలు పెంచడానికి పోరాడాను.

12. కం. వీడితి సాంఖ్యక సేవను,
మూడు దశాబ్దముల పైన పూర్తిగ యవ్వన్,
నాడు పడిన శ్రమ యధికము,
యీడేరని కోర్కెలెన్నొ, యీసులు సున్నే.

(ఈడేరు = నెరవేరు, సఫలమగు; కోర్కె = సామాజిక రాజకీయ సంబంధమైన డిమాండు; ఈసు = ఓర్వలేమి, అసహనం; సున్న = నాస్తి, అభావము)

ముప్పై ఏళ్ళు పైన పూర్తి అవగా, సాంఖ్యక సేవను వదిలి పెట్టాను. ఆ కాలంలో పడ్డ శ్రమ ఎక్కువే. నెరవేరని సామాజిక రాజకీయ సంబంధమైన అవసరాలు ఎన్నో ఉన్నాయి. అసహనం మాత్రం ఎప్పుడూ లేదు.

13. కం. సరదాగ పద్య మల్లుట,
గరువమ్మును యదుపు నుంచు గమకముగొనుటల్,

యరమరిక లేక పలుకుట,
పరమై, నను ధన్యుఁ జేయు వర్తన మయ్యెన్.

(సరదా = వినోదము, గరువము = గర్వము, అదుపు = చేయి దాటిపోని స్థితి, గమకముగొను = ప్రయత్నించు, అరమరిక = జంకు, పరము = శ్రేష్ఠము, ధన్యుడు = కృతార్థుడు, వర్తనము = ప్రవర్తనము)

వినోదం కోసం పద్యము వ్రాయడం, గర్వాన్ని అదుపులో ఉంచుకునే ప్రయత్నాలు చేయడం, జంకూ గొంకూ లేకుండా మాట్లాడడం, శ్రేష్ఠమై నన్ను పునీతుణ్ణి చేసే ప్రవర్తన అయ్యింది.

14. ఉ. భార మటంచు నాకు పరివార మశాంతిగఁ జూచుచుండగా,
భారపు చిత్తమున్ జిలికి భావ దరిద్రము వెంట నుండగా,
తీరగు భావమున్ దలచి తెంపుగఁ గూర్ప కవిత్వమట్లుగా
యోరిమికై పరీక్ష, యలవోకను వ్రాయగ లేను పద్యముల్.

(భారము = బాధ, అశాంతి = ఉద్వేగము, చిలుకు = మథించు, తీరగు = చక్కని, తెంపు = సాహసము, ఓరిమి = ఓర్పు, అలవోకను = అనాయాసముగా)

నాకు కష్టమని పరివారము అశాంతిగా చూస్తూ ఉండగా, బరువైన మనస్సుని మథించి భావ దరిద్రము తోడుండగా, చక్కని భావము ఆలోచించి తెగువతో కవిత్వం లాగా అల్లాలంటే అది ఓర్పుకి పరీక్ష. అనాయాసంగా పద్యాలు వ్రాయలేను.

27. హాస్యము

కొంచెం హాస్యం కొంచెం చమత్కారం మేళవించి వివిధ సందర్భాలలో నేను వ్రాసిన పద్యాలు ఈ శీర్షికలో ఇవ్వబడ్డాయి.

1. కం. ఈవికి యడ్డము లోభము,

భావికి యడ్డంబు దుస్స్వభావమె, గ్రోలన్

మోవికి మీసము యడ్డము,

మావియె యడ్డము శిశువుకు మాటుగ పెరుగన్.

(ఈవి = దానము, అడ్డము = ఆటంకము, చాటు, లోభము = పిసినిగొట్టుతనము, భావి = భవిష్యత్తు, దుస్స్వభావము = చెడ్డదైన సహజ గుణము, క్రోలన్ = త్రాగుటకు, మోవి = పెదవి, మావి = గర్భస్థపిండమును చుట్టుకొనియుండు పొర, మాటుగ = చాటుగ, పెరుగు = ఎదుగు)

దానం చెయ్యడానికి లోభత్వము అడ్డము. చెడు స్వభావము భవిష్యత్తుకు ఆటంకము. ఏదైనా త్రాగాలంటే పెదవికి మీసము అడ్డము. మావిని అడ్డం పెట్టుకుని దాని చాటుగా గర్భస్థ శిశువు పెరుగుతుంది.

2. కం. గుడ్మార్నింగ్ డియ రంటిరి,

బెడ్మీ దున్నట్టి నాకు బెస్టుగ తోచెన్,

ఎడ్మైరు చేయు చుంటిని,

బ్రాడ్మైండెడు విజను మీది, బాగున్నారా!

నేను పొద్దున్నే ఇంకా లేవకముందే ఫోను మోగింది. ఎవరో గుడ్మార్నింగ్ చెప్పారు. అప్పుడు అనుకున్న పద్యం ఇది. గుడ్మార్నింగ్ డియర్ (Good Morning Dear) అన్నారు. ఇంకా బెడ్ (bed) మీదే వున్న నాకు బెస్టుగా (best), అంటే మంచిగా, అనిపించింది. మిమ్మల్ని ఎడ్మైరు (admire), అంటే ప్రశంశిస్తున్నాను. మీది బ్రాడ్మైండెడు విజను (broadminded vision), అంటే విశాలమైన దృక్పథం. బాగున్నారా.

3. కం. వేష్టు (waste) గ రెష్టు (rest) న యుంటిని,
సుష్టుగ భోజనము, నిద్ర సుఖ మధికంబై,
రష్ట (rust) ట్టె మనసు సాంతము
మిష్టరి (mystery) నా కాలి గాయ మింతకు తెచ్చెస్.

కొన్నాళ్ళ క్రితం నా కాలికి ఫ్రాక్చర్ (fracture) అవడం వల్ల కదలకుండా పడకకే అంకితమై ఉండాల్సొచ్చింది. ఆ సమయంలో వ్రాసిన పద్యం ఇది. విశ్రాంతిలో వున్నప్పుడు ఎందుకూ పనికిరాకుండా వేస్ట్ గా ఉన్నాను. సుష్టుగా భోజనం, నిద్రసుఖము ఎక్కువై, మనసంతా రస్ట్, అంటే, తుప్పు పట్టేసింది. అసలు రహస్యం ఏమిటంటే, నా కాలి గాయం ఇంతకు తీసుకొచ్చింది.

4. కం. లేమా! వంటలు చెయ్యగ
లేమా? కూరలు తరుగగ లేమా? యేం రా
లేమా షాపింగుకు? కా
లేమా తగు భర్త నీకు? లేమా! చెపుమా!

లేమా! దనుజుల గెలువగ లేమా? అన్న పద్యం పోతనగారి భాగవతంలో ఉంది. దానికి పేరడీ లాంటి పద్యం ఇది. ఓ లేమా! (వనితా!) వంటలు చెయ్యలేమా? కూరలు తరగ లేమా? షాపింగుకు రాలేమా? నీకు తగిన భర్త కాలేమా? చెప్పు.

5. కం. అసలే బద్ధకము సతికి,
పస బట్టగ యత్తగారు పనిఁ జెప్పగనే,
పసిగట్టి బయటపెట్టెను
వ్యసనము మ్రోగిన మొబైలు, పనిగండ మదే.

(పస బట్టగ = సత్తా ఎంతుందో చూద్దామని, పసిగట్టి = గ్రహించి, బయటబెట్టు = వెల్లడిచేయు, వ్యసనము = దురభ్యాసము, పనిగండము = పని చేస్తే వచ్చే ప్రమాదము)

అసలే బద్ధకం ఉన్న అమ్మాయి పసబడదామని వాళ్ళ అత్తగారు పని చెప్పగానే, అది పసిగట్టి, మొబైలు మ్రోగి వ్యసనం కాస్తా బయటపెట్టింది. పనిగండ మంటే అదే.

6. కం. చీటికి మాటికి ధటి నల

వాటుగ పిల్లలు తడుపగ వారినిఁ గనమే?

ధాటిగ వాట్సప్ (WhatsApp) నందున

వోటెత్తు మెసేజు (messages) లన్న వొందు సుఖ మదే.

(చీటికి మాటికి = మాటిమాటికి, ధటి = గోచి, ధాటిగ = ఎడతెఱపి లేకుండా, వోటెత్తు = ఉప్పెనలాగా వచ్చే, మెసేజులు = సందేశాలు)

మాటిమాటికి అలవాటుగా పిల్లలు చెడ్డీ తడుపుకోవడం చూడమా? ఎడతెఱపి లేకుండా ఉప్పెనలాగా వచ్చే వాట్సప్ మెసేజీలు (WhatsApp messages) అంటే వొందే సుఖము అలాంటిదే.

7. కం. గుర్రము తేరగ వచ్చిన

బర్రున తఱుమంగ తంగ బరికే చాలున్,

యెర్రని యేగానిఁ దగని,

కుఱ్ఱ మనువు కర్ధణాయె గొప్ప వ్యయంబౌ.

(తేరగ = ఉచితంగా, తఱుము = పరిగెత్తించు, తంగ = ఎక్కడబడితే అక్కడ దొరికే తంగేడు, బరిక = బెత్తము, తగు = సరిపడు, కుఱ్ఱ = కొడుకు, మనువు = వివాహము, అర్ధణా = అణాలో సగము, వ్యయము = ఖర్చు)

తేర గుర్రము తంగేడు బరికె అన్న సామెత ఉంది. అంటే, గుర్రం ఉచితంగా వస్తే, దాన్ని పరిగెత్తించడానికి ఖరీదైన హంటరు ఎందుకు? తంగేడు బెత్తం చాలు. అలాగే, ఎర్రని ఏగాని కూడా చెయ్యని కుర్రాడి పెళ్ళికి అర్ధణాయే గొప్ప ఖర్చు కింద లెక్క.

8. కం. చెడ్డీ తొడుగుట నేర్వని,

బొడ్డూడని బుడ్డగాళ్ళ బొట్టెల స్కూళ్ళన్,

విడ్డూరము విద్య, విధులు,

మిడ్డీ లేసెడి మిటార్ల మిలమిల మెరుపుల్.

(బొడ్డూడని = వయస్సురాని, బుడ్డగాళ్ళు = చిన్నవాళ్ళు, బొట్టెల = బిడ్డల, విడ్డూరము = వింత, మిడ్డీ = ఆడవాళ్ళు వేసుకునే ఒకరకమైన డ్రస్సు, మిటారి = విలాసవతి)

చెడ్డీ తొడుక్కోవడం కూడా చేతఁగాని బొడ్డూడని పిల్లల స్కూళ్ళలో చదువులు, ఏర్పాట్లు, మిడ్డీలు వేసుకుని తిరిగే విలాసవతుల మిలమిల మెరుపులు వింతగా ఉంటాయి.

9. కం. గ్రీష్మమున వడియములకై

కూష్మాండము తెచ్చి తరిగి కురచని ముక్కల్

యూష్మంబున నుంచగ య

ర్చిష్మంతుని జాడఁ బోయి చినుకులు కురిసెన్.

(గ్రీష్మము = వేసవి, కూష్మాండము = బూడిదగుమ్మడి, కురచ = చిన్న, ఊష్మము = ఎండ, అర్చిష్మంతుడు = సూర్యుడు, జాడ = ఆచూకి)

వేసంకాలంలో వడియాలు పెట్టడానికి బూడిదగుమ్మడి కాయ తెచ్చి చిన్న చిన్న ముక్కలు తరిగి ఎండలో పెట్టంగానే సూర్యుడి జాడ పోయి చినుకులు కురిశాయి.

10. కం. అలు పెరుగక పతి పూజలు

సలిపెడి యొక ధర్మపత్ని సాష్టాంగ పడన్

సలుపును నడు మొంచిన యని,

తలకిందులుఁ జేసె పతిని తన కనువనుచున్.

(అలుపు = బడలిక, సలిపెడి = చేసెడి, ధర్మపత్ని = సహధర్మచారిణి, సాష్టాంగ పడన్ = పాదనమస్కారం చేయుటకు, సలుపును = నొప్పి పెట్టును, తలకిందులు = అధోముఖముగా, పతి = భర్త, అనువు = వీలు)

ఎక్కడో ఒక కార్టూనులో చూశాను. శ్రావణ శుక్రవారం నాడు ఒక భార్య భర్తకి సాష్టాంగ ప్రణామం చేద్దామనుకుంటుంది. కానీ, నడుంనెప్పి సమస్య వచ్చిపడింది. ఎట్లా? భర్తని తలక్రిందులు చేసి, అప్పుడు ఆయన పాదాలకి నమస్కారం చేసింది. ఆ కార్టూను ఆధారంగా వ్రాసిన పద్యం ఇది. అలుపెరగకుండా భర్తకి పూజలు చేసే ఒక ధర్మపత్ని, సాష్టాంగ పడడానికి నడుమొంచితే నెప్పి పెడుతుందని, తనకు వీలుగా ఉంటుందని, భర్తను తలక్రిందులుగా చేసింది.

11. కం. అద్దము ముందర, బుడుగా!
నిద్దుర నటియించ నేల నీవనఁ, జెప్పెన్
నిద్దురలో నేనెంతో
ముద్దుగ నుందు నని నాకు ముందే తెలియన్.

బాపుగారి బుడుగు కార్టూన్లలో ఒక కార్టూను అధారంగా వ్రాసిన పద్యం ఇది. బుడుగు అద్దం ముందు కూర్చుని నిద్దర నటిస్తూ ఉంటాడు. ఎందుకలా చేస్తున్నావని అడిగితే, "నాకు ముందే తెలుసు, నేను నిద్దట్లో చాల ముద్దుగా ఉంటానని" అని సమాధానం చెబుతాడు.

12. కం. ఆయుధ పూజకు వేరుగ
యాయుధములు యేల? యింట నాయుధ ముండన్,
వాయి యదుపు లేని సతి స
తాయించును సతత మదియె దళపము నోమన్.

(వాయి = నోరు, అదుపు = స్వాధీనము, సతి = భార్య, సతాయించు = ఇబ్బందిపెట్టు, సతతము = ఎల్లప్పుడు, దళపము = ఆయుధము, నోము = పూజించు)

ఎక్కడో ఒక కార్టూను చూసి వ్రాసిన పద్యం ఇది. విజయదశమికి ఆయుధ పూజ చేయడం ఆచారము. ఆయుధ పూజకు, ఇంటిలో ఆయుధ ముండగా, వేరే అయుధాలు ఎందుకు? నోరు అదుపులేని భార్య ఎప్పుడూ సతాయిస్తూ ఉంటుంది కదా. అదే పూజించడానికి ఆయుధము.

13. కం. చోద్యంబీ వైషమ్యము,
మద్యము మత్తిచ్చు మీకు మాపును రేపున్,
హృద్యము రస రంజకమగు
పద్యము మత్తిచ్చు నాకు పాడుకొనంగన్.

(చోద్యము = ఆశ్చర్యము, వైషమ్యము = భేదము, మాపు = సాయంకాలము, రేపు = ప్రాతఃకాలము, హృద్యము = మనస్సునకింపైన, రస రంజకము = నవ రసాలతో ఆనందకరము, మత్తు = కైపు)

ఈ భేదం వింతగా ఉంటుంది. పొద్దునా, సాయంకాలం మీకు మద్యం మత్తిస్తే, మనస్సున కింపైనది నవ రసాలతో ఆనందకరమైనది అగు పద్యము పాడుకోగా నాకు మత్తిస్తుంది.

14. కం. ఏమనిఁ జెప్పుదు నింటను
సామాను సరుదు నొబగును? జాడీ లుండున్
యాముక్తముల యలమర
న్మామిడి పచ్చళ్ళుఁ బెట్టి, మా కిది యెరుకే.

(సామాను = వస్తువులు, సరుదు = క్రమముగానుంచు, నొబగు = విధము, ఆముక్తములు = వస్త్రములు, పచ్చడి = ఊరగాయ, ఎరుక = పరిచయము)

కొన్ని ఇళ్ళల్లో సామాన్లు చాలా చిందర వందరగా ఉంటాయి. ఎప్పుడూ ఏదో ఒక వస్తువు కోసం వెతుక్కుంటూ ఉంటారు. అటువంటి సంసారాల గురించి వ్రాసిన పద్యం ఇది. ఇంట్లో సామాను సద్దే తీరు గురించి, ఏమి చెప్పమంటారు? బట్టల అలమరాలో మామిడి ఊరగాయలు పెట్టిన జాడీలుంటాయి. ఇది మాకు తెలిసిందే.

15. కం. పదవీ విరమణ దరిమిల,
సదమద మీగలనుఁ జేయు చందము సిగ్గై,
వధు వీగ బారి పడునని
పదిలముగాఁ గాయు పనియె బాధ్యత యందుస్.

(దరిమిల = పిమ్మట, సదమదముచేయు = చంపు, చందము = విధము, వధువు = భార్య, బారిన = హింసను, పదిలము = జాగరూకత, కాయు = కాపాడు, బాధ్యత = జవాబుదారీ)

పదవీ విరమణ (retirement) తరువాత, ఈగలను చంపుతున్న పైనము సిగ్గనిపించి, భార్య ఈగ బారిని పడకుండా జాగ్రత్తగా కాపాడే పనే బాధ్యత అని అంటాను. అంటే, భార్య మీద ఈగ వాలకుండా చూసుకోడమే పని అన్న మాట.

16. 2023లో తెలంగాణా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ఫలితాల గురించి

తే.గీ. రెండు పిల్లులు రొట్టెకై ప్రేటులాడ
కోతి తగవు తీర్చగ రొట్టె కొరికి తినెను
కాంగ్రె సటులె గెలిచె తెలంగాణ మందు
కారు కమలము గుర్తుల జోరు తగ్గ (పోరు నడుమ)

(ప్రేటులాడు = పోట్లాడు, జోరు = సంరంభము)

రెండు పిల్లులు రొట్టె కోసం పోట్లాడుకోగా కోతి తగవు తీర్చడానికి రొట్టె కొరికి తినేసింది. తెలంగాణములో కారు గుర్తు (భారత రాష్ట్ర సమితి పార్టీ గుర్తు), కమలము గుర్తుల (భారతీయ జనతా పార్టీ గుర్తు) సంరంభము తగ్గిపోగా (పోరాటం మధ్యలో), కాంగ్రెసు పార్టీ ఆ విధంగానే గెలిచింది.

17. ఆ.వె. కోడి జన్మ దినము, కుక్కకు పేవిళ్ళు,

చీమ బోర్లఁ బడుట, దోమ తుమ్ముట,
వేడుకలకు యేమి వీసర శ్రీలున్న,
యాస్తి యెటుల వచ్చు నటులెఁ బోవు. (విశ్వదాభిరామ వినుర వేమ)

(వేవిళ్ళు = గర్భలక్షణ వికారములు, వీసర = వెలితి, శ్రీలు = సంపదలు)

కోడి పుట్టిన రోజు, కుక్కకి వేవిళ్ళు, చీమ బోర్లా పడటం, దోమ తుమ్మడం - ఈ విధంగా డబ్బుండాలే గానీ వేడుకలకి కొదవా, అస్తి ఎట్లా వచ్చిందో అట్లాగే పోతుంది.

18. కం. అత్త యన పోట్లగిత్తగ
అత్తన గయ్యాళిఁ గాగ, ఆరడిఁ బెట్టన్
అత్తన్న సూర్యకాంతమె,
అత్తెరగున యెవరుఁ గలరు అవనీ స్థలిలో?

(పోట్లగిత్త = కలహాశీలి, గయ్యాళి = ధిక్కరించి మాటాడునది, ఆరడిపెట్టు = నిందమోపు, తెరగు = విధము, అవని = భూమి, స్థలి = ప్రదేశము)

అత్త అంటే కలహాశీలిగా, అత్తంటే గయ్యాళిగా, నింద మోపడంలో అత్తంటే సూర్యకాంతమే. ఆ విధంగా భూప్రపంచంలో ఎవరు ఉన్నారు?

19. తే.గీ. మాట వినని వాడి వనుచు మగడ నిన్ను
పెండ్లి నాడనుకొంటి, యా పిదప నిపుడు
వంట యింట నీవు సతము యుంటఁ జూచి,
వందనముఁ జేతును కరోన వర మిదంచు.

(మగడు = భర్త, పిదప = తరువాత, సతము = ఎల్లప్పుడు, వందనము = నమస్కారము, వరము = దేవతానుగ్రహము)

ఓ! మగడా! మాట వినని వాడివి అని నిన్ను పెళ్ళి నాడు అనుకున్నా. ఆ తరువాత, ఇప్పుడు నువ్వు వంటిట్లో ఎప్పుడూ ఉండటం చూసి ఇది కరోనా దేవత అనుగ్రహం అని నమస్కారం చేస్తాను.

20. తే.గీ. ఏరు తిట్టిన పొగులు నా తీరుఁ జూచి,
నీవు తగ్గక వారిని నిష్ఠురముల
నాడి బదులుఁ జెప్పు మనుచు నాకు నేర్పి
నావు, యట్టి దియ్యెడ, నీవు నన్ను దూష
ణముల నాడ నిన్ను విడుతునాఁ? దెలుపుము,
నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష!

(ఏరు = ఎవరు, పొగులు = దుఃఖముచేత తపించు, తీరు = వైఖరి, నిష్ఠురము = పరుషవచనము, బదులు చెప్పు = సమాధానం చెప్పు, ఇయ్యెడ = ఇప్పుడు, దూషణము = దుర్భాష, విడుచు = వదలు, నీరజ = కమలము, అక్షి = కన్ను)

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష" అన్నది చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి "గయోపాఖ్యానము" అన్న నాటకంలోని ప్రసిద్ధ పద్యపాదము. దాన్ని వేరే సందర్భంలో ఉపయోగిస్తూ వ్రాసిన పద్యం ఇది. కొంత మండి ఎవరు తిడుతున్నా భయం చేత బదులు చెప్పక నోరు మూసుకుని పడివుంటారు. ఒంటరిగా కూర్చుని అది తలచుకొని తలచుకొని ఏడుస్తూ ఉంటారు. అలాంటి వారిలో ఒకళ్ళకి ఎదురు తిరగడం నేర్పితే, ఆ విద్యలో రాటుదేలి విద్య నేర్పిన వాళ్ళ దగ్గరే ప్రదర్శిస్తే ఎట్లా ఉంటుందో ఈ పద్యంలో చూస్తాము. ఎవరు తిట్టినా దుఃఖముచేత తపించే నా వైఖరిని చూసి, నువ్వు తగ్గకుండా వాళ్ళతో పరుష వాక్యాలు మాట్లాడి సమాధానం చెప్పమంటూ నాకు నేర్పావు. అట్లాంటిది ఇప్పుడు నువ్వు నన్ను దుర్భాష లాడుతుంటే వదులుతానా, చెప్పు? ఓ, కమలాక్షా! నువ్వు నేర్పిన విద్యే ఇది.

21. చం. తరుణుల లంకరించు కొనిఁ దర్లగ పెండ్లికుమార్తె వెంట, యా
మురిపెముఁ జూచిఁ బోల్చుటె ప్రమోదము పెండ్లికుమార్తె నందునన్,
మరచెను నారికేళ మని మారుగ నివ్వగ తమ్ములమ్ము, యా

తురతను పెండ్లికూతు రది తోడ్కొని వచ్చు పథమ్ము నందు త్రో
వరులు, యిదేమి వింత? యిట భారము మోయుదు వీవు, పెండ్లికూ
తురువె? యనంగ, సందియముతో తళుకించ మిటారముస్ జనస్
త్వరితముగస్ గదిస్ మరల తామస మయ్యె వివాహ వేదికస్,
వరుని నిరీక్షణస్ నెరిసె వాని శిరోజము శ్మశ్రువుల్ గడుస్.

(తరుణి = యువతి, అలంకరించు = సింగారించు, తర్లు = బయలుదేరు, మురిపెము = ముద్దుతనము, పోల్చు = సరిపోల్చు, ప్రమోదము = వేడుక, నారికేళము = టెంకాయ, మారుగ = బదులు, తమ్ములము = తాంబూలము, ఆతురత = తొందరపాటు, తోడ్కొను = వెంటఁగొను, పథము = మార్గము, త్రోవరి = బాటసారి, భారము = బరువు, ఈవు = నీవు, సందియము = అనుమానము, తళుకించు = ప్రకాశింపచేయు, మిటారము = సోయగము, చను = వెళ్ళు, త్వరితము = శీఘ్రము, గది = ఇంటిలోపలి యఱ, మరల = మళ్ళీ, తామసము = ఆలస్యము, వేదిక = యజ్ఞమునకై యేర్పఱుపఁబడిన తిన్నె, వరుడు = పెండ్లికొడుకు, నిరీక్షణ = ఎదురుచూచుట, నెరియు = వెంట్రుకలు తెల్లబడు, శిరోజము = తలవెంద్రుకలు, శ్మశ్రువులు = గడ్డము మీసములు, కడు = అధికము)

యువతులు సింగారించుకొని పెండ్లికుమార్తె వెంట తరలగా, ఆ ముచ్చట చూసి అందులో పెళ్ళికూతురు ఎవరో పోల్చుకోవడమే వేడుక. అంటే, యువతులు అందరు బాగా అలంకరించుకోవడం వల్ల ఎవరు పెళ్ళికూతురో తెలుసుకోవడం కష్టము. టెంకాయ మరచి పోయింది అని తాంబూలం ఇవ్వగా తొందరపాటుతో పెండ్లికూతురు అది తీసుకొని వచ్చే మార్గంలో బాటసారులు - ఇదేమి వింత? ఇక్కడ బరువు మోస్తావు నువ్వు (తమలపాకు అంత బరువు మోయిస్తారా పెళ్ళికూతుర్ని?), పెళ్ళికూతురువేనా? అని అనగా, అనుమానంతో సోయగాన్ని ప్రకాశింపఁ జేయడానికి శీఘ్రంగా గదికి మళ్ళీ వెళ్ళగా, వివాహ మండపంలో ఆలస్య మయ్యింది. వరుని నిరీక్షణ వల్ల అతని శిరోజాలు, గడ్డము, మీసాలు నెరిసి పోయాయి.



పేరు	:	మద్దాలి వేంకట సత్య రంగనాధం
పుట్టిన తేదీ	:	25-09-1958
జన్మస్థలం	:	చిరువోలు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
విద్యార్హతలు	:	M.Sc; BL
విద్య నభ్యసించిన విద్యా సంస్థలు	:	జిల్లా పరిషత్ హైస్కూలు, మోపిదేవి; శాతవాహన కళాశాల, విజయవాడ; ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం; ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
వృత్తి / అనుభవం వివరాలు	:	భారతీయ సాంఖ్యక సేవ (Indian Statistical Service) సభ్యునిగా కేంద్ర ప్రభుత్వంలో 36 సంవత్సరాలకు పైగా అనుభవం; సెప్టెంబరు 2018లో డైరెక్టర్ జనరల్ గా సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీసులో (ఢిల్లీ) పదవీ విరమణ
ప్రస్తుత వ్యాసంగం	:	తెలుగు సాహిత్యం చదవడం, వ్రాయడం; సమకాలీన సమస్యలు విశ్లేషించి ప్రభుత్వాలకు, అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం
కుటుంబ వివరాలు	:	భార్య: కామేశ్వరి; కుమారుడు: భారత్; కుమార్తె: స్వాతి; కోడలు: కోమల్; మనుమరాలు: ఈరా
గత ప్రచురణలు	:	శ్రీరాముని అంతరంగము (Paperback & E-book) in July 2025 దత్తపదుల సమాహారం (E-book) on 12th August 2025 సమస్యాపూరణాల సమాహారం (E-book) on 1st September 2025
బ్లాగు వివరాలు	:	https://mvsranganadham.in/

ISBN 978-93-344-0753-2
9 789334 407532